thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 34 కరీంనగర్ మంగళవారం, 15 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### రూ. 13, 500 కోట్లు మోసం చేసిన మెహుల్ ఛోక్సీ...

డైమండ్ వ్యాపారి మెహుల్ ఛోక్సీ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ఆయన చాలా ఫేమస్. పంజాబ్ నేషనల్ బ్యాంకు పేరు చెప్పగానే ముందుగా గుర్తించేది ఆయనే. ఎందుకంటే, ఆయన ఆ రేంజ్‌లో బ్యాంకుని మోసం చేసి ఎస్కేప్ అయ్యాడు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 13, 500 కోట్ల రూపాయలను మోసం చేసి విదేశాలకు చెక్కేసాడు. అయితే, ఈ నిందితుడిపై భారత్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. అతడిని ఎలాగైనా స్వదేశానికి రప్పించాలనే ప్లాన్ చేసింది. ఈ నేపథ్యంలోనే సీబీఐ అధికారుల కోరిక మేరకు మెహుల్ ఛోక్సీని ఎట్టకేలకు బెల్జియం పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం అతడు బెల్జియం జైలులో ఉన్నాడు.

# దేశానికి అంబేద్కర్ చేసిన...

# సేవలు అజరామరం!

## రాజ్యంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌కు రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, తెలుగు రాష్ట్రాల సీఎంల ఘన నివాళి!





భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా దేశ ప్రజలు ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీలు నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. వీరితో పాటు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, రాజ్యసభలో సభా నాయకుడు జెపి నడ్డా, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. అంబేద్కర్? జయంతిని పురస్కరించుకుని ఆ మహనీయునికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అట్టడుగు వర్గాలకు అవకాశాల కోసం అంబేద్కర్ పేరిట నాలెడ్జ్ సెంటర్లు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రాజీవ్ యువ శక్తి పథకం ద్వారా యువతకు స్వయం ఉపాధి అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజల హక్కుల కోసం అంబేద్కర్ చేసిన పోరాటం ప్రపంచానికి ఆదర్శమని, ఆయన ఆశయాలను సాకారం చేయడానికి అందరూ కృషి చేయాలని సీఎం రేవంత్ అన్నారు. ఇక నాంపల్లిలోని బీజేపీ ఆఫీస్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ క్రమంలో రాష్ట్ర బీజేపీ నాయకులు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుందామని ఏపీ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ నిర్మాతగా, స్వతంత్ర భారత తొలి న్యాయశాఖ మంత్రిగా, ఆ మహానుభావుడు అందించిన సేవలు చిరస్మరణీయమని సీఎం చంద్రబాబు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనకు హృదయపూర్వకంగా అంజలి ఘటిస్తున్నట్లు ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. అన్ని వర్గాలకు భరోసా కల్పిస్తూ..కూటమి ప్రభుత్వం అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తుందని ఆయన తెలిపారు. డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ సామాజిక సంస్కర్త, ఆర్థికవేత్త, రాజకీయవేత్త, ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి. సమాజంలోని అణగారిన వర్గాలపై సామాజిక, కుల వివక్షను అంతం చేయడానికి నిరంతరం కృషి వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్. స్వతంత్ర భారతదేశానికి తొలి న్యాయ మంత్రిగా పనిచేసిన వ్యక్తి. 1990లో మరణానంతరం ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం, భారతరత్న లభించింది.

## అంబేద్కర్ అభయహస్తం అమలు చేసేదెప్పుడు? దళితులకు 12 లక్షలు ఇచ్చేదెప్పుడు?: కేటీఆర్

హైదరాబాద్: కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆధునిక భారతావనికి పునాదులు వేశారని తెలిపారు. బాబాసాహెబ్ ఆలోచన, ముందు చూపు చాలా గొప్పదని వెల్లడించారు. దేశంలో అందరూ బాగుండాలన్నదే అంబేద్కర్ ఆలోచన అని చెప్పారు. అంబేద్కర్ ఆలోచనను కేసీఆర్ ఆచరణలో పెట్టారన్నారు. దళితబంధు లాంటి పథకాన్ని అమలు చేసిన దమ్మున్న నాయకుడు కేసీఆర్ అన్నారు. అబద్ధపు ప్రచారంతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నదని, దళితులకు అంబేద్కర్ అభయహస్తం ఇంకెప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. రూ.12 లక్షల కాదుకదా.. 12 రూపాయలు కూడా ఇవ్వరని విమర్శిం



చారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేటీఆర్.. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు అంబేద్కర్ ఆలోచనలే కారణమన్నారు. ప్రజాస్వామ్యంలో మందబలంతో అవతలివారి గొంతు నొక్కేయడం ఉండకూడదని అందరితో కొట్లాడి కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు ఉన్న రాష్ట్రం అనుమతి ఉండాల్సిన అవసరం లేదని పేర్కొంటూ రాజ్యాంగంలో ఆర్టికల్ 3ని పొందుపర్చారన్నారు. మనం ఇప్పుడు తెలంగాణలో మాట్లాడుతున్నామంటే దానికి కారకుడు ఒకేఒక్కరు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని చెప్పారు. బాబాసాహెబ్ ఆలోచన, ముందు చూపు చాలా గొప్పదన్నారు.



## ఎస్సీ వర్గీకరణ అమలు చేయడమే అంబేద్కర్ కు ఘన నివాళి.. రేవంత్

హైదరాబాద్ : ఎస్సీ వర్గీకరణ అమలు చేయడమే అంబేద్కర్ కు ఘన నివాళి అని సీఎం రేవంత్ అన్నారు. భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద ఆ మహనీయుని విగ్రహానికి సీఎం రేవంత్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వెంట ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, పలువురు నేతలు పాల్గొని బాబాసాహెబ్ సామాజిక సమానత్వ సందేశాన్ని స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే అంబేద్కర్ జయంతి సందర్భంగా సీఎం రేవంత్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ%ౌ% అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణతో 3 దశాబ్దాల పోరాట ఆకాంక్షలు నెరవేర్చుడమన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. రైతుకు, రైతు కూలీలకు ఎకరాకు రూ.12 వేల ఆర్థిక భరోసా సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ల పథకం, భూ భారతికి శ్రీకారం చుట్టడం ఆ మహనీయుడికి ఘన నివాళి అని ఎక్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.




హైదరాబాద్, ఏప్రిల్ 14: తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ జీవో విడుదలైంది. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సర్కార్ ఈ జీవోను విడుదల చేసింది. ఈనెల 8న దీనికి సంబంధించిన బిల్లును గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు సర్కార్ పంపించగా.. అందుకు గవర్నర్ ఆమోదం తెలిపారు. దీంతో ఇప్పటి వరకు ఒకే విధంగా అమలైన రిజర్వేషన్లు ఇకపై వర్గీకరణ ప్రకారం అందించనున్నారు. ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో కూడా అధికారులు గెజిట్ విడుదల చేశారు. రాష్ట్రంలో మొత్తం 59 ఉప కులాలను మూడు గ్రూపులకు విభజించారు.

గ్రూప్ ఏలో 15 ఉపకులాలకు ఒక శాతం రిజర్వేషన్లు కేటాయించారు. గ్రూప్ బీలో 18 ఉప కులాలకు 9 శాతం, గ్రూప్ సీలో 26 ఉప కులాలకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఎస్సీ వర్గీకరణ అమలు అయిన నేపథ్యంలో ఇకపై ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలను ఈ గ్రూపుల ప్రాధాన్యత ఆధారంగా భర్తీ చేయనున్నారు.




# భూ సమస్యలకు ఇక చెల్లుచీటీ

## 'భూభారతి'ని ప్రజలకు అంకితం చేసిన సీఎం రేవంత్

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూభారతి చట్టం అమల్లోకి వచ్చింది. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న భూ భారతి పోర్టల్‌ను హైదరాబాద్ లోని శిల్పకళా వేదికలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ భట్టి విక్రమార్క స్పీకర్ గడ్డం ప్రసాద్,మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, మంత్రులు ఉత్తమ్,పొంగులేటి, పొన్నం,జూపల్లి ,మేయర్ గద్వాల విజయలక్ష్మీ పలువురు నేతలు, రెవెన్యూ అధికారులు హాజరయ్యారు. 566 రైతువేదికలలో భూ భారతి పోర్టల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ చేశారు. భూ భారతి అమలుకు పైలట్ ప్రాజెక్ట్ గా నల్గొండ జిల్లాలోని తిరుమలగిరి సాగర్, రంగారెడ్డి జిల్లాలోని కీసర, సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇన్నాళ్లు ధరణి పోర్టల్‌లో జరిగిన వ్యవసాయ భూముల అమ్మకాలు, కొనుగోళ్లు.. ఇకపై భూ భారతి పోర్టల్‌లోనే జరగనున్నాయి. గతంలో ధరణి తీసుకొచ్చిన సమయంలో భూముల లావాదేవీలకు కొన్నిరోజుల పాటు ఆటంకం ఏర్పడగా, ఈసారి అలాంటి ఇబ్బందులేవీ లేకుండా ప్లాన్ చేశారు. ధరణిలో ఎలాంటి సేవలు అందాయో, ఇప్పుడు అవన్నీ భూభారతి లోనూ యథావిధిగా అందనున్నాయి. భూములకు సంబంధించి అప్‌డేట్ ఉన్న సమాచారం అలాగే ఉండనుంది. ఎలాంటి మార్పులు ఉండవు. అయితే రైతులకు అర్థమయ్యేలా ఇంతకుముందు ఉన్న 33 మాడ్యుల్స్‌ను ఆరుకు కుదించారు. యూజర్ ఫ్రెండ్లీగా వెబ్?పోర్టల్‌ను తీసుకురావడమే కాకుండా ఇతర టెక్నికల్ సమస్యలను తొలగించారు.

**దశలవారీగా చట్టం అమలు..** భూభారతి చట్టాన్ని పోయినేడాది డిసెంబర్‌లో ప్రభుత్వం తీసుకొచ్చింది. దీన్ని అమలు చేసేందుకు అవసరమైన గైడ్‌లైన్స్ రెడీ చేసి, ఏప్రిల్ 14 నుంచి దశలవారీగా ఇంప్లిమెంట్ చేయనుంది. చట్టంలోని అన్ని అంశాలను ఒకేసారి అమలు చేస్తే మళ్లీ సమస్యలు వచ్చే అవకాశం ఉందని భావించిన ప్రభుత్వం.. ఒక్కొక్కటిగా అమలు చేయాలని నిర్ణయించింది. ఈ చట్టంలో మొత్తం 23 అంశాలు ఉన్నాయి. ప్రతి సెక్షన్ అత్యంత కీలకంగా ఉంది. ప్రతిదీ వెబ్ పోర్టల్‌కు లింక్ చేయాల్సి ఉంటుంది. దీంతో ముందుగా ఈజీగా ఉన్న వాటన్నింటినీ అమలు చేయనున్నారు. ఆ తర్వాత టెక్నాలజీని జోడించి, ఒక్కోదాన్ని అమలు చేసుకుంటూ వెళ్లనున్నారు. ఇప్పుడైతే రాష్ట్రవ్యాప్తంగా పోర్టల్ అందుబాటులోకి వస్తుంది. ఇకపై అందులోనే భూముల కొనుగోళ్లు, అమ్మకాలు జరుగుతాయి. అయితే భూభారతి చట్టం అమలు, పోర్టల్ నిర్వహణలో ఏమైనా ఇబ్బందులు వస్తున్నాయా? అనేది తెలుసుకునేందుకు మూడు మండలాల్లో అధ్యయనం చేయనున్నారు. ఇందుకోసం నల్గొండ జిల్లాలోని తిరుమలగిరి సాగర్, రంగారెడ్డి జిల్లాలోని కీసర, సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మండలాల్లో వంద శాతం భూసమస్యలను పరిష్కరించే విధంగా ముందుకెళ్తున్నది. ఇంతకుముందు ధరణిలా కాకుండా రైతులు తమ భూమి వివరాలను తేలిగ్గా తెలుసుకునేలా భూభారతి పోర్టల్ రూపొందించారు.

చురకలు






హైదరాబాద్: 'గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్' బిల్లు ముసాయిదా సిద్ధం చేయాలని కార్మిక శాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. గిగ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించేలా బిల్లు రూపొందించాలన్నారు. గిగ్ వర్కర్ల భద్రతపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. వారికి బీమా, ఇతర హక్కులు కల్పించేలా బిల్లు ఉండాలన్నారు. బిల్లు ముసాయిదాను ఆన్‌లైన్‌లో పెట్టాలని.. ప్రజల అభిప్రాయాన్ని సేకరించాలని సీఎం ఆదేశించారు. సూచనలను తీసుకొని, వాటిని పరిశీలించి తుది ముసాయిదాను రూపొందించాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. గిగ్‌వర్కర్ల చట్టంలో కార్మికుల భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. కంపెనీలు, అగ్రిగేటర్లను సమన్వయం చేసేలా కొత్త చట్టం ఉండాలని చెప్పారు. ఈ నెల 25 నాటికి బిల్లు తుది ముసాయిదాను సిద్ధం చేయాలన్నారు. మే డే రోజున చట్టం అమల్లోకి తెచ్చేలా ఏర్పాట్లు చేయాలని కార్మిక శాఖ ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు.

## అడవులపైకి బుల్డోజర్లను పంపడంలో తెలంగాణ ప్రభుత్వం బిజీబిజీ: మోదీ



హరియాణా: తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో తీవ్ర చర్చనీయాంశమైన కంచ గచ్చిబౌలి భూముల అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. హరియాణాలో ప్రధాని మాట్లాడుతూ.. అడవులపై బుల్డోజర్లు పంపడంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బిజీగా ఉందని విమర్శించారు. 'ప్రకృతి నాశనం, వన్యప్రాణులకు హాని'.. ఇదే కాంగ్రెస్ పాలనని వ్యాఖ్యానించారు. అటవీ సంపదను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలను సైతం కాంగ్రెస్ మర్చిపోయిందని మోదీ ఎద్దేవా చేశారు.



## ఎస్సీ వర్గీకరణపై మాట్లాడిన ఏ పార్టీ ముందుకెళ్లలేదు: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ అన్నారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రులు మాట్లాడారు. తొలుత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన జీవో విడుదల చేసి మొదటి కాపీని సీఎం రేవంత్‌రెడ్డికి అందించామన్నారు.

"ఎస్సీ వర్గీకరణపై గతంలో అసెంబ్లీలో అన్ని పార్టీల వారు మాట్లాడారు. కానీ ఏ పార్టీ కూడా దీన్ని ముందుకు తీసుకెళ్లలేదు. మా ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ దిశగా ప్రయత్నాలు చేపట్టాం. సుప్రీంకోర్టు తీర్పు వచ్చాక ప్రక్రియను వేగవంతం చేశాం. మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసుకుని ముందుకెళ్లాం. కొన్ని వేల విజ్ఞప్తులు వచ్చాయి.. వాటిని ఎంతో అధ్యయనం చేశాం" అని తెలిపారు. ఇవాళ్టి నుంచి ఎస్సీ వర్గీకరణ అమల్లోకి వచ్చిందని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. దళితుల్లో సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలు ఉండకూడదన్నారు. "ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేసుకున్నాం. కొన్నివేల విజ్ఞప్తులు అందుకుని అధ్యయనం చేశాం. విద్య, ఉద్యోగాల్లో ఇకపై ఇచ్చే నోటిఫికేషన్లకు ఎస్సీ వర్గీకరణ అమలవుతుంది. ఇవాళ్టి నుంచి భారీ స్థాయిలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వబోతున్నాం"అని రాజనర్సింహ తెలిపారు.

## కాంగ్రెస్ నేతలు అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాలరాసి ఎమర్జెన్సీ విధించారు: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: కాంగ్రెస్ నేతలు అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాలరాసి గతంలో ఎమర్జెన్సీ విధించారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆనాడు ప్రజలు ఎదురుతిరిగి ఆ పార్టీకి బుద్ధి చెప్పారన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్ వద్ద ఆయన విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడారు. "ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని రాజ్యాంగం నిలబడింది అంటే అది అంబేద్కర్ గొప్పతనం. అంబేద్కర్ నెట్‌వర్క్ పేరుతో ఆయనకు సంబంధించిన ఐదు ప్రాంతాలను పర్యటక కేంద్రాలుగా తీర్చిదిద్దాం. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచేలా చేసిన ఘనత ప్రధాని మోదీదే. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతారు.. ఒక్క పేజీ కూడా ఆయన చదివిన దాఖలాలు లేవు. రాష్ట్రంలో ప్రతి కేజీ సన్నబియ్యం వెనుక కేంద్రం ఇచ్చే రూ.37 ఉన్నాయి. కానీ.. కాంగ్రెస్ నేతలు తామే ఇస్తున్నట్లు చెప్పుకొంటున్నారు. 2047 నాటికి అవినీతి రహిత అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడమే మన లక్ష్యం" అని కిషన్‌రెడ్డి అన్నారు.

## ఇది కాలం పెట్టిన శాపం కాదు.. కాంగ్రెస్ శరగోపం: కేటీఆర్



హైదరాబాద్: కాంగ్రెస్ అంటే కరవు.. కరవు అంటే కాంగ్రెస్ అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎద్దేవా చేశారు. భారాసపై కక్షతో కాళేశ్వరం పంపులను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. "సాగునీరు లేక పొలాలు ఎండుతున్నాయి.. తాగునీరు లేక గొంతులు తడారుతున్నాయి. నిర్లక్ష్యంతో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పనులను పక్కన పెట్టారు. పక్కన కృష్ణమ్మ ఉన్నా ఫలితమేమీ లేకపాయె. ఇది కాలం పెట్టిన శాపం కాదు.. తెలంగాణకు కాంగ్రెస్ పెట్టిన శరగోపం. జాగో తెలంగాణ.. జాగో" అని కేటీఆర్ పేర్కొన్నారు.

## గ్రూప్-1లో అవకతవకలపై సీబీఐ విచారణ చేయాలి: కౌశిక్ రెడ్డి



హైదరాబాద్: టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1లో అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని భారాస ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణలో పెద్ద కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్లు ఎందుకిచ్చారని ప్రశ్నించారు. "కోఠి కళాశాలలోని 18, 19వ సెంటర్లలో 1,490 మంది పరీక్ష రాస్తే.. 74 మంది ఎంపికయ్యారు. 25 సెంటర్లలో 10 వేల మంది రాస్తే కేవలం 69 మంది మాత్రమే ఎంపికయ్యారు. 654 మందికి ఒకేలా మార్కులు ఎలా వస్తాయి? ఓ కాంగ్రెస్ నేత కోడలికి ఎస్టీ విభాగంలో మొదటి ర్యాంక్ వచ్చింది. ఆమె కోఠి కళాశాలలోనే పరీక్ష రాశారు. ఉర్దూలో రాసిన 9 మందిలో ఏడుగురు ఎంపికయ్యారు. టాప్100లోనూ ఉర్దూ మీడియం వారు ముగ్గురు ఉన్నారు. 8 వేల మంది తెలుగులో రాస్తే.. 60 మందే ఎంపికయ్యారు.. టాప్ 100లో నలుగురే ఉన్నారు. గ్రూప్–1 అంశంపై భాజపా నేతలు ఎందుకు మాట్లాడట్లేదు? భారాస హయాంలో పేపర్ లీకైతే పరీక్షలు రద్దు చేశాం. కాంగ్రెస్ హయాంలో లీకైతే ఎందుకు రద్దు చేయరు?" అని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు.




## సన్నబియ్యంతో సహపంక్తి భోజనం.. మహిళకు సీఎం అభినందనలు

హైదరాబాద్, ఏప్రిల్ 14: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది కాంగ్రెస్ సర్కార్. రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కూడా కాంగ్రెస్ హామీల్లో ఒకటి. ఇచ్చిన హామీ మేరకు ఉగాది కానుకగా కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదలుపెట్టారు. ఇప్పటి వరకు రేషన్ కార్డుదారులకు వస్తున్న దొడ్డు బియ్యానికి బదులుగా సన్న బియ్యాన్ని పేదలకు పంపిణీ చేస్తోంది. ప్రతీ రేషన్‌కార్డుదారునికి ఆరు కిలోల చెప్పున్న సన్న బియ్యాన్ని ఇస్తున్నారు. రేషన్ షాపుల్లో సన్నబియ్యం రావడంతో పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. సిద్దిపేట జిల్లాకు చెందిన ఓ మహిళకు కూడా రేషన్‌కార్డు ద్వారా సన్న బియ్యం వచ్చింది. దీంతో ఎంతో ఆనందం వ్యక్తం చేసిన ఆ మహిళ.. తన ఆనందాన్ని నలుగురితో పంచుకోవాలని అనుకుంది. అనుకున్నదే తడవుగా ఆమె చేసిన ఓ పనితో స్వయంగా ముఖ్యమంత్రి అభినందలను పొందింది. ఇంతకీ సిద్దిపేట మహిళ ఏం చేసింది... సీఎం రేవంత్ రెడ్డి ప్రశంసలు ఏంటో ఇప్పుడు చూద్దాం.

**ఇదీ సంగతి...** సిద్ధిపేట జిల్లా అక్బర్ పేట గ్రామానికి చెందిన లక్ష్మీ అనే మహిళకు రేషన్‌కార్డు ద్వారా 24 కిలోల సన్నబియ్యం వచ్చింది. ఇన్ని రోజులుగా దొడ్డు బియ్యం వస్తుండగా.. ఇప్పుడు సన్న బియ్యం రావడం పట్ల ఆనందం వ్యక్తం చేసింది. అంతటితో ఆగకుండా తనకు వచ్చిన 24 కిలోల సన్న బియ్యంతో ఊరందిరినీ పిలిచి సహపంక్తి భోజనం పెట్టింది. దీంతో ఆ ఊరి ప్రజలు కూడా సన్న బియ్యంతో వండిన భోజనాన్ని కడుపారా తిన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు చేరింది. దీంతో లక్ష్మీని అభినందించారు సీఎం. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా తెలియజేశారు సీఎం రేవంత్.

**రేవంత్ ట్వీట్ ఇదే..** 'సిద్ధిపేట జిల్లా అక్బర్ పేట గ్రామానికి చెందిన కూతురి లక్ష్మీకి నా ప్రత్యేక అభినందనలు. తనకు వచ్చిన 24 కిలోల సన్న బియ్యంతో ఆమె ఊరందరికి సహపంక్తి భోజనం పెట్టి, ఈ పథకం పేదల జీవితాల్లో ఎంతటి ఆనందాన్ని నింపిందో చెప్పే ప్రయత్నం చేసింది. సన్నబియ్యం లబ్ధిదారులే మా ప్రభుత్వ బ్రాండ్ అంబాసిడర్లు' అంటూ సీఎం రేవంత్ ట్వీట్ చేశారు. అంతేకాకుండా లక్ష్మీ చేసిన పనికి నెటిజన్లు కూడా ఆమెను అభినందిస్తున్నారు.

కాగా.. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక గత ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి 24 లక్షల టన్నుల సన్న వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇచ్చిన హామీ మేరకు సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ కూడా ఇచ్చింది. రైతుల నుంచి తీసుకున్న సన్న వడ్లను మిల్లింగ్ చేయించి ఆ బియ్యాన్ని ఉగాది పర్వదినం నుంచి రేషన్‌కార్డు ద్వారా పేదలకు పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులతో కలిపి 91.19 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ పథకం ద్వారా దాదాపు 2.82 కోట్ల మంది లబ్ధిపొందనున్నారు.

## మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడిపై కేసు..ఎందుకంటే




హైదరాబాద్: మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డిపై ఇవాళ(సోమవారం) కేసు నమోదైంది. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిపై యేసుబాబు అనే వ్యక్తి ఫిర్యాదుతో పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. విజన్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ సర్వీస్‌కు మర్రి రాజశేఖర్ రెడ్డి రూ.20 లక్షలు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వలేదని యేసుబాబు ఫిర్యాదు చేశాడు. దీంతో మర్రి రాజశేఖర్ రెడ్డిపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. విజన్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ సర్వీస్ ద్వారా అరుంధతి హాస్పిటల్‌కు 40మంది సిబ్బందిని కేటాయించానని యేసుబాబు అన్నారు. మొత్తం రూ.50 లక్షలు ఇచ్చేందుకు రాజశేఖర్ రెడ్డి ఒప్పుకున్నాడని... పలు దఫాలుగా రాజశేఖర్ రెడ్డి రూ.30 లక్షలు చెల్లించాడని చెప్పాడు.

ఆ తర్వాత మిగిలిన డబ్బులు ఇవ్వాలని అడిగితే రాజశేఖర్ రెడ్డి స్పందించలేదని యేసుబాబు ఫిర్యాదు చేశాడు. డబ్బులు ఇవ్వడం లేదంటూ యేసుబాబు పోలీసులను ఆశ్రయించాడు. రాజశేఖర్ రెడ్డిపై BNS చట్టం ప్రకారం చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీస్ స్టేషన్‌లో 316/2,318(4) సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో నేరం రుజువైతే మర్రి రాజశేఖర్ రెడ్డికి ఐదేళ్లు శిక్ష విధించే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా మర్రి రాజశేఖర్ రెడ్డి గెలిచిన విషయం తెలిసిందే.

## కుర్మ జాతిని గౌరవించింది కేసీఆర్ ప్రభుత్వమే : హరీశ్‌రావు



కుర్మజాతిని గౌరవించింది కేసీఆర్ ప్రభుత్వమే అని హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని తెల్లాపూర్ గ్రామంలో గల బీరప్ప స్వామి దేవాలయంలో జరుగుతున్న జాతర మహోత్సవానికి హాజరై స్వామి వారిని హరీశ్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. మల్లన్న దేవున్ని కుల దైవంగా భావించే కుర్మలకే కొమురవెల్లి మల్లన్న దేవాలయ ఛైర్మన్ పదవి కేటాయించామని గుర్తుచేశారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టుతో మల్లన్న దేవుని పేరును చరిత్ర పుటల్లో నిలిపామని హరీశ్‌రావు గుర్తుచేశారు. మల్లన్న సాగర్, కాళేశ్వరం నుంచి ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించి కరువులేకుండా తెలంగాణను సుభిక్షంగా పాలించిన ఘనత కేసీఆర్‌దే అని అన్నారు. మల్లన్నకు 10 ఏళ్లు పట్టువస్త్రాలు సమర్పించే అవకాశం తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

## అధిష్ఠానం మంత్రి పదవి ఇస్తానంటే ఎవరూ అడ్డుకోరు.. రాజగోపాల్ రెడ్డికి శంకర్ నాయక్ కౌంటర్..

తనకు మంత్రి పదవి రాకుండా జానారెడ్డి అడ్డుకుంటున్నాడని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సంచలనంగా మారాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ శంకర్ నాయక్ స్పందించారు. మంత్రి పదవికి రాజగోపాల్ రెడ్డి అర్హుడే.. కాంగ్రెస్ అధిష్ఠానం పదవి ఇస్తానంటే ఎవరూ అడ్డురారని చెప్పారు. రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తానంటే అడ్డుకునే వ్యక్తిత్వం జానారెడ్డిది కాదని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిలాకు మూడో మంత్రి పదవి ఇస్తానంటే తాము కూడా సంతోషిస్తామని శంకర్ నాయక్ అన్నారు. రాజగోపాల్ రెడ్డి పదవికి, జానా రెడ్డి లేఖకు సంబంధం లేదని అన్నారు. జానా రెడ్డి లేఖ రాసిన మాట వాస్తవమేనని తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో ఉన్న మాజీ ఎమ్మెల్యేలు, ప్రస్తుత ఎమ్మెల్యేలు అందరూ కలిసి జానా రెడ్డిని కలిసి, అధిష్ఠానానికి ఫోన్ చేయమని విజ్ఞప్తి చేశారని చెప్పారు. అప్పుడు ఫోన్ చేయనని జానా రెడ్డి చెప్పారని తెలిపారు. కనీసం అధిష్ఠానానికి లేఖ అయినా రాయమని అడగ్గా.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాకు ప్రాధాన్యత ఇవ్వాలని రాశారని వివరణ ఇచ్చారు. కానీ రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వొద్దని లేఖలో ఎక్కడా రాయలేదని స్పష్టం చేశారు. మంత్రి పదవి విషయంలో మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నిన్న సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు అధిష్ఠానం మంత్రిపదవి ఇస్తానంటుంటే.. సీనియర్‌నేత జానారెడ్డి అడ్డం పడుతున్నారని ఆరోపించారు. ధర్మరాజులా ఉండాల్సిన వ్యక్తి.. ధృతరాష్ట్రుడిలా వ్యవహరిస్తున్నారని తీవ్ర విమర్శలు గుప్పించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన నేతలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని అధిష్ఠానానికి జానారెడ్డి రాసిన లేఖపైనా రాజ్‌గోపాల్‌రెడ్డి మండిపడ్డారు. 30 ఏండ్లు మంత్రి పదవి అనుభవించిన జానారెడ్డికి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రి పదవి ఇవ్వాలనే విషయం ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. భారత క్రికెట్ జట్టులో ఒక ఇంట్లో నుంచి ఇద్దరు క్రికెటర్లు ఉన్నట్టే%ా% మంత్రివర్గంలో ఒకే కుటుంబం నుంచి ఇద్దరు మంత్రులుంటే తప్పా? ప్రశ్నించారు. మంత్రి పదవి అడుక్కుంటే వచ్చేది కాదని, కెపాసిటీతో వస్తుందని చెప్పారు. చం దూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గంలోనూ రాజగోపాల్‌రెడ్డి మంత్రి పదవిపై వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి ఇచ్చే సమయంలో జానారెడ్డి అధిష్ఠానానికి లెటర్ పెట్టడంతో ప్రక్రియ మళ్లీ మొదటకు వచ్చిందని అసంతృప్తి వ్యక్తంచేశారు.

## విషాదం.. కారులో ఊపిరాడక ఇద్దరు చిన్నారుల మృతి



చేవెళ్ల రూరల్: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం దామరగిద్దలో విషాదం చోటు చేసుకుంది. కారు డోర్లు లాక్ పడటంతో అందులో ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులు ఊపిరాడక మృతి చెందారు. బంధువుల వివాహానికి వచ్చిన అక్కచెల్లెళ్ల పిల్లలు తన్మయశ్రీ (5), అభినయశ్రీ (4).. ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న కారులోకి వెళ్లారు. అయితే, కారు డోర్లు లాక్ పడటం, అది ఇతరులెవరూ గమనించకపోవడంతో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. చిన్నారులు ఎంతసేపటికీ కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వారి కోసం వెతికారు. చివరకు కారులో అపస్మారక స్థితిలో ఉన్న పిల్లలను గుర్తించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కారు డోర్లు ఎలా లాక్ అయ్యాయి?ఇతర కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# పడతి చేసే పొదుపు... భవిష్యత్ బాటకు వెలుగు


## - 14 ఏప్రిల్ ... మహిళా పొదుపు దినోత్సవం




పొదుపు చాలా మంచి అలవాటు.. ఆదా చేసిన డబ్బు ఏదైనా అత్యవసర వైద్య పరిస్థితి వంటి కఠినమైన సమయాల్లో ఉపయోగించ బడుతుంది. పెట్టుబడి ద్వారా ఎక్కువ డబ్బును సృష్టించడానికి కూడా దీనిని ఉపయోగించవచ్చు. నేటి మహిళ కుటుంబ ఆదాయంలో భాగస్వామిని అవుతున్నది. అటు తాను ఎంచుకున్న జీవనాధారం లోనూ, ఇటు ఇంట్లోనూ తన బాధ్యతలను ఎంతో సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నది. అయితే చాలా మంది మహిళలు పొదుపు, మదుపుల విషయంలో అంత ఆసక్తి కనబరచడం లేదనేది నగ్న సత్యం. పొదుపు అంటే వచ్చే ఆదాయంలో ఖర్చులు పోను మిగిలిన దానిలో కొంత భవిష్యత్ అవసరాలకు వెనుకేసుకునే డబ్బు అనుకునేవి గత రోజులు . పొదుపు చేసాక మిగిలిందే ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నేడు. పొదుపే భవిష్యత్తులో ప్రణాళిక వేసుకున్న అవసరాలకు, అంచనాలో లేని, ఆకస్మికంగా వచ్చిపడే అవసరాలకు, అలాగే రిటైర్మెంట్ జీవితానికి... ఇలా చాలా సందర్భాల్లో ఆదుకుంటుంది. పొదుపు, మదుపు... ఒకటేనని అపోహకు తావివ్వకుండా ఈ రెంటి మధ్య చాలా వ్యత్యాసం ఉందని గుర్తెరుగాలి. సాధారణంగా బ్యాంకు, పోస్టాఫీసుల్లో సేవింగ్ అకౌంట్, ఫిక్స్డ్ డిపాజిట్, రికరింగ్ డిపాజిట్, ఈపిఎఫ్, పిపిఎఫ్, సేవింగ్ సర్టిఫికెట్స్... ఇవన్నీ పొదుపు వర్గంలోకి వస్తాయి. ఇక వివిధ కంపెనీ వాటాలు, మ్యూచువల్ ఫండ్స్ వగైరాల్లో పెట్టే పెట్టుబడిని పొదుపు అనే కన్నా మదుపు అనడం సమంజసం. అలాగే ఎక్కువ వడ్డీ ఆశతో బిచాణా ఎత్తేసే కంపెనీలు, స్కీములలో పెట్టేది కూడా పొదుపు కాదు. పదవీ విరమణ తరువాత, లేదంటే ఇతరత్రా పెద్ద మొత్తంలో డబ్బు చేతికి అందినప్పుడు దాన్ని ఏక మొత్తంలో ఖర్చు పెట్టేయకుండా శేష జీవితం సజావుగా గడపడం కూడా పొదుపు లాంటిదే. అయితే క్రమం తప్పకుండా నిర్ణీత, ఆపై మొత్తం నిరంతరం పక్కన పెడుతూ ఉండే ప్రక్రియనే నిజమైన పొదుపు అని అనాలి. మనలో చాలా మందిలో పొదుపు అనగానే 'పిసినారి' తనం తో పోల్చుతారు. కానీ పొదుపు అనేది త్యాగం. వచ్చిన ఆదాయాన్నంతా ఖర్చు పెట్టేస్తే అప్పులు తప్పవు. అలాగే ఆదాయానికి మించి ఖర్చు చేసే తత్వం అలవాటుగా మారే ప్రమాదం లేకపోలేదు. అలా కాకుండా మన ఆదాయాన్ని బట్టి మన అవసరాలను అదుపులో పెట్టుకుని ఎంతోకొంతైనా సరే డబ్బు వెనకేసుకోవడం అలవర్చుకోవాలి. ఇందులో భాగంగా అనవసరం అనుకున్న ఖర్చులను తగ్గించుకోవడమో, కొన్ని సుఖాలను, సరదాలను త్యాగం చేయడమో చేయాలి. ఈ పొదుపుతో ఇంకాస్త డబ్బు ఆర్జించినట్టే అవుతుంది. అయితే పొదుపు విషయంలో కఠినం అనిపించినా నిర్ణయాత్మకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఇతర ఖర్చుల ఒత్తిడికి తలొగ్గి, పొదుపు చేయాల్సిన మొత్తాన్నీ వ్యయం చేస్తే ఇక పొదుపు కొనసాగదు. అందుకే చేతికి డబ్బు రాగానే పొదుపు చేయాలనుకున్న మొత్తాన్ని ముందు పొదుపు చేసి, వెహికిల్ లోన్, హౌజింగ్ లోన్, క్రెడిట్ కార్డ్ వగైరా పేమెంట్లు ఉన్నట్లైతే అవి కూడా కట్టేసి ఆ తరువాతే మిగతా ఖర్చులు పెట్టాలి. మహిళల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు నిర్వహిస్తున్నాయి. ఆడపిల్లలకు పిపిఎఫ్ తరహాలో సుకన్య సమృద్ధి యోజన గత సంవత్సరం అందుబాటులోకి వచ్చింది. దాదాపు అన్నీ బ్యాంకుల్లో మహిళలకు వివిధ సదుపాయాలను కల్పిస్తున్నాయి. వీరు నిర్వహించే సేవింగ్ అకౌంట్ లకు మినిమమ్ బ్యాలన్స్ అంటూ లేకపోవడం, లావాదేవీలకు సర్వీస్ ఛార్జీలు మినాహాంచడం, ఎక్కువ వడ్డీ అందించడం, ఇన్సురెన్స్ కల్పించడం మొదలైన ప్రయోజనాలు అందిస్తున్నాయి. వీరికి ప్రత్యేకంగా వివిధ అవసరాలకు, వ్యాపారాలకు లోన్స్ ఇవ్వడమే కాకుండా వడ్డీలో కూడా రాయితీలు ఇస్తున్నారు. దుస్తులు, గృహోపకరణాలు వగైరా కొనుగోళ్లవిషయంలో అనవసరపు ఢాంబికాలకు పోకుండా అవసరంమైనవేమిటో చూసుకోవాలి. రోజువారి ఖర్చులను నిత్యావసరాలు, అదనపు ఖర్చులు, ఆస్పత్రి, మందులు... ఇలా రాసి పెట్టుకోవాలి. ఈ చిట్టా మన ఆదాయవ్యయాలను ప్రతిబింభించేలా ఉండాలి. ఐదేళ్లకు చేసిన పొదుపు, గృహ రుణాల చెల్లింపులు, పిల్లల స్కూల్ ఫీజులు, ఇన్సూరెన్స్ ప్రీమియంలు, మందులు, ఆస్పత్రి ఖర్చులు, స్వచ్ఛంధ సంస్థలకు ఇచ్చే విరాళాలు... వీటిపై ఇన్‌కం టాక్స్ మినహాయింపు ఉంటుంది. ఇదికాక ప్రత్యేకంగా మహిళలకు అదనంగా ఇన్‌కం టాక్స్ పరిమితి ఉంటుంది. ఆధునిక మహిళలకు ప్రత్యేకంగా పలు ఇన్సురెన్స్ కంపనీలు మెడికల్ పాలసీలను అందిస్తున్నాయి. ఇన్సురెన్స్ ఉన్నా నగదు రహిత చికిత్స పొందనియెడల సదరు సంస్థలనుంచి పరిహారం పొందడానికి ఆస్పత్రి, మందుల బిల్లులు సకాలంలో పొందుపరచాల్సి ఉంటుంది. అనారోగ్యాలు, అకస్మిక ప్రయాణాలను ఊహించలేం. ఇవి మినహా రాబోయే ఆర్థిక అవసరాలకు ముందుగానే బడ్జెట్ తయారు చేసుకోవాలి. పొదుపు, మదుపుల పై చక్కని అవగాహన కలిగి తదనుగుణంగా వ్యవహరించాలి. అయితే మన సేవింగ్, ఇన్వెస్ట్మెంట్ లకు ఒక లక్ష్యం తప్పక ఉండాలి. అలాగే భవిష్యత్ అవసరాల ప్రాధాన్యత క్రమం తప్పకూడదు. ఒక్కొక్క అవసరానికి తగ్గట్టుగా పొదుపులో, మదుపులో ఒక్కో వ్యూహం ఎన్నుకోవాలి. వాటిని తరచూ సమీక్షించడం మరవద్దు. ఏతావతా క్రమం తప్పకుండా నిరంతరం పొదుపు చేయడం, పొదుపును కూడా అనివార్యమైన ఓ ఖర్చుగా పరిగణించి, తప్పనిసరిగా పొదుపు చేయడం చాలా కీలకం అని గుర్తించాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# సిద్ధి పొందిన తాపసి రమణ మహర్షి


## - ఏప్రిల్ 14 . . . భగవాన్ శ్రీరమణుల వర్ధంతి




ఆది 1879వ సంవత్సరం డిసెంబర్ 29వ తేదీ. దక్షిణ భారతావని లోని తమిళనాట తిరుచ్చుళీ క్షేత్రం. శివుని పంచమూర్తులలో నటరాజ ఆనందమూర్తి ఆవిర్భావాన్ని పురస్కరించుకుని, జరుపుకున్న ఆరుద్ర దర్శనం' అనే ఉత్సవ సందర్భం. శ్రీభూమినాథేశ్వర ఆలయ సంబంధ ఆలంకృత ఉత్సవ మూర్తులను రథంపై వీధుల గుండా ఊరేగించిన ఉత్సవ సమయం. కొనసాగుతున్న ఉత్సవ క్రమంలో అర్థరాత్రి దాటాక డిసెంబర్ 30నాటి తొలి గంటలో కోవెలను ఆనుకుని ఉన్న ఇంటిలో ఒక మగ శిశువు జన్మించాడు. సుందరం అయ్యర్, ఆళగమ్మ దంపతులకు కలిగిన ఆ బాలునికి .. "వేంకటేశ్వరన్" అని పేరు పెట్టారు. ఆ బాలుడే తర్వాతి కాలాన "భగవాన్ రమణ మహర్షి" అని ఖ్యాతి గడించాడు. బాలుని బాల్యం సాధారణంగా సాగింది. తండ్రి మందలింపు తో ఒకమారు పక్క గుడిలో జగన్మాత విగ్రహం వెనుక దాగి ఉన్నాడు. తెలియని వయసులో ప్రాపంచిక సంకటాల నుండి ఉపశమన లక్ష్యంతో దైవసన్నిధిని ఆశ్రయించడం భవిష్యత్ జీవితానికి సంకేతం. అద్భుత జ్ఞాపక శక్తి కారణంగా పాఠశాలలో విన్నవన్ని వెంటనే అప్పచెప్పేవాడు. యువకునిగా పెరియ పురాణం (శివభక్త విలాసం) గ్రంథాన్ని పఠించారు. శివునికి ధన ప్రాణమానాలను సమర్పించిన 63 నాయనార్ల గాథల పట్ల దివ్యావేశానికి లోనై, త్యాగభరితమై సాయుజ్యానికి దారితీసే గాథలకు పరవశుడై, సాధుమార్గ అన్వేశి అయినారు. నాటినుండి ఆయనలో దివ్య ప్రేరణ కలిగింది. రామస్వామి అనే వ్యక్తిని ఎక్కడనుండి వస్తున్నారని ప్రశ్నించి ," ఆరుణా చలం" , నుండి అని సమాధానం పొందగా, ఆయన ఎదో తెలియని అనుభూతికి లోనైనారు. నాటి నుండి ప్రాపంచిక విషయాల పట్ల విముఖులు కావడం ప్రారంభమైంది. 1896 ఆగస్టు 29న చదువుల పట్ల నిరాసక్తత కలిగి, ఇల్లు వదిలి స్కూల్ ఫీజు కు 5రూపాయలు అన్న వద్ద తీసుకుని, ఉదాత్తమైన ఆశయ సాధనకోసం వెళుతున్నానని 3 రూపాయలు మాత్రమే వెంట ఉంచుకుని, లేఖ వదిలి వెళ్ళి, దైవ మార్గ నిర్దేశత్వంతో, కష్ట నష్టాలకులకు ఓర్చి, సుదీర్ఘ ప్రయాణానంతరం సెప్టెంబర్ 1న అరుణోదయ వేళలో . . . ఆరుణాచలంలో మంగళ ప్రద మంగళవారం మంచి ఘడియలో పాదం మోపి, ప్రాకార ద్వారాలు, గర్భాలయం సహా బార్ల తెరిచి ఉన్న శ్రీఆరుణాచలేశ్వర ఆలయ ప్రవేశం చేశారు. మహాలింగాలింగనం ద్వారా ఆత్మ సమర్పణం చేసుకున్నారు. నాటి అరుణాచల ఆగమనం నుండి నేటి రమణాశ్రమంగా రూపు దిద్దుకున్న గిరి దక్షిణ పాదంలో స్థిరపడి, 1950 , ఎప్రిల్ 14 మహా నిర్యాణం వరకు 54 ఏళ్ళు, బ్రాహ్మణ స్వామిగా చిరపరిచితులై, తమకు ప్రియమైన అరుణగిరి పొలిమేర దాటనే లేదు. స్వామి ఉనికిని గురించి తెలుసుకున్న తల్లి అళగమ్మ, ఇంటికి వెళదామని అర్థించ గా,.. "కర్త వారివారి ప్రారబ్ధానుసారం జీవులనా డించును. జరుగనిది ఎంత ప్రయత్నించినను జరుగదు. జరుగునది ఎవరెంత యడ్డు కున్నను జరుగనే జరుగును. ఇది సత్యము. కనుక మౌనముగ ఉండుటయే ఉత్తమము"... అని కాగితంపై రాయగా , ఆమె ఖిన్నవదనయై వెనుతిరుగారు. రమణులు గిరిపై విరూపాక్ష గుహలోనే 17 ఏళ్ళ వాసాన్ని గడిపారు. 1916లో రమణులు విరూపాక్ష నుండి స్కందాశ్రమానికి మారారు. తల్లి అక్కడున్న అందరికీ వండి పెట్టగా , ఆమెకు అనుక్షణం వైరాగ్యాన్ని బోధించారు. 1920లో తల్లి ఆరోగ్యం క్షీణించగా , ఆమను కంటికి రెప్పలా కాపాడుతూ, 22లో రమణుల హస్త మస్తక సంయోగ దీక్ష ద్వారా అళగమ్మకు దేహ విముక్తి కలిగించారు . ఆమెకు స్పృహ ఉన్నంత వరకు వేదాంత బోధ చేస్తూ, చివరగా తమ కుడి చేతిని ఆమె హృదయం పైన, ఎడమ చేతిని శిరస్సుపైన ఉంచి, తదేక దృష్టితో వీక్షిస్తూ, మోక్షాన్ని ప్రసాదించారు . ఆమె పార్థివ శరీరాన్ని దహనం చేయకుండా, గిరి దక్షిణ పాదంలో సమాధి చేశారు . ఆ సమాధి చుట్టూ నిర్మాణాల సమాహారమే నేటి శ్రీరమణాశ్రమం. 1949లో మహర్షుల ఎడమ మోచేతిపై సార్కమా ( క్యాన్సర్) రాగా 1950, ఏప్రిల్ 14 న స్వామి అంతిమ ఘడియలు సమీపించాయని గ్రహించిన భకులు "ఆరుణాచల శివ" అంటూ రమణ మహర్షి విరచితాలను నినదించగా, రా త్రి 8 .47 గంటల సమయాన దక్షిణాకాశంలో ఒకపెద్ద కాంతి గోళం మెరసి, ఈశాన్యం వైపు పయనించి, ఆరుణాచల శిఖరాన అంతర్హితమైంది. రమణుల ఆధ్యాత్మిక శక్తి వికాసం ఆయన దేహయాత్ర అనంతరం నానాటికీ మహోజ్వలంగా బాసిస్తునే ఉన్నది .

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


# ప్రపంచ ప్రజాస్వామ్య గ్లోబల్ ర్యాంకింగ్స్.. భారత్ స్థానమెంతంటే?



ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిస్థితి రోజురోజుకీ సంక్షోభంలో పడుతున్నట్లు "ది ఎకనమిస్ట్" కు చెందిన ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ తాజాగా ప్రకటించిన గ్లోబల్ డెమోక్రసీ ఇండెక్స్ 2024 వెల్లడించింది. ప్రతి సంవత్సరం ఈ సంస్థ 167 దేశాల్లో ప్రజాస్వామ్య స్థాయిని అంచనా వేసి, 0 నుంచి 10 వరకు స్కోర్ కేటాయించి ర్యాంకులను ప్రకటిస్తుంది. ఈ నివేదిక ప్రకారం, నార్వే 9.81 పాయింట్లతో వరుసగా 16వ సంవత్సరం మొదటి స్థానాన్ని దక్కించుకుంది. న్యూజీలాండ్, స్వీడన్ దేశాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అయితే, ప్రజాస్వామ్య పరంగా అత్యంత బలహీనంగా నిలిచిన దేశాల జాబితాలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్తాన్ ఉన్నాయి. ఈ దేశాల్లో ప్రజాస్వామ్య విలువలు క్షీణిస్తున్నాయని నివేదిక పేర్కొంది. అంతేకాకుండా, మయన్మార్ (166), ఉత్తర కొరియా (165), చైనా (145), లావోస్ (160), వియత్నాం (133) దేశాలు కూడా ప్రజాస్వామ్య పరంగా బలహీనంగా నిలిచాయి. అఫ్ఘానిస్తాన్ కేవలం 0.25 పాయింట్లు మాత్రమే సాధించి 167వ ర్యాంకులో ఆఖరున నిలిచింది. తాలిబాన్ పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలు పూర్తిగా దెబ్బతిన్నాయని, మహిళల హక్కులు, మీడియా స్వేచ్ఛ హరించబడటంతో దేశ పరిస్థితి మరింత దారుణంగా మారిందని నివేదిక స్పష్టం చేసింది. పాకిస్తాన్ ప్రజాస్వామ్య స్థాయి మరింత క్షీణించి 124వ స్థానానికి పడిపోయింది. ఈ దేశం గత 16 ఏళ్లలో 6 స్థానాలు దిగజారడం గమనార్హం. రాజకీయ అస్థిరత, ఎన్నికల లోపాలు, సైనిక జోక్యం, పత్రికా స్వేచ్ఛ హరించబడటం వంటి అంశాలు పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. భారతదేశం గురించి విశ్లేషిస్తే, ఆసియా ఖండంలో మెరుగైన స్థానంలో ఉన్నప్పటికీ, ప్రపంచ ర్యాంకింగ్‌లో 41వ స్థానాన్ని దక్కించుకుంది. అయితే, ఈ నివేదిక భారతదేశాన్ని "లోపభూయిష్ట ప్రజాస్వామ్య దేశాల" జాబితాలో చేర్చింది. ప్రజాస్వామ్య విలువలు క్రమంగా తగ్గిపోతున్నాయని, మీడియా స్వేచ్ఛ కొంత మేర తగ్గిందని నివేదిక పేర్కొంది. ఈ జాబితాలో అమెరికా 28వ స్థానంలో, ఫ్రాన్స్ 26వ స్థానంలో ఉన్నాయి. ఆసియా దేశాల్లో దక్షిణ కొరియా కూడా పూర్తిస్థాయి ప్రజాస్వామ్య దేశాల జాబితా నుంచి బయటపడిపోయి, 32వ స్థానానికి పడిపోయింది. యూరోపియన్ సెంటర్ ఫర్ పాపులిజం స్టడీస్ (%జుఙూ%) ప్రకారం.. ప్రజాస్వామ్య దేశాల్లో ఎన్నికలు న్యాయబద్ధంగా, స్వేచ్ఛగా జరిగినప్పటికీ, మీడియా స్వేచ్ఛ లేకపోవడం, రాజకీయ ప్రత్యర్థుల అణచివేత వంటి సమస్యలు ఉంటే ఆ దేశాలను "లోపభూయిష్ట ప్రజాస్వామ్య దేశాలుగా" వర్గీకరిస్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ సంస్కృతి అభివృద్ధి చెందకపోవడం, పాలనలో పారదర్శకత లేకపోవడం వంటి అంశాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారుతున్నాయని ఈ నివేదిక హెచ్చరించింది.

# భారతీయులకు ముంచుకొస్తోన్న కొత్త సమస్య!

తాజాగా ఓ ఆసక్తికరమైన నివేదిక తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా... గ్లోబల్ స్లీప్ సర్వే తన ఐదో వార్షిక నివేదికను వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో చేసిన ఈ సర్వే గురించి వెల్లడిస్తూ.. భారతీయులకు కొత్త సమస్య ముంచుకొస్తోందని తెలిపింది. అదే నిద్ర సంక్షోభం. ఇప్పటికే భారతీయులు వారంలో మూడు రోజులు సరిగా నిద్రపోవడం లేదని సర్వే తెలిపింది! అవును... భారతీయులు సరిగా నిద్రపోవడం లేదంట. ఈ నేపథ్యంలో వారికి నిద్ర సంక్షోభం ముంచుకొస్తోందని గ్లోబల్ స్లీప్ సర్వే వెల్లడించింది.



ఈ సమయంలో ప్రతీ వారంలోనూ కనీసం మూడు రోజులు భారతీయులు నిద్రను కోల్పోతున్నట్లు తెలిపింది. చాలా మంది ఇప్పటికే ఈ సమస్యతో భాదపడుతున్నప్పటికీ ఎలాంటి వైద్య సహాయం పొందడం లేదని వెల్లడించింది! ఈ సందర్భంగా... భారతీయుల్లో 49 శాతం మంది వారానికి కనీసం మూడు రోజులు నిద్రపోవడంలో ఇబ్బందులు పడుతున్నారని.. 47 శాతం మంది భారతీయులు నిద్ర లేమి కారణంగా వచ్చే అలసట కారణంగా తమ తమ కెరీర్ లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. ఫలితంగా తమ కెరీర్ ఎదుగుదలలో దీని ప్రభావాన్ని చవిచూస్తున్నారని చెబుతున్నారు! ఇదే సమయంలో.. పురుషులతో పోలిస్తే స్త్రీలు తక్కువ నాణ్యమైన నిద్రను అనుభవిస్తున్నరని.. పురుషులతో పోలిస్తే మహిళలు వారంలో తక్కువ రాత్రులు మంచి నిద్ర పొందుతున్నారని.. స్త్రీల రుతుచక్రంపై నిద్ర తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నట్లు సర్వేలో తేలిందని తెలిపింది. పురుషులతో పోలిస్తే స్త్రీలు ఐదు శాతం ఎక్కువగా సిక్ లీవ్ లు తీసుకునే అవకాశం ఉందని పేర్కొంది.

ఈ సర్వే కోసం అమెరికా, చైనా, భారత్ లలో 5,000 మంది.. జర్మనీలో 2004, ఫ్రాన్స్ లో 2001, యూకే 2000, థాయిలాండ్ లో 1519, ఆస్ట్రేలియాలో 1501.. జపాన్, కొరియాల్లో ఒక్కో దేశంలోనూ 1500 మందితో పాటు హాంకాంగ్ లో 1001, న్యూజిలాండ్ 1000, సింగపూర్ లో 1000 మంది కలిపి మొత్తం 30,026 మందిపై ఈ సర్వే నిర్వహించినట్లు తెలిపారు!

# రూ.1,83,01,500 కోట్లు..

## ఏడాదిలో మనోళ్లు దేనికి ఖర్చు చేశారో తెలుసా?

ఏడాది వ్యవధిలో వస్తు సేవల కోసం భారతీయులు ఖర్చు చేసిన మొత్తంపై డెలాయిట్ - ఆర్ఏఐలు తాజాగా విడుదల చేసిన అధ్యయన వివరాలు ఆసక్తికరంగానే కాదు.. ఆశ్చర్యానికి గురి చేసేలా ఉన్నాయని చెబుతున్నారు. 2024లో రూ.1,83,01,500 కోట్ల భారీ మొత్తాన్ని దేశ ప్రజలు వస్తు సేవల కోసం వెచ్చించారని.. అంతకు ముందు ఏడాది (2023లో) ఇది రూ.87,15,000 కోట్లు మాత్రమేనని అధ్యయనం వెల్లడించింది. 7.2 శాతం వృద్ధితో అమెరికా.. చైనా.. జర్మనీ కంటే భారత్ వేగంగా ఉన్నట్లు ఈ రిపోర్టు పేర్కొంది. 2026 నాటికి ప్రపంచంలోనే మూడో అతి పెద్ద వినియోగదారుల మార్కెట్ గా అవతరించే దిశగా వెళుతుందని పేర్కొన్నారు. ఇది 2030 నాటికి రూ.20,04,450 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. 2030 నాటికి ఏడాదికి రూ.8.71 లక్షల కంటే ఎక్కువ సంపాదించే



భారతీయుల సంఖ్య దాదాపు మూడు రెట్లు దూసుకెళ్లి 16.5 కోట్లకు చేరుతుందని పేర్కొన్నారు. 2024లో ఇది కేవలం 6 కోట్లు మాత్రమే కావటం గమనార్హం. దేశంలో మధ్యతరగతి వర్గాల వృద్ధిని.. విచక్షణా వ్యయంవైపు ప్రాథమిక మార్పును చెబుతున్నట్లుగా అధ్యయనం వెల్లడించింది. జనాభాలో 52 శాతం ఉన్న జనరేషన్ జెడ్.. మిలీనియల్స్ ఈ మార్పునకు కారణంగా చెబుతున్నారు ప్రీమియం బ్రాండ్లు.. స్థిర ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతున్నట్లుగా వెల్లడించారు. 2030 నాటికి భారతదేశ తలసరి ఆదాయం రూ.3,48,600 దాటుతుందని అంచనా వేశారు. వివిధ రంగాల్లో కొత్త అవకాశాల్ని ఇది తెరుస్తుందని పేర్కొన్నారు. తమ వాదనకు బలం చేకూరేలా ఒక ఉదాహరణను ఇందులో పేర్కొన్నారు, గత ఏడాది క్రెడిట్ కార్డుల సంఖ్య 10.2 కోట్లు ఉందని.. 2030 నాటికి ఈ సంఖ్య 29.6 కోట్లకు దూసుకెళుతుందని చెబుతున్నారు. దీంతో.. వినియోగదారులు చేసే ఖర్చులు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు.

చురకలు

## సంపాదకీయం

# కేసీఆర్ వ్యూహాన్ని స్టాలిన్ అమలు చేస్తున్నారా ?

తమిళనాడు అధికార డీఎంకే పార్టీకి వచ్చే ఎన్నికలు చావో రేవో అన్నట్లుగా మారుతున్నాయి. ఎందుకంటే ఏడున్నర పదుల వయసుకు చేరువలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఉన్నారు. ఈసారి ఆయన డీఎంకేని గెలిపించి తన రాజకీయ వారసుడు కుమారుడు ఉదయనిధి స్టాలిన్ కి సీఎం గా పట్టాభిషేకం చేయవచ్చు అన్నది ఆలోచన. ఒకవేళ అది జరగకపోతే మాత్రం మరో 2031 వరకూ ఆగాలి. అప్పటికి ఎనభయ్యేళ్ళకు స్టాలిన్ వస్తారు. ఆనాటికి రాజకీయాలు ఎలా ఉంటాయో ఎవరికి ఎరుక. దాంతో స్టాలిన్ కి 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలు చాలా ముఖ్యంగా మారాయి. ఇదిలా ఉంటే గత అయిదేళ్ళ స్టాలిన్ పాలన ఏమంత గొప్పగా లేదని విపక్షాలు అంటున్నాయి. దాంతో పాటు యాంటీ ఇంకెంబెన్సీ కూడా సహజంగా ఉంటుంది. మరో వైపు చూస్తే సూపర్ స్టార్ డం ఉన్న హీరో విజయ్ కొత్త పార్టీ పెట్టి డీఎంకే మీదకు దూసుకుని వస్తున్నారు. ఆయన అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుంటారని ప్రచారం సాగుతోంది. అదే జరిగితే విజయ్ గ్లామర్ అన్నాడీఎంకే క్యాడర్ కలసి అధికార డీఎంకే గుండెల్లో రైళ్ళను పరిగెట్టించవచ్చు. తెలంగాణా ఆత్మగౌరవ నినాదంతో రెండు సార్లు అధికారం అందుకున్న కేసీఆర్ ని ఈ విషయంలో స్టాలిన్ ఫాలో అవుతున్నారా అన్న చర్చ కూడా సాగుతోంది. ఈ క్రమంలో స్టాలిన్ తమిళుల ఆత్మ గౌరవం అంటూ కొత్త నినాదాన్ని ఎత్తుకున్నారని అంటున్నారు. ఆయన హిందీ భాషను తమిళుల మీదకు రుద్దడాన్ని తప్పు పడుతున్నారు. కేంద్రం జాతీయ విద్యా విధానాన్ని ప్రశ్నిస్తున్నారు అది అమలు చేయలేదని అయిదు వేల కోట్ల రూపాయలు కేంద్రం ఇవ్వకుండా ఆపిందని విమర్శిస్తున్నారు. తమిళులకు ఈ జాతీయ విద్యా విధానం అవసరం లేదని హిందీ కూడా వద్దు అని ఆయన నినదిస్తున్నారు. మరో వైపు చూస్తే కేంద్రం చేసిన మూడు భాషల పాలసీ మీద అలాగే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్ విభజన విషయంలో ఆయన కేంద్రంతో ఢీ కొట్టాలని చూస్తున్నారుఇ. తాను కేంద్రం మీద సమరం చేస్తున్నానని తనకు మద్దతుగా నిలవాలని ఆయన తమిళనాడు ప్రజలను కోరుతున్నారు. కేంద్రం డీ లిమిటేషన్ అమలు చేస్తే అది తమిళనాడు రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బ తీస్తుందని అంటున్నారు. సామాజిక న్యాయం అని కూడా గొంతెత్తుతున్నారు. సంక్షేమ పథాకాలకు తీవ్ర నష్టం అని ప్రజలను హెచ్చరిస్తున్నారు. దీని మీద కేంద్రంతో ఎంతైనా పోరాటానికి రెడీ అంటున్నారు. నిజానికి తమిళలకు ఆత్మ గౌరవ నినాదం అతి పెద్ద భావోద్వేగం కలిగించే ఇష్యూగా ఉంటుంది. దానిని సరిగ్గా ఎన్నికలకు ఏడాది సమయం ఉన్న వేళ వ్యూహాత్మకంగానే స్టాలిన్ బయటకు తీసారు అని అంటున్నారు. మరి అది కనుక పారితే మరోసారి తమిళ పీఠం స్టాలిన్ దే అని అంటున్నారు అదే సమయంలో విజయ్ రూపంలో కొత్తగా పుట్టుకుని వచ్చిన పార్టీ కేంద్రంతో ఏ మేరకు పోరాడుతుంది అన్న చర్చ కూడా జనం లో ఉంటుంది. స్టాలిన్ అనుభవం ఆయన దూకుడు ప్లస్ పాయింట్ గా అయితే మాత్రం వచ్చే ఎన్నికలు రసవత్తరంగా మారుతాయని అంటున్నారు.

# సంప్రదాయ కళలను సజీవంగా ఉంచాలి - ఏప్రిల్ 15...ప్రపంచ కళా దినోత్సవం




ప్రపంచ వ్యాప్తంగా కళలను, కళాకారులను గౌరవించడానికి, ప్రజల్లో కళల పట్ల అవగాహన పెంపొందించడానికి ప్రతి ఏటా ఏప్రిల్ 15వ తేదీన ప్రపంచ కళా దినోత్సవం జరుపుకుంటారు. యునెస్కోకు అనుబంధంగా ఉన్న అంతర్జాతీయ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ 2012లో ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. ఈ తేదీ ఎంపికకు ఓ ప్రత్యేకత ఉంది. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త, కళాకారుడు, ఆవిష్కర్త అయిన లియనార్డో డావించీ జన్మదినం ఇదే. కళ అనేది మానవుడి అంతఃప్రేరణకు ప్రతిరూపం. భావోద్వేగాలను, ఆలోచనలను, విశ్వదృష్టిని వ్యక్తీకరించడానికి ఇది ఓ అద్భుతమైన మాధ్యమం. ప్రతి చలనానికి, ప్రతి సాంస్కృతిక వికాసానికి కళలు మూల స్థంభాలుగా నిలుస్తాయి. చిత్రలేఖనం, కవిత్వం, శిల్పకళ, సంగీతం, నాట్యం, నాటకాలు, సినిమాలు, సాహిత్యం వంటి అనేక రూపాల్లో కళ మన జీవితంలో చొప్పించబడి ఉంది. ఈ దినోత్సవాన్ని జరపడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కళాకారుల కృషిని గుర్తించడం, ప్రజల్లో కళల పట్ల గౌరవాన్ని పెంపొందించడం, యువతలో సృజనాత్మకతను ఉత్తేజితం చేయడం లక్ష్యాలుగా ఉన్నాయి. కళలు శాంతి, సహనాన్ని, సామరస్యాన్ని పెంపొందించగలవని సందేశాన్ని ఈ సందర్భంగా ప్రపంచానికి అందిస్తున్నారు. ఈ సందర్భంగా వివిధ దేశాల్లో కళా ప్రదర్శనలు, సదస్సులు, వర్క్‌షాప్‌లు, లైవ్ ఆర్ట్ డెమోస్, స్కూల్ కళా పోటీలు, పబ్లిక్ ఆర్ట్ ప్రాజెక్టులు నిర్వహించ బడతాయి. ఈ కార్యకమాల ద్వారా కళను సాధారణ ప్రజలకి చేరువ చేస్తారు. అంతేకాక, సామాజిక సమస్యలపై కళల ద్వారా చర్చ జరగడం ద్వారా కళల సామాజిక బాధ్యతను కూడా చాటుతారు. భారతదేశం కళలకు అనాదిగా కాణాచి. ఇక్కడి ప్రతి రాష్ట్రానికి, ప్రతి ప్రాంతానికి ప్రత్యేక కళా సంప్రదాయాలు ఉన్నాయి. భరతనాట్యం, కథక్, కూచిపూడి, మోహినియాటం వంటి నాట్యకళలు, మధుబనీ, కలమ్కారి, వార్లీ, చిరియల్ చిత్ర కళలుబీ అజంతా%–%ఎలోరా లాంటి శిల్పకళా దృశ్యాలు ం ఇవన్నీ భారత సాంస్కృతిక సంపదకు నిదర్శనాలు. ఇటువంటి రోజుల్లో మన సంప్రదాయ కళలను సజీవంగా ఉంచడం అత్యవసరం. డిజిటల్ యుగంలో కొత్త కళా రూపాలు వెలుగులోకి వస్తున్నాయి. డిజిటల్ పెయింటింగ్స్, 3డి ఆర్ట్, వీడియో ఆర్ట్, కంఫెపోరరీ డాన్స్ వంటి రూపాల్లో నేటి యువత కళలను వ్యక్తీకరిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా వారి ప్రతిభ ప్రపంచం దృష్టికి వస్తోంది. అయితే, ఆధునికతను అంగీకరిస్తూనే సంప్రదాయ కళలను గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉంది. సంక్షిప్తంగా చెప్పాలంటే, ప్రపంచ కళా దినోత్సవం ఒక అవకాశం ం మనలోని సృజనాత్మకతను పునరావిష్కరించుకునే, కళల పట్ల గౌరవాన్ని వ్యక్తీకరించే, కళల ద్వారా మానవత్వాన్ని వృద్ధి చేసే అవకాశం. ప్రతి ఒక్కరూ ఏదో ఒక రూపంలో కళను అనుభవించాలి, కళాకారులను ప్రోత్సహించాలి. అదే ఈ దినోత్సవానికి నిగూఢమైన అర్థం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**


# తెలుగు సినిమా విజ్ఞాన సర్వస్వం మ్యూజిక్ రాజా - ఏప్రిల్ 15....మ్యూజిక్ రాజా వర్ధంతి



హాసం రాజాగా సుపరిచితులైన సీనియర్ జర్నలిస్టు మ్యూజిక్ రాజా ఆయన అసలు పేరు మంగు నరసింహస్వామి. మ్యూజిక్ రాజా ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళంలో జూన్ 10, 1951 న జన్మించారు. పిన్న వయసు నుండే సినిమాలు, సినమాల్లో సంగీతం పట్ల ఆసక్తి చూపారు. యుక్త వయసులో సంగీత విమర్శకుడు అయ్యా రు. రాజా సినీ సంగీతం పై వ్యాసాలను రాయడం మొదలు పెట్టి ఒక కొత్త వొరవడిని సృష్టించారు. సంగీతం పట్ల ఆయనకు గల ఆసక్తి, నిరంతరంగా చేసిన పరిశోధనల పరిజ్ఞానం ఆయనను అద్వితీయ విశ్లేషకుడిగా నిలిపాయి. రాజా తను రాసిన వ్యాసాలూ, విశ్లేషణలు, విమర్శల ద్వారా సంగీత పత్రికా రచనలో ఒక కొత్త పంథాకి మార్గ దర్శకుల య్యారు. ఆయన రచనలు సినీ పరిశ్రమలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు పొందాయి. మ్యూజికాలజిస్ట్ గా సేవలం దించడమే కాకుండా, రాజా తనలోని సృజనాత్మక రచనా సామర్ధ్యాలతో కథలు, నవలలు, సీరియల్స్ కూడా రాశారు. ప్రముఖ రచయిత మల్లాది వెంకట కృష్ణ మూర్తిని ముఖ్య పాత్రధారిగా చేస్తూ ప్రత్యక్ష పాత్రలతో రాజా రాసిన నవల "మల్లాది వెంకట కృష్ణమూర్తి" తెలుగు నవలా ప్రపంచంలో సంచలనం సృష్టించింది. అటువంటి ప్రయోగం అంతకు ముందు లేదు. ఆయన రచించి, తమకు అంకితం ఇచ్చిన మినీ కవితల సంకలనానికి డా.సి.నారాయణ రెడ్డి' మెరుపంత' పేరు పెట్టారు. దూరదర్శన్ (తెలుగు ఛానల్) లో ప్రసారమైన 'బుచ్చిబాబు' అనే ధారా వాహికకు రాసిన స్క్రిప్ట్ కు గాను రాజా బెస్ట్ డైలాగ్ రైటర్ అవార్డును అందు కున్నారు. ఈ టీవీ (తెలుగు ఛానల్) లో ప్రసారం అయిన 'పెళ్లి పందిరి' ధారా వాహికకు రాసిన స్క్రిప్టును ప్రేక్షకుల మన్ననలను అందుకుంది. రాజా వార్త దినపత్రికలో వచ్చిన 'ఆపాత మధురం ' అనే శీర్షిక ఆదరణ పొందింది. రాజా సంపాదకత్వంలో వచ్చిన హాసం అనే తెలుగు పక్ష పత్రిక ది బెస్ట్ మ్యాగజైన్ అవార్డును సొంతం చేసుకుంది. ఆయన 800 లకు పైగా వ్యాసాలను, సన్మాన పత్రాలను కూడా రాశారు. వందకు పైగా సినీ సంగీత పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. యస్.పి. బాల సుబ్రహ్మణ్యం నిర్వహించిన పాడాలని ఉంది (మా టీవీ) కార్యక్రమాలలో రెండు ఎపిసోడ్ లకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. మా టీవీ ఛానల్ కోసం రాజా రూపొందించిన గుర్తుకొ స్తున్నాయి కార్యక్రమంతో పాటు వివిధ బాషల (తెలుగు, తమిళ్, కన్నడ, హిందీ, బెంగాలి, ఇంగ్లీష్) సంగీతం పై సృజనాత్మ పరిశోధన 'మధుర క్షణాలు' ప్రశంసా పత్రం అయింది. రాజా అందుకున్న అవార్డులు, సన్మానాలు ఎన్నో ఉన్నాయి. 2002లో అనేక సంగీతా భిమానుల అభిమానాన్ని పొందేలా హాసం అనే పత్రికను రూపొందించి నడిపి నందుకు యూరోపియన్ తెలుగు అసోసియేషన్ (ఈటా) నుండి అవార్డును రాజా గెలుచు కున్నారు. 2007లో మ్యూజిక్ జర్నలిజంలో అందించిన సేవలకు మద్రాస్ తెలుగు అకాడమీ రాజాకు 'సమైక్య భారత్ గౌరవ సత్కార' అవార్డును అందించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతీ ఏటా ఇచ్చే టీవీ నందీ అవార్డు లలో 2006 సంవత్సరానికి రాజా రూపొందించిన 'గుర్తుకొస్తున్నాయి' కార్యక్రమం ఫస్ట్ బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ గా బంగారు నందిని పొందింది. మెగాస్టార్ చిరంజీవి, నాగార్జున చేత రాజా సన్మానించ బడ్డారు. 'గుర్తుకొస్తున్నాయి' కార్యక్రమము పాత తరం నటీనటులు, దర్శకులు, సంగీత దర్శకులు, నిర్మాతల మధుర జ్ఞాపకాలను వెలికితీసింది. సినీ పరిశ్రమలో సుదీర్ఘ కాలం హీరోగా చెరగని ముద్ర వేసుకున్న అక్కినేని నాగేశ్వరరావుతో చేసిన ముఖాముఖి 74 ఎపిసోడ్ల వరకు కొనసాగింది. ఒకే వ్యక్తిపై ఇన్ని ఎపిసోడ్ లు రావడం తెలుగు టీవీ చరిత్రలో ఇంతవరకూ లేక పోవడం గమనార్హం. ఈ ముఖాముఖీ కార్యక్రమం ద్వారా పంచుకోని మధుర క్షణాలు లేవని, రాజా తన జీవిత చరిత్రను మొత్తం వెలికి తీశారని అక్కినేని నాగేశ్వరరావు వ్యాఖ్యా నించడం విశేషం. సినిమా, పత్రికా రంగాలకు విశిష్ట సేవలు అందించి, మ్యూజికాలజిస్ట్ అని సినీ సంగీత కళాకారులు అభిమానంతో పిలుచుకునే మ్యూజిక్ రాజా 2021 ఏప్రిల్ 15న గురువారం కన్ను మూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# తెలంగాణ తొలి శతావధాని శిరశినగల్ కృష్ణమాచార్యులు - ఏప్రిల్ 15...శిరశినగల్ కృష్ణమాచార్యులు వర్ధంతి



తెలంగాణ గర్వించదగిన కవి శిరశినగల్ కృష్ణమాచార్యులు. అభినవ కాళిదాసు, నైజాం రాష్ట్రాద్య శతావధాని, పండిత రత్న, ఉభయవేదాంత విద్వాన్, ఉభయ వేదాంతాచార్య , కోరుట్ల కృష్ణమాచార్యులు తదితర బిరు దాంకితులు. కృష్ణమాచార్యులు నిజామాబాద్ జిల్లా లోని మోర్తాడ్ గ్రామంలో 1905, ఆగస్టు 12 వ తేదీ క్రోధి నామ సంవత్సర, శ్రావణ శుక్ల విదియ నాడు రంగమ్మ, వేంకటా చార్య పుణ్య దంపతులకు జన్మించారు. బాల్యంలో పితామహులైన సింగారాచార్యుల, తండ్రి గారైన వేంకటాచార్యుల వద్ద విద్యను అభ్యసించారు. తరువాత మాతామహులైన గోవిందాచార్యుల వద్ద 1914 నుండి 1921 వరకు ఏడు సంవత్సరాలు కావ్య, నాటక, అలంకార, సాహిత్య గ్రంథాలు, తిరుమంత్రార్థము, శ్రీ వచన భూషణ వ్యాఖ్యానము మొదలైన గ్రంథాలు అధ్యయనం చేశారు. ఆనంతరం వల్లంకొండలో కనకా పురం శ్రీనివాసాచార్యుల వద్ద తర్క ప్రకరణాలు, మోర్తాడులో కందో ఝల వెంకన్న వద్ద సిద్ధాంత భాగము, పిఠాపురంలో గుదిమెళ్ళ రంగాచార్య వద్ద వేదాంతమును అభ్యసించారు. ఆయన 1926 నుండి కోరుట్ల లోని ఉభయవేదాంత సంస్కృత పాఠశాలలో ఉపాధ్యాయులుగా ప్రవేశించి, ధర్మపురి, కరీంనగర్ సంస్కృత పాఠశాలలలో విధులు నిర్వర్తించి, కోరుట్లలో ప్రధానోపా ధ్యాయులుగా పదవీవిరమణ చేశారు. పలువురు విద్యార్థులకు సంస్కృత సాహిత్యం నేర్పించారు. సంస్కృతాంధ్రాలలో 40కి పైగా గ్రంథాలను రచించారు. వీటిలో కావ్యాలు, శతకాలు, సుప్ర భాతాలు, స్తుతిగీతాలు, హరికథలు మొదలైనవి ఉన్నాయి కళాశాల అభ్యుదయం, రామానుజ చరితం, చిత్ర ప్రబంధం రత్నమాల (ఖండ కావ్యం) మనస్సందేశ కావ్యము, సంపత్కుమార సంభవ కావ్యము, గాంధీ తాత నీతిశతకము, గీతాచార్య మతప్రభావ శతకము, వెదిర వేంకటేశ్వరస్వామి సుప్రభాతము, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి సుప్రభాతము, వేణుగోపాలస్వామి సుప్రభాతము, నంబులాద్రి నృసింహస్వామి సుప్రభాతము, పద్మావతీ పరిణయము (హరికథ) రుక్మిణీ కళ్యాణము (హరికథ) ముకుందమాల యామునా చార్యులవారి స్తోత్ర రత్నగీత ములు విశిష్టాద్వైతమత సంగ్రహము వేదార్థ సంగ్రహము (అనువాదం) గురువంశ కావ్యనిధి, స్వీయ కవితాను జీవనం ఆత్మకథ తదితర రచనలు చేశారు. ఆయన కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి తదితర పట్టణాలలో అష్టావ ధానాలు, శతావధానాలు చేశారు. తెలంగాణా ప్రాంతంలో మొట్టమొదటి అవధానిగా కీర్తి గడించారు. నైజాం రాష్ట్రాద్య శతావధాని, పండితరత్న, ఉభయ వేదాంత విద్వాన్, ఉభయ వేదాంతాచార్య మొదలైన బిరుదులు పొందారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు, ఢిల్లీలో జియ్యర్ స్వామి, మొదటి ప్రపంచ తెలుగు మహా సభలలో ముఖ్య మంత్రి జలగం వెంగళరావు ఘనంగా సత్కరిం చారు. శతావధాని కృష్ణమాచార్యుల రచనలపై పలువురు కాకతీయ, ఉస్మానియా యూని వర్సిటీల్లో పిహెచ్‌డిలు చేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఏప్రిల్ 15... గురునానక్ జయంతి



పదిమంది సిక్కు గురువులలో ప్రథములు గురునానక్ దేవ్. నానక్ 1469 ఏప్రిల్ 15న పాకిస్తాన్ లోని ప్రస్తుతం లాహోర్ సమీపంలోని తల్వాండీ గ్రామంలో (నన్కానా సాహిబ్)లో (ఇది అప్పటి ఢిల్లీ సుల్తానేట్ ప్రావిన్స్, ప్రస్తుతం ఈ ప్రదేశం నంకన్ సాహిబ్ అని పిలువ బడుతూ ఇప్పుడు పాకిస్థాన్ లో ఉంది) నానక్ దేవ్ కార్తీక పౌర్ణమి పుణ్య దినాన జన్మించారు. గురునానక్ తల్లిదండ్రులు కళ్యాణ్ చంద్ దాస్ బేడి, వీరిని కళ్యాణ్ దాస్ మెహతా మరియు మాతా త్రిప్తి అని కూడా పిలుస్తారు. హిందూ, ఇస్లామియా మత గ్రంథాలను చదివి, అవగాహన చేసుకుని, రెండు మతాలకు భిన్నమైన సిక్కు మతాన్ని స్థాపించారు. సిక్కు మతం ఏకేశ్వరోపాసక మతం. సిక్కులు ఏక్ ఓంకార్ (ఏకైక దేవుడు)ని విశ్వసిస్తారు. సిక్కుమత స్థాపకులై, ఏకేశ్వరోపాసనను ప్రబోధించి, కుల వ్యవస్థను వ్యతిరేకించారు. నానక్ దేవ్ అనంతరం ఈ గురు పరంపర కొనసాగుతున్నది. ఐదవ గురువు అర్జున్, తమకు ముందు గురువులకు దైవం అనుగ్రహించిన సూక్తులను, బోధనలను సంకలనం చేసి, "గురుగ్రంథ సాహిబ్" పవిత్ర గ్రంథ రూప కల్పన గావించారు. నానక్ తండ్రి కళ్యాణ్ చంద్‌దాస్, కలుమెహతాగా సుపరిచితులై, ప్రభుత్వంలో భూ రెవెన్యూ వ్యవహారాల గుమాస్తాగా పని చేసే హిందూ పట్వారీ. తల్లి మాతా త్రిపుర, అక్క బీబీనాన్కీ. నానక్‌దేవ్ బాల్యం నుండే ప్రశ్నించే, ఆలోచించే తత్వం కలవారు. చిరుప్రాయంలోనే మతపరమైన ఉపనయనం చేసి, జంధ్యం వేయబోగా తిరస్కరించి, అంతకంటే భగవంతుని నిజ నామాన్ని హృదయంలో ధరిస్తామని, భగవన్నామం యజ్ఞోపవీతం నూలుపోగులా తెగిపోవడం, మట్టిలో కలిసి పోవడం ఉండక, అఖండంగా రక్షణ కలిగిస్తుందనీ వాదించారు.

అత్యంత చిన్న వయసునుండి అక్క బీబీనాన్కీ, తమ్ముని‌లో భగవంతుని జ్యోతిని చూడగా, ఈ రహస్యాన్ని ఎవరితోనూ ఆమె పంచుకోలేదు. ఆమె నానక్‌జీ తొలి శిష్యురాలిగా పేరొందారు. బాల్యంలోనే హిందూమతం లోని తాత్వికతకు ఆకర్షితులై, జీవిత రహస్యాల అన్వేషణ కోసం ఇల్లు వదలి పోయారు. ఈ క్రమంలోనే నానక్‌దేవ్ ముఖ్య తాత్వికులైన కబీర్, రవిదాస్‌లను కలుసు కున్నారు. బతాలాకు చెందిన వ్యాపారి మూల్‌చంద్ చోనా కూతురు సులేఖినిని వివాహ మాడారు. శ్రీచంద్, లక్ష్మీదాస్ అనే కుమారులు వారికి కలిగారు. 28ఏళ్ళ వయసులో నానక్ ఒక ఉదయం నది స్నానం, ధ్యానానికి వెళ్ళగా, మూడు రోజులు ఎవరికీ కన్పించలేదు. తిరిగి వచ్చి, దేవుని పవిత్రాత్మను నింపుకున్నాను అని ప్రకటించారు. అనంతరం "హిందువూ లేడు, ముస్లిమూ లేడు" అని మత సామరస్య బోధనలను వ్యాప్తి చేయడం ప్రారంభించారు. ఆ తర్వాత నాలుగు ప్రధాన దిశల్లో టిబెట్, దక్షిణాసియాలోని పలు ప్రాంతాలు, అరేబియా, మక్కా, బాగ్దాద్, ముల్తాన్ తదితరాలలో ఉదాసీలనే పేరున భగవంతుని సందేశాన్ని ప్రబోధిస్తూ, ప్రయాణాలు సాగించారు. గురునానక్ దేవ్ ప్రకారం సిక్కు మతానికి సంబంధించి మూడు మార్గదర్శక సూత్రాలు ఉన్నాయి. నామ్ జపన (దేవున్ని ఎప్పటికప్పుడు గుర్తు చేసుకోవడం), కిరాత్ కర్ణ (నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటం), వంద్ చకనా (మీతో ఉన్న దానిని ఇతరులతో పంచుకోవడం). ఇతరుల సంపాదనపై ఆధారపడి జీవించకూడదు. నానక్ బోధనలలో... భగవంతుడే అతి ముఖ్యమైనవాడు. దేవుడు ఒక్కడే. ఆకలితో అలమటించే వారికి అన్నం యిచ్చేవారినీ, దుస్తులేని వారికి దానం చేసే వారిని దేవుడు ప్రేమిస్తాడు. అందరూ గొప్ప పుట్టుక కలవారే. అత్యాశను జయించిన వారిని భగవంతుడు ప్రేమిస్తాడు. పవిత్రమైన హృదయంతో అతడిని ధ్యానించడం, అతడిని ప్రశంశించడం అన్నవే ముక్తి మార్గాలు అనేవి ముఖ్యమైనవి. నానక్ జీవిత చరమాంకంలో ఉచిత ప్రసాదం లభించిన కర్తార్‌పూర్‌లో జీవించారు. తాను తీసుకునే ఆహారాన్ని కుల, మత బేధం లేకుండా పంచుకునే వారు. పొలాలలో పని చేసి జీవితం గడిపారు. కొత్త సిక్కు గురువుగా భాయ్ లెహ్నాను ప్రకటించాక సెప్టెంబర్ అక్టోబర్ 22న 1539లో తన 70వ ఏట స్వర్గప్రాప్తి పొందారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



# నది నుంచి నల్లా దాకా..!

చౌటుప్పల్: ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 35 లక్షల మందికి కృష్ణా, గోదావరి నదుల నీళ్లు మిషన్ భగీరథ పథకం ద్వారా నల్లాల్లో సరఫరా అవుతున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఈ నదీ జలాలను శుద్ధి చేసి నల్లాలతో అందిస్తున్నారు. నది నుంచి సేకరించిన నీళ్లను జిల్లాలోని స్వాములవారి లింగోటం, పానగల్లులో ప్రత్యేకంగా నెలకొల్పిన ప్లాంట్లలో నాలుగు దశల్లో శుద్ధి చేస్తారు. శుద్ధీకరణ పూర్తయ్యాక ఆ నీళ్లకు పరీక్షలు నిర్వహిస్తారు. పూర్తి స్థాయి నాణ్యత ప్రమాణాల ప్రకారం శుద్ధీకరణ పూర్తయిందని నిర్ధరించుకున్నాక.. ట్యాంకుల్లోకి ఎక్కించి గ్రామాలకు సరఫరా చేస్తారు. గ్రామ పంచాయతీల్లోని నల్లాల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తారు. మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల పరిధిలో 1197 గ్రామాలకు సరఫరా అవుతున్న నీటి శుద్ధీకరణ జరిగే ప్రక్రియను మిషన్ భగీరథ పథకం(గ్రిడ్) చౌటుప్పల్ ఈఈ లక్ష్మీనారాయణ వివరించారు.

మొదటి దశ.. అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఏకేబీఆర్) నుంచి కృష్ణా నీటిని నాంపల్లి మండలం స్వాములవారి లింగోటంలోని నీటి



శుద్ధి కేంద్రానికి పంపిస్తారు. ఈ ప్లాంటులో పైపుల ద్వారా నీరు ప్రవహిస్తున్నప్పుడే ప్రీ క్లోరినేషన్ చేసి నీళ్లలో ఏవైనా బ్యాక్టీరియాలు ఉంటే నశింపజేస్తారు. తర్వాత ఏవియేటర్‌లోని నీళ్లను పంపిస్తారు. అక్కడ నీటిని చిలుకుతారు. ఆ ప్రక్రియతో నీటిలోకి ఆక్సీకరణ చేస్తారు. టర్బిడిటీని తొలగిస్తారు.

రెండో దశ.. తొలి దశలో శుద్ధి అయిన లక్ష లీటర్ల నీళ్లకు రెండు గ్రాములు చొప్పున స్పటికాలతో కూడిన ఆలం కలుపుతారు. క్లారి ఫ్లోక్యులేటర్ ద్వారా ఈ నీటిని పంపించి శుద్ధి చేస్తారు.

మూడో దశ.. రెండు దశల్లో శుద్ధి చేసిన నీటిని ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్లలోకి పంపిస్తారు. రెండు మీటర్ల ఎత్తుండే ఈ ఫిల్టర్‌లో నాలుగు పొరలుగా గులకరాళ్లు, ఇసుక పేర్చి ఉంటుంది. వీటి ద్వారా వడగట్టిన నీటి టర్బిడిటీ 0-1 ఎన్‌టీయూకు తగ్గుతుంది. నాలుగో దశ.. మూడు దశల్లో శుద్ధి అయిన నీళకు పోస్ట్ క్లోరినేషన్ చేసి సంప్‌లోకి చేరుస్తారు. నాలుగో దశ శుద్ధి తర్వాత ఈ నీళ్లు స్వచ్ఛంగా, తేటగా, రుచిగా, శరీరానికి అవసరమైన అన్ని రకాల పోషకాలతో కూడి ఉంటాయి. శుద్ధి అయిన నీటిని ఉపరితల రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తారు. అక్కడి నుంచి భూమ్యాకర్షణ ద్వారా గ్రామాల్లోని శుభ్రం చేసి క్లోరినేషన్ చేసి ఉన్న ఉపరితల ట్యాంకుల్లో నింపుతారు. అక్కడి నుంచి ఇళ్లలోని నల్లాల ద్వారా ప్రజలకు సరఫరా జరుగుతుంది. పూర్తిస్థాయిలో శుద్ధీకరణ జరిగి, తగినన్ని పోషకాలున్న మిషన్ భగీరథ నీళ్లను ఎలాంటి అనుమాల్లేకుండా తాగవచ్చు.

# కన్నేసి..కాజేసి

కోదాడ : అర్బన్ ప్రాంతాలలోని భూముల ధరలకు గిరాకీ అంతా ఇంతా కాదు. అందులోనూ రహదారికి ఆనుకొని ఉండే భూమికి రూ.కోట్ల వర్షమే కురుస్తుంది. ఇలాంటి భూములపై కన్నేసిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ల అభివృద్ధి పేరుతో వరద కాలువలను సైతం కలిపేసుకుంటున్నారు. ప్రభుత్వం ప్రతి రహదారికి ఇరువైపులా వరద కాలువలను నిర్మాణ దశలోనే ఏర్పాటు చేస్తుంది. హఠాత్తుగా భారీ వర్షాలు వచ్చినా ఈ కాలువల ద్వారా నీళ్లు ప్రవహిస్తుంది. గతేడాది భారీ వర్షాల కారణంగా రహదారులకు ఇరువైపులా కాలువలు లేక వరదలు సంభవించాయి. కోదాడ పట్టణంలో వరదల ధాటికి ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడగా, మండలంలో వేల ఎకరాల పంట కొట్టుకుపోయింది. అయినా అధికారులకు పట్టింపు లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నుంచి మేళ్లచెరువు ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా వరద కాలువ కనుమరుగైంది. ఈ ప్రాంతంలో ఎకరం భూమి రూ.కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకు ధర పలుకుతుంది. రియల్ వ్యాపారులే కాక కొందరు రైతులు సైతం కాలువను ఆక్రమించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం- సూర్యనారాయణ, ఆర్డీవో కోదాడవరద కాలువలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం. రహదారులకు ఇరువైపులా వరద కాలువలు తప్పనిసరిగా ఉండాలి. రైతులకు ఇబ్బందులు లేకుండా వెంచర్ల యజమానులు నిబంధనలు పాటించాలి.

# తవ్వేకొద్దీ అక్రమాలు!

పాల్వంచ : పాల్వంచకు అతి సమీపంలోని ముర్రేడు, కిన్నెరసాని నదుల నుంచి ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. పాల్వంచ పట్టణంలోని కుంటినాగులగూడెం, శ్రీనివాసకాలనీ, మంచికంటినగర్, శివనగర్, విద్యుత్ ఎంప్లారస్ కాలనీ, కేఎల్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంతం, బసవతారకకాలనీ, జగన్నాథపురం, లక్ష్మీదేవిపల్లిలో వందలాది సంఖ్యలో నూతన భవనాలు, వ్యాపార సముదాయాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.కొందరు బిల్డర్లు, భవన నిర్మాణ యజమానులు.. తోగ్గూడెం సమీపంలోని ముర్రేడు వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఒడ్డుకు ఇసుకను రాత్రిపూట డంప్ చేసి లారీల్లో పాల్వంచకు తరలిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంగం, రంగాపురం, నాగారం వద్ద కిన్నెరసాని నది, పాత పాల్వంచలో ముర్రేడు నది నుంచి రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది.

**పట్టించుకోని యంత్రాంగం**

తోగ్గూడెం కేంద్రంగా ఇసుక డంప్ చేసి అక్రమంగా తరలిస్తున్నా పోలీసు, రెవెన్యూ, మైనింగ్, అటవీశాఖ అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా ఒకట్రెండు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నదుల నుంచి ఇసుకను టన్నుల కొద్దీ తరలించటం వల్ల భూగర్భజలాలు ఇంకిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ, మైనింగ్, అటవీ, చెక్‌పోస్ట్ అధికారులు పకడ్బందీగా తనిఖీలు చేపడుతూ ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

పోలీసు, మైనింగ్ అధికారుల సహకారంతో అక్రమ మైనింగ్‌పై ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నాం. ఇసుక అక్రమ రవాణాపై తరచూ కేసులు నమోదుచేస్తున్నాం. స్వాధీనపరచుకున్న ఇసుకకు పలుమార్లు బహిరంగ వేలం నిర్వహించాం.వివేక్, తహసీల్దార్, పాల్వంచ

# రూ.2 లక్షలకో ఉద్యోగం!



జగిత్యాల : జగిత్యాల పురపాలక సంఘంలో అధికారుల అక్రమాలకు అంతు లేకుండా పోతోంది. పురపాలక సంఘం ఇంజినీరింగ్ తాగునీటి సరఫరా విభాగంలో పనిచేసేందుకు 51 మంది సిబ్బంది నియామకానికి గతేడాది మార్చి 6న పురపాలక సాధారణ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ లెక్కన 47 మంది సిబ్బంది విధుల్లో ఉన్నారు. మరో నలుగురు సిబ్బంది అవసరం ఉన్నప్పటికీ ఇంజినీరింగ్ అధికారులు పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లలేదు. ఈ విషయంలో గోప్యత పాటించారు. 2024 సెప్టెంబరులో ఓ వ్యక్తిని పాలకవర్గం, కలెక్టర్ ఆమోదం లేకుండా విధుల్లో నియమించారు. ఇదే పద్ధతిలో మరో ముగ్గురిని కూడా మార్చి నెలలో విధుల్లోకి తీసుకొని వేతనాలు కూడా చెల్లించారు.

నిబంధనలకు తిలోదకాలు..పురపాలక సంఘంలో ఏ విభాగంలోనైనా ఒప్పంద ఉద్యోగాల భర్తీ కౌన్సిల్ తీర్మానం మేరకు లేదా కలెక్టర్ ఆమోదంతోనో చేపడతారు. అవసరమైన సిబ్బంది నియామకాలను తొలుత కౌన్సిల్ ఎజెండాలో చేర్చుతారు. ఆమోదం అనంతరం నియామకాల ప్రక్రియ కోసం పట్టణ సమాఖ్య(టౌన్ లెవల్ ఫెడరేషన్)కు బాధ్యత అప్పగిస్తారు. ఈ మేరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా పత్రికా ప్రకటనలిస్తారు. ఆ తరువాత అర్హులైనవారిని నిబంధనల మేరకు కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు నియమిస్తారు. కానీ ఇవేవీ లేకుండానే కిందిస్థాయి సిబ్బందే అన్నీ తామై నియామకాలు చేపట్టారు. కౌన్సిల్ పదవీకాలం ముగియడంతో అక్రమ నియామకాలకు తెరలేపారు. నియామకాలు పొందిన నలుగురి నుంచి రూ.2 లక్షల చొప్పున వసూలు చేసినట్లు సమాచారం.

**అక్రమాలే అధికం..**

పురపాలక సంఘంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఇంజినీరింగ్ విభాగాల్లో అక్రమ నియామకాలు బల్దియా ప్రతిష్ఠను దిగజార్చుతున్నాయి. గతేడాది ఒప్పంద పారిశుద్ధ్య విభాగంలోనూ 15 పోస్టులకుగాను 3 భర్తీ చేసి 12 ఖాళీగా ఉంచారు. వీటిని 2024 ఆగస్టులో కలెక్టర్, పాలకవర్గం ఆమోదం లేకుండా ఒక్కో పోస్టుకు రూ.1.50 లక్షలు తీసుకున్నారనే వివాదం బల్దియాను కుదిపేసింది. అక్రమ పద్ధతిలో చేరిన 12 మంది సిబ్బంది వేతనాలు సైతం అప్పటి కమిషనర్ నిలిపివేసి విచారణ చేపట్టారు. తాజాగా ఇంజినీరింగ్ విభాగంలో ప్రత్యేకాధికారుల పాలనలోనూ కొందరు సిబ్బంది అక్రమాలకు తెరలేపడం గమనార్హం.

**విచారణ చేపట్టాంస్పందన, కమిషనర్ జగిత్యాల**

పురపాలిక ఇంజినీరింగ్ తాగునీటి సరఫరా విభాగంలో నలుగురిని కౌన్సిల్ ఆమోదం లేకుండా నియమించిన విషయమై విచారణ చేపట్టాం. నలుగురి నియామకం ఏ పద్ధతిలో చేపట్టారని ఇంజినీరింగ్ అధికారులను సంజాయిషీ కోరాం. నిబంధనల మేరకే నలుగురి నియామకం జరిగిందని ఏఈ తెలిపారు. ఇందుకు అవసరమైన ఆధారాలు రాతపూర్వకంగా సమర్పించాలని ఆదేశించాను. 2 రోజుల గడువు అనంతరం వివరాలు సమర్పిస్తామని ఏఈ తెలిపారు.

# తూనికాకు సేకరణకు సన్నద్ధం



మంథని : జిల్లాలో తునికాకు సేకరణకు అటవీ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కొన్ని రోజులుగా అడవుల్లో కొమ్మల కత్తిరింపు(ప్రూనింగ్) పనులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో జిల్లాల వారీగా తునికాకు యూనిట్ల నిర్వహణకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు ఆహ్వానించారు. జిల్లాలోని 7 యూనిట్ల పరిధిలో మొత్తం 47 కల్లాలున్నాయి. వీటి ద్వారా ఈ ఏడాది 7,600 ఎస్‌బీ(స్టాండర్డ్ బ్యాగు)ల తునికాకు సేకరణ లక్ష్యంగా పెట్టుకోగా మంథని డివిజన్‌లోని ముత్తారం-బీ, ఖమ్మంపల్లి, పెద్దపల్లి డివిజన్‌లోని కల్వచర్ల యూనిట్లకు మాత్రమే టెండర్లు ఖరారయ్యాయి. మంథనిలోని ముత్తారం-ఏ, మంథని, పెద్దపల్లిలోని రామగుండం, కన్నాల(బసంత్‌నగర్) యూనిట్లపై ఎవరూ ఆసక్తి చూపలేదు.

**18 కల్లాల నిర్వహణ**

టెండర్లు పూర్తయిన యూనిట్ల పరిధిలో మొత్తం 18 కల్లాలు నిర్వహించనున్నారు. ముత్తారం-బీ యూనిట్‌లో దర్యాపూర్, కేశన్‌పల్లి, పారుపల్లి, హరిపురం, మైదంబండ, మచ్చుపేట, ఖమ్మంపల్లి పరిధిలో చిన్నఓదాల, ధర్మారం-ఏ, గోపాల్‌పూర్-బీ, జిల్లాలపల్లి-ఏ, బీ, ఖమ్మంపల్లి-ఏ, బీ, సీతంపల్లి, కల్వచర్ల యూనిట్‌లో గౌరెడ్డిపల్లి, రత్నాపూర్, సబ్బితం, వెన్నంపల్లి కల్లాలున్నాయి.

**గుత్తేదారుల నిరాసక్తత**

జిల్లాలో 7 యూనిట్లకు మూడింటికి మాత్రమే టెండర్లు పూర్తి కావడం.. వ్యాపారుల నిరాసక్తతకు అద్దం పడుతోంది. గతేడాది ముత్తారం-ఏ, బీ, కల్వచర్ల యూనిట్లు మాత్రమే అమ్ముడుపోయాయి. పెద్దపల్లి డివిజన్ పరిధిలోని రామగుండం, కన్నాల పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలుండటంతో వ్యాపారులు ఆసక్తి చూపలేదు.

**2,800ల ఎస్‌బీల సేకరణ లక్ష్యం**

జిల్లాలో అమ్ముడుపోయిన మూడు యూనిట్ల పరిధిలో 2,800 స్టాండర్డ్ బ్యాగు(ఎస్‌బీ)ల తునికాకు సేకరణను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో ఎస్‌బీలో 1000 కట్టలు, ఒక కట్టలో 50 ఆకులుంటాయి. ముత్తారం-బీ యూనిట్‌లోని 6 కల్లాల ద్వారా 900 ఎస్‌బీలు, ఖమ్మంపల్లి పరిధిలోని 8 కల్లాల ద్వారా 1700 ఎస్‌బీలు, కల్వచర్లలోని 4 కల్లాల ద్వారా 200 ఎస్‌బీల తునికాకు సేకరణను అటవీ శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. సేకరణ ప్రక్రియ ఆలస్యంతో లక్ష్యం చేరికపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రభుత్వ ధర కట్టకు రూ.3.05**

ప్రస్తుత సీజన్‌లో 50 ఆకులతో కూడిన కట్ట సేకరణకు రూ.3.05గా ధర నిర్ణయించారు. ఒక మనిషి రోజుకు 300 కట్టలు సేకరిస్తే సరాసరి రూ.వెయ్యి వరకు కూలీ గిట్టుబాటవుతుంది. నెల రోజుల పాటు తునికాకు సేకరణతో సీజన్‌లో ఇద్దరు సభ్యులున్న కుటుంబానికి రూ.20 వేల నుంచి రూ.25 వేల ఆదాయం రానుంది.

**కూలీలు జాగ్రత్తలు పాటించాలి**మే మొదటి వారంలో తునికాకు సేకరణ ప్రారంభమవుతుంది. కూలీలు ముదిరిన ఆకులనే సేకరించాలి. అడవి పందులు, ఎలుగుబంట్లు, ఇతర వన్యప్రాణులకు ఎలాంటి హాని కలిగించొద్దు. రాత్రి పూట వెళ్లేవారు తప్పనిసరిగా టార్చిలైట్‌ను, తాగునీటిని వెంట తీసుకెళ్లాలి. దళారులను సంప్రదించడం కానీ, అక్రమంగా తరలించడం కానీ చేయొద్దు. ప్రభుత్వ కల్లాల్లోనే విక్రయించాలి. శివయ్య, జిల్లా అటవీ శాఖ అధికారి

# ఇక పూలు.. పండ్లు అమ్మొచ్చు..!

భానుపురి : జిల్లాలోని మార్కెట్లు జీవం పోసుకోనున్నాయి. వీటిలో పండ్లు, కూరగాయలు, పూల విక్రయాలకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. మొదట పెద్ద మార్కెట్ యార్డుల్లో వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీచేసింది. తర్వాత జిల్లాలోని మార్కెట్లకు అవకాశాలు రానున్నాయి. మార్కెట్ యార్డుల్లోని ఖాళీ స్థలాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవడం ద్వారా వాటి ఆదాయం పెరగనుంది. వినియోగదారులకు అన్నిరకాల ఉత్పత్తులు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికను అమలు చేయనుంది. పెద్ద మార్కెట్లలో విజయవంతమైన తర్వాత మిగతా మార్కెట్లకు అనుమతులు ఇవ్వనున్నట్లు ఇటీవల రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు.

**జిల్లాలో 6 మార్కెట్లు..**జిల్లాలో సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి, తుంగతుర్తి, నేరేడుచర్ల, హుజూర్‌నగర్‌లో వ్యవసాయ మార్కెట్ యార్డులున్నాయి. వీటిలో సూర్యాపేట, తిరుమలగిరి మార్కెట్లు నిత్యం క్రయవిక్రయాలు సాగిస్తాయి. మిగతా మార్కెట్లయిన కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్లలో ధాన్యం విక్రయాలు చేపట్టవు. ఇక్కడ రైతులు మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తారు. తుంగతుర్తి మార్కెట్ పరిధిలో ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఇక్కడ ఎలాంటి క్రయవిక్రయాలు సాగవు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తుంగతుర్తి మార్కెట్లలో పూలు, పండ్లు, కూరగాయల



విక్రయాలు చేపడితే మార్కెట్లకు ఆదాయం సమకూరుతుంది. వీటి పరిధిలోని ఉన్న స్థలాలను వినియోగిస్తే వ్యాపారులకు ఉపాధి కల్పించడంతోపాటు కొంత ఆదాయం వచ్చేలా అవకాశముంటుంది. సూర్యాపేట, తిరుమలగిరి మార్కెట్లు ఇప్పటికే క్రయవిక్రయాల ద్వారా ఆదాయం సమకూరుతోంది. ఆదేశాలు రాలేదు.. - నాగేశ్వరశర్మ, జిల్లా మార్కెట్ అధికారి, సూర్యాపేటమార్కెట్లలో పూలు, పండ్లు, కూరగాయల విక్రయాలు చేపట్టాలని ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. వచ్చిన వెంటనే అమలుకు చర్యలు తీసుకుంటాం. మొదట ప్రభుత్వం ఎంపిక చేసిన మార్కెట్లలో ప్రారంభిస్తారు. ఆ తర్వాత ఏమైనా అవకాశం రావచ్చు.

# పాలు..కల్తీ కనిపెడితే మేలు

ఖమ్మం : పాలు, పాల పదార్థాలు లేకుండా రోజు గడవని పరిస్థితి. టీ, కాఫీలతోపాటు పిల్లలు తాగేందుకు, పెరుగు తోడు పెట్టుకునేందుకు జిల్లాలో పెద్దఎత్తున పాలు ఉపయోగిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విజయ డెయిరీ ద్వారా రోజుకు సుమారు 10 వేల లీటర్లు, 20 ప్రైవేటు డెయిరీల నుంచి 70 వేల లీటర్ల వరకు విక్రయాలు జరుగుతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు రోజుకు లక్షన్నర లీటర్ల వరకు క్షీరం అవసరం. ఉత్పత్తి సరిగా లేక కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

**తస్మాత్ జాగ్రత్త...**

అవసరాలకు తగిన ఉత్పత్తి లేకపోవడంతో అక్రమార్కులు కల్తీ పాలకు తెర లేపుతున్నారు. రెండు రోజుల కిందట ఖమ్మం నగరంలో కల్తీ పాల విక్రయాలు కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. కొంతమంది నీళ్లు కలిపి విక్రయిస్తే, మరికొందరు ఏకంగా కల్తీవే తయారు చేస్తున్నారు. చిక్కదనం కోసం పిండి పదార్థాలు వాడుతున్నారు. కొవ్వుశాతం ఉండేలా నూనెలు కలుపుతున్నారు. బోరిక్ యాసిడ్, క్లోరిన్, అమ్మోనియా సల్ఫేట్, బెంజాయిక్ యాసిడ్, కాస్టిక్ సోడా, డిటర్జెంట్లు, హైడ్రోజన్ పెరాక్సైడ్, సాలిసిక్ యాసిడ్ వంటి ప్రమాదకర రసాయనాలను ఉపయోగిస్తున్నారు. మాల్టోడెక్స్‌ట్రిన్ పిండి పదార్థాన్ని జన్యుమార్పిడి చేసిన మొక్కజొన్న నుంచి తయారు చేస్తారు. దీని



గ్లైకమిక్స్ ఇండెక్స్ 105 నుంచి 130 వరకు ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిని అమాంతం పెంచుతుంది. పేగు వాపు మొదలు బరువు పెరగటం, అలర్జీ, క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**కనిపెట్టడం ఇలా...**

నున్నటి గ్రానైట్ రాయిపై చుక్క పాలు వేస్తే త్వరగా జారిపోతే మంచి పాలు. నెమ్మదిగా జారితే కల్తీవి. పాలల్లో కొన్ని చుక్కల అయోడిన్ ద్రావణాన్ని కలిపితే నీలి రంగులోకి మారితే పిండి పదార్థం కలిపినట్లే. అర టేబుల్ స్పూన్ సోయాబీన్ పిండిని ఒక చెంచా పాలతో కలిపి కొద్దిసేపు కలియదిప్పాలి. 5 నిమిషాల తర్వాత రెడ్ లిట్మస్ కాగితాన్ని ముంచినప్పుడు నీలి రంగులోకి మారితే యరియా కలిపినట్లు. పాలలో నీళ్లు కలిపి కలియబెడితే నురగ వస్తే డిటర్జెంట్ కలిపినట్లు.

# అధిక దిగుబడికి విత్తే పద్ధతే ప్రధానం

ఖమ్మం : ఖమ్మం జిల్లాలోని వైరా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గతేడాది అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. మధిర, చింతకాని, వైరా, కొణిజర్ల, ముదిగొండ, కామేపల్లి, రఘునాథపాలెం, కూసుమంచి, తల్లాడ, నేలకొండపల్లి మండలాల్లో సుమారు 200 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా సాగు చేయించారు. క్షేత్ర ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చే వానాకాలం సీజన్ నుంచి వైరా, ఏన్కూరు, కొణిజర్ల, రఘునాథపాలెం మండలాల్లో 254 ఎకరాల్లో సాగు చేసేందుకు ప్రణాళిక ఖరారు చేశారు. ఇప్పటి నుంచే రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.రవికుమార్ తెలిపారు.

**ఉత్పాదకత పెంచేందుకు..**

ప్రస్తుతం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 4 లక్షల ఎకరాలకు పైగా రైతులు పత్తి సాగు చేస్తున్నారు. ఉత్పాదకత మాత్రం ఆశించిన స్థాయిలో లేదు. సాగు చేసే రకాలు, పాటించే యాజమాన్య పద్ధతులు, విత్తే దూరం, ఎకరాకు తక్కువ మొక్కల సాంద్రత, ఎక్కువ పంట కాలం, చీడపీడలు, కూలీలతో ఏరించటం లాంటి అంశాలు ఇందుకు కారణమవుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని అధిక సాంద్రత పత్తి



సాగుపై అవగాహన కల్పిస్తున్నారు.

**ఇవీ లాభాలు..**

ఒకేసారి పత్తి ఏరుకోవచ్చు ముందుగా చేతికి రావటం, ఒకేసారి పూత, కాయలు రావటంతో గులాబిరంగు పురుగు తాకిడి నుంచి పంట బయటపడుతుంది. రెండో పంట సాగుకు అనుకూలం. డిసెంబరులో పంట తీసిన తర్వాత పెసర, మినుము లాంటి అపరాలను సాగు చేస్తే నేల సారవంతమవుతుంది. తర్వాత విత్తే పంటకు ఎరువుల మోతాదు చాలా వరకు తగ్గుతుంది. పంట అంతా ఒకేసారి కాపునకు రావటం వల్ల యంత్రాలతో కోయవచ్చు. కూలీల కొరతను అధిగమించవచ్చు ఈ పద్ధతిలో ఎకరాకు సుమారు 20-30 శాతం అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది.

**ఏమిటీ విధానం**

సాధారణ పత్తికి భిన్నంగా మొక్కల మధ్య, వరుసల మధ్య దూరం తగ్గించి ఎకరాకు ఎక్కువ మొక్కలు వచ్చేలా నాటుతారు. సాధారణ పద్ధతిలో ఎకరాకు 7,407 మొక్కల సంఖ్య ఉంటుంది. అధిక సాంద్రత పద్ధతిలో వరుసల మధ్య 90 సెం.మీ, మొక్కల మధ్య 15 సెం.మీ,(9015) దూరంలో విత్తుకుంటే ఎకరాకు 29,629 వస్తాయి. దగ్గర సాళ్ల పద్ధతిలో వరుసల మధ్య 90 సెం.మీ., మొక్కల మధ్య 30 సెం.మీ,(9030) దూరంలో విత్తుకుంటే ఎకరాకు 14,814 మొక్కలు వస్తాయి. అధిక పద్ధతిలో విత్తన మోతాదు ఎకరానికి 5 ప్యాకెట్లు, దగ్గర సాళ్ల పద్ధతిలో 4 ప్యాకెట్లు అవసరమవుతాయి. మొక్కకు 10-15 కాయలు వచ్చి, బరువు 4-5 గ్రాములు, ఎకరానికి 10-12 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది.

# ధరల సెగ

హైదరాబాద్ : వేసవిలో ఎండలకు తోడు నగరవాసులకు ధరల సెగ తగులుతోంది. నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు పెరుగుతుండగా..తాజాగా పెరిగిన గ్యాస్ ధర, విద్యుత్ వినియోగం, నీటికి అదనపు వ్యయాలతోపాటు వేసవి ప్రత్యేక ఆహారపదార్థాల నేపథ్యంలో కుటుంబాల బడ్జెట్ 25శాతానికి పైగా పెరగడం గమనార్హం. నెలకు సామాన్యులు, మధ్యతరగతి వారు కనీసం నాలుగు వేల నుంచి ఐదువేల రూపాయలు అదనంగా ఖర్చు చేస్తున్నారని నిపుణులు పేర్కొన్నారు.

**నిత్యావసరాలు, కూరగాయల ధరలు**

నిత్యావసర సరకుల ధరలు 10శాతం నుంచి 20వరకు పెరిగాయి. పప్పులు హోల్‌సేల్ మార్కెట్‌లోనే రూ.110 నుంచి రూ.140 వరకు ఉండగా.. రిటైల్ మార్కెట్‌లో ఇంతకంటే ఎక్కువగా ఉన్నాయి. రిటైల్ మార్కెట్‌లో ఏ రకం కూరగాయలైనా సగటున రూ.40 ఉండగా.. పచ్చిమిర్చి, చిక్కుడు వంటివి రూ.60 నుంచి రూ.80 వరకు ఉన్నాయి.



**విద్యుత్ బిల్లుల మోత**


మార్చి మొదటివారం నుంచే ఎండలు మండుతున్నాయి. ఫ్యాన్‌లు, ఏసీల వినియోగం భారీగా పెరిగింది. ఏప్రిల్ మొదటివారంలో ఫ్యాన్లు వాడే వారి ఇళ్లల్లో 30శాతం నుంచి 40శాతం బిల్లులు పెరగ్గా ఏసీలున్న నివాసాల్లో దాదాపు రెట్టింపు కావడం గమనార్హం.

నీటిపై భారీగా వ్యయం అపార్ట్‌మెంట్‌లలో నెలకు నీటి కోసమే ఒక్కో కుటుంబం రూ.1000 నుంచి రూ.1500 వరకు వ్యయం చేయాల్సి వస్తోంది. సగటున 15 ఫ్లాట్‌లు ఉంటే రోజుకు రెండు ట్యాంకర్లు తెప్పించుకుంటున్నారు. ఇందుకు సగటున నెలకు రూ.45వేల అదనంగా వ్యయం చేయాల్సి వస్తోంది.

**ఖర్చులు పెరిగాయి..**జనవరి, ఫిబ్రవరితో పోలిస్తే మార్చిలో ఖర్చులు బాగా పెరిగాయి. అపార్ట్‌మెంట్లో మెయింటెనెన్స్ కాకుండా నీటికి రూ.1000 అదనంగా ఇవ్వాల్సి వస్తోంది. మా ఇంట్లో ఫ్యాన్‌లే ఉన్నాయి. కరెంట్ బిల్లు ఫిబ్రవరి కంటే రూ.375 ఎక్కువగా వచ్చింది. సరకులు, కూరగాయలపై కూడా రూ.1500 వరకు ఎక్కువైంది. గ్యాస్‌కూడా రూ.50 పెరిగింది. జూన్, జులై వరకు ఇవి తప్పేలాలేవు.
లక్ష్మి, గృహిణి, కూకట్‌పల్లి

# జలం.. పాతాళం

హైదరాబాద్ : నగరంలో భూగర్భజలాలు వేగంగా తగ్గుతున్నాయి. గ్రేటర్ పరిధిలో సగటు భూగర్భనీటిమట్టం 11.94 మీటర్లు. గతేడాది మార్చి చివరి నాటి 10.89 మీటర్ల లోతున ఉండగా.. ఈసారి మరింత తగ్గాయి. ఓఆర్‌ఆర్ వరకు ఉన్న 57 ఫీజోమీటర్ల ద్వారా మార్చి నెలాఖరు నాటికి గ్రేటర్ పరిధిలో పరిస్థితిని రాష్ట్ర భూగర్భజల శాఖ విశ్లేషించింది. ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డ, చాంద్రాయణగుట్ట, కూకట్‌పల్లి, మారేడుపల్లి, మల్కాజిగిరి, డబీల్‌పురా, కీసర, గండిపేట, మేడిపల్లి, చంగిచెర్ల, హస్మత్‌పేట, గాజులరామారం, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్, ఉప్పల్, రాజేంద్రనగర్,పటాన్‌చెరు, దూలపల్లి ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు బాగా తగ్గాయి. సగంపైగా ప్రాంతాల్లో



గతేడాది కంటే బాగా తగ్గాయి. పలు ప్రాంతాల్లో 20 మీటర్లు అంతకంటే ఎక్కువ లోతున భూగర్భజలాలు ఉన్నాయి.

**ఒక నెలలోనే బాగా తగ్గాయి..**

నగరంలో పలు ప్రాంతాల్లో ఒక నెలలోనే రెండు మీటర్లు అంతకంటే ఎక్కువగానే జలమట్టాలు తగ్గడం గమనార్హం. చింతల్‌బస్తీ, మారేడుపల్లి, బాలాజీనగర్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి, మేడిపల్లి, గాజులరామారం ఉప్పల్, హస్మత్‌పేట, దూలపల్లి సహా పలు ప్రాంతాల్లో నెలలోనే రెండు మీటర్లు అంతకంటే ఎక్కువ నీటి మట్టాలు తగ్గాయి.

**కైతలాపూర్‌లో దారుణంగా పరిస్థితి..**

కూకట్‌పల్లి జోన్ కైతలాపూర్‌లో భూగర్భజలాల పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. గతేడాది 11.34 మీటర్లకు ఉండగా ఈసారి ఏకంగా 16.55 మీటర్లు పడిపోవడం గమనార్హం. ఈ ప్రాంతంలో అనేక భారీ నిర్మాణాలకు తోడు ప్రైవేటు నీటి దందా కోసం అత్యంత లోతుకు బోర్లు వేసి నీటి తోడుతున్నట్లు విశ్లేషిస్తున్నారు. మే వరకు పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది.

# పూడికతీత.. గుత్తేదారులకు మేత

హైదరాబాద్: పూడిక మట్టిని మింగేస్తున్న దొంగలు దొరికారు.. నిర్మాణ వ్యర్థాలను పూడికగా చూపుతూ మసిపూసి మారేడుకాయ చేస్తున్న నలుగురిపై బల్దియా తాజాగా చర్యలు తీసుకుంది. కార్వాన్ సర్కిల్‌కు చెందిన రయ్యన కన్‌స్ట్రక్షన్స్, సరూర్‌నగర్-5 సర్కిల్ చెందిన జి.నాగరాజు, ఉప్పల్-2 సర్కిల్‌కు చెందిన విజయమండ్ల సురేష్, ఆర్సీపురం, పటాన్‌చెరు-22 సర్కిళ్లలో కె.వెంకటేష్‌కు చెందిన ఐదు వాహనాలను అధికారులు పట్టుకున్నారు. గుత్తేదారులను నిషేధిత జాబితాలో చేర్చారు. బాధ్యులైన ఇంజినీర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.ఏటా 5లక్షల మెట్రిక్ టన్నులకు బిల్లులు..: నగరంలో 5 లక్షలు మెట్రిక్ టన్నుల పూడిక నాలాల్లో ఉన్నట్టు బల్దియా అంచనా వేస్తోంది. దీన్ని తొలగించేందుకు 50 నుంచి 55 కోట్ల నిధులతో టెండర్లు పిలుస్తోంది. సర్కిళు, జోన్ల స్థాయిలో ఇంజినీర్లు, గుత్తేదారులు కొన్నిచోట్ల సిండికేట్ అవతారం ఎత్తి టెండర్లను దక్కించుకుంటారు. **ప్రజాధనం లూటీ..**నిర్మాణ వ్యర్థాలను తీసుకెళ్లే ప్రయివేటు కాంట్రాక్టర్ల రశీదులను పూడిక మట్టిగా మాయ చేస్తూ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారు. ఇంజినీర్లకు ఇందులో వాటాలు ఉండటంతో గుడ్డిగా ఆమోదిస్తున్నారు. మాణికేశ్వర్‌నగర్, పాతనగరం తదితర ప్రాంతాల్లో ఈ నకిలీ రశీదులను ప్రయివేటు కాంట్రాక్టర్ల నుంచి టన్నుకు రూ.200 చొప్పున తీసుకొని పని చేయకుండానే బిల్లులు తీసుకుంటున్నారు.

# నిరీక్షణ లేదిక.. దస్తావేజు ఆగదిక



హైదరాబాద్ : దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు స్లాట్ విధానం సిటీలోని 8 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గురువారం ప్రారంభమైంది. ఆజంపుర, చిక్కడపల్లి, చంపాపేట, సరూర్‌నగర్, శంషాబాద్, మేడ్చల్, కుత్బుల్లాపూర్, వల్లభ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. సులువుగా, వేగంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఈ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 11 గంటలకు తొలి స్లాట్‌ను కేటాయించారు. తొలిరోజు పెద్దగా సమస్యల్లేకుండా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తైనట్లు అధికారులు తెలిపారు. మూడు జిల్లాల్లో మొత్తం 272 దస్తావేజుల రిజిస్ట్రేషన్ జరిగింది. అక్కడక్కడ కొన్ని అవాంతరాలు ఎదురైనా వెంటనే సరిచేయడంతో ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్‌తో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సులభతరంగా జరిగిందని తెలిపారు.

**మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా..**

ఒక్కో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు 48 స్లాట్లను అందుబాటులో ఉంచారు. పూర్తి స్థాయిలో ఎక్కడ స్లాట్ బుకింగ్ కాలేదు. కొందరు వేర్వేరు కారణాలతో రిజిస్ట్రేషన్‌కు రాలేదు. వచ్చిన వారు నిరీక్షించకుండా అరగంటలోనే ప్రక్రియ పూర్తి చేశారు.
కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎక్కువ దస్తావేజులు వస్తుండటంతో 144 స్లాట్లు అందుబాటులో ఉంచారు. తొలిరోజు 108 స్లాట్లు బుక్కయ్యాయి.మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ ఇక్కడి స్లాట్ బుకింగ్ విధానాన్ని పరిశీలించారు.
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని మూడు కార్యాలయాల్లో కలిపి తొలిరోజు స్లాట్ విధానంలో 163 దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరిగాయని.. సాయంత్రం 6 గంటలకల్లా రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ తెలిపారు.
చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నూతన విధానాన్ని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అదనపు ఐజీ వెంకట్‌రాజేశ్, హైదరాబాద్ డిప్యూటీ ఐజీ సైదిరెడ్డి పరిశీలించారు.

**తొలిరోజు పొరపాట్లతో..**

చాలామంది ఆన్‌లైన్‌లో అసంపూర్తిగా వివరాలు నమోదు చేయడాన్ని అధికారులు గమనించారు. పూర్తి పేరు రాయకపోవడం, మూడు సర్వే నెంబర్లు ఉంటే రెండింటినే పేర్కొనడం, సర్వే బై నంబర్లు వేయకపోవడం వంటి పొరపాట్లు చేశారు. వీటిని సరిచేసిన తర్వాతనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకుసాగింది.

**రానివారు మరో స్లాట్‌లో..**

తొలిరోజు స్లాట్ బుక్ చేసుకున్న అందరూ రిజిస్ట్రేషన్‌కు రాలేదు. చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 19 స్లాట్లు బుక్ కాగా.. 16 పార్టీలే వచ్చాయి. వీరికి మరోరోజు స్లాట్ బుకింగ్‌కు అవకాశం ఉంటుందని హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ జిల్లా రిజిస్ట్రార్ వి.రవీందర్ తెలిపారు. చెల్లించిన చలానా గడువు 120 రోజులు ఉంటుందని తెలిపారు.

**దస్తావేజు లేఖరుల ఆందోళన**

కర్మన్‌ఘాట్: రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ చేసే అవకాశం కల్పించాలని దస్తావేజు లేఖరులు గురువారం చంపాపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సామాన్యులకు ఇబ్బందులతో పాటు తమకు ఉపాధి పోతుందన్నారు. స్లాట్ బుకింగ్‌తో పాటు పాత పద్ధతి కొనసాగించాలని డిమాండ్ చేశారు.

స్లాట్ విధానంలో రిజిస్ట్రేషన్లు
హైదరాబాద్ 46
రంగారెడ్డి 63
మేడ్చల్ 163

# ఔషధ పంపిణీ.. ఇక వేగవంతం



తాండూరు : జిల్లా కేంద్రానికి సమీపంలోని అనంతగిరి గుట్టపై నిర్మిస్తున్న ఔషధ నిల్వ కేంద్రం (సెంట్రల్ మెడిసిన్ స్టోర్-సీఎంఎస్) త్వరలోనే పూర్తి కాబోతోంది. గుత్తేదారు భవనాన్ని అధికారులకు అప్పగించగానే ఆసుపత్రులకు అవసరమైన అన్ని రకాల మందుల పంపిణీ సేవలు ఇక్కడి నుంచే మొదలవుతాయి. దీంతో ఆసుపత్రులకు మందుల కొరత ఉండదు.

**ప్రస్తుతం రాజీవ్ కాలనీ ఆసుపత్రి నుంచి..**

కొత్తగా ఏర్పడిన అన్ని జిల్లా కేంద్రాల్లో గత ప్రభుత్వం సీఎంఎస్‌లు ఉండాలనే ఉద్దేశంలో భాగంగా వికారాబాద్ జిల్లా కేంద్రానికి సమీపం లోని అనంతగిరి గుట్టపై అవసరమైన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. జిల్లాలోని ఆసుపత్రులకు మందులను సరఫరా చేసేందుకు రాజీవ్ కాలనీ సమీపంలో కొత్తగా నిర్మించిన ఆసుపత్రి భవనంలో అధికారులు రెండు విశాలమైన గదులను కేటాయించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్ నుంచి వచ్చే మందులను ఇక్కడ నిల్వ చేస్తున్నారు. ఇండెంట్‌ను బట్టి సిబ్బంది అవసరమైన మాత్రలు, ఇంజెక్షన్లు, ఇతర అన్ని రకాల మందులను సరఫరా చేస్తున్నారు. ఆసుపత్రికి వచ్చి పోయే మందుల సరఫరా వాహనాల వల్ల చికిత్సకు వచ్చే రోగులకు ఇబ్బందులు తలెత్తక మానవు. ఈ నేపథ్యంలో అధికారులు అనంతగిరి గుట్టపై ఆయుష్ ఆసుపత్రి పక్కన నిర్మిస్తున్న భవనాన్ని వేగంగా పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నారు.

విలువైన మందులు, ఇంజక్షన్ల నిల్వకు శీతల గదులు: పాము, కుక్క కాటు వంటి వైద్య పరమైన విలువైన ఇంజక్షన్లు, హైపటైటిస్ బి, ఇతర టీకాలను నిల్వ చేయడానికి శీతల గదులు ఉంటాయి. ఉష్ణోగ్రత తగిన మోతాదులో ఉందా లేదా అనేవిషయాన్ని ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తారు.

**చాలా సౌకర్యంగా ఉంటుంది**

సీఎంఎస్ భవనం అందుబాటులోకి వస్తే ఔషధాల పంపిణీకి చాలా సౌకర్యంగా ఉంటుంది. అవసరమైన సిబ్బంది అందరూ విధులు నిర్వహిస్తారు. డాక్టర్ జీవరాజు, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ, వికారాబాద్

**మూడు నెలల్లో అప్పగిస్తాం**మూడు నెలల్లో భవనాన్ని పూర్తి చేసి అధికారులకు అప్పగిస్తాం. ఆ తర్వాత సేవలు అందుబాటులోకి వస్తాయి.
లక్ష్మీనారాయణ, డీఈ, మెడికల్ అండ్ హెల్త్ ఇంజినీరింగ్ శాఖ.

ఇదీ సమాచారం
సీఎంఎస్ భవన నిర్మాణానికి చేస్తున్న వ్యయం: రూ.3కోట్లు
భవనం నమూనా: జి1
నిల్వ ఉంచే మందుల విలువ: రూ.6 కోట్లు
ఔషధాల సరఫరా జరిగే ఆసుపత్రులు: 29
వినియోగించే వాహనాలు: ఆర్టీసీ కార్గో బస్సులు.

# వయోవృద్ధులకు ఆత్మీయ సంరక్షణ

హైదరాబాద్: వివిధ రకాల క్యాన్సర్ చికిత్సలకు వచ్చే వయోవృద్ధులకు ఆత్మీయ సంరక్షణ అందించేందుకు ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రి ఎంఎన్‌జేలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిరియాట్రిక్ అంకాలజీ విభాగాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. మెడికల్, సర్జికల్ అంకాలజీ విభాగాల్లో జిరియాట్రిక్ సేవలను ప్రవేశపెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తొలిసారి ఈ తరహా సేవలు అందుబాటులోకి రానున్నాయి. వృద్ధులకు వచ్చే వ్యాధులు, చికిత్స, సంరక్షణ తదితర సేవలతో కూడుకున్న సేవలే జిరియాట్రిక్ విభాగం కిందకు వస్తాయి. ఇప్పటికే నిమ్స్‌లో ఈ విభాగాన్ని అందుబాటులోకి తెచ్చారు. గతంలో పోల్చితే జీవిత కాలం పెరుగుతోంది. చాలామంది 70-80 ఏళ్లకు పైబడి జీవిస్తున్నారు. జీవిత కాలానికితోడు కొన్ని అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ఎంఎన్‌జేకు ఎంతోమంది వృద్ధులు క్యాన్సర్ చికిత్సల కోసం విచ్చేస్తుంటారు. క్యాన్సర్‌తోపాటు మధుమేహం, అధిక రక్తపోటు, కీళ్ల వ్యాధులు ఇతర సమస్యలు ఎదుర్కొంటున్నారు. కిమో, రేడియోథెరఫీ మాత్రమే కాకుండా జిరియాట్రిక్ సేవలు సైతం ఇక్కడే అందించాలనేది యోచన. తొలుత మెడికల్ అంకాలజీలో 10, సర్జకల్ అంకాలజీలో 10 పడకలను సిద్ధం చేయనున్నట్లు ఎంఎన్‌జే డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు.

**జిల్లా ఆసుపత్రులకు అనుబంధంగా..**కేవలం ఎంఎన్‌జే ఆసుపత్రిలో మాత్రమే కాకుండా జిల్లా మెడికల్ కళాశాలలకు అనుసంధానంగా 20 పడకలతో జిరియాట్రిక్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు వైద్య ఆరోగ్యశాఖ సన్నాహాలు చేస్తుంది. దవాఖానాల ఓపీల వద్ద గంటల తరబడి నిరీక్షించే అవసరం లేకుండా...నేరుగా జిరియాట్రిక్ విభాగాల్లో వీరు సంప్రదించొచ్చు. అన్ని అనారోగ్య సమస్యలకు సంబంధించి వైద్యులు ఒకేచోట అందుబాటులో ఉంటారు. దీంతో అన్ని చోట్లకు తిరిగే అవసరం ఉండదు. అంతేకాక జిరియాట్రిక్ విభాగాల కోసం వార్డులను బొమ్మలు, చిత్రాలతో...చుట్టూ వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దనున్నారు.

# క్షణాల్లో వస్తారు.. సరిచేస్తారు

కంచన్‌బాగ్ : వేసవిలో విద్యుత్తు వినియోగం అమాంతం పెరిగిపోతోంది. నాణ్యమైన కరెంటు, నిరంతరాయంగా సరఫరా అందించేందుకు విద్యుత్తు శాఖ కృషి చేస్తోంది. సంతోష్‌నగర్ విద్యుత్తు సబ్ డివిజన్ పరిధిలో వేసవి ప్రణాళికను అధికారులు అమలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి డిమాండ్, సమస్యలు ఉన్న ప్రాంతాలను ఎంపిక చేశారు. వివిధ రకాలైన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను, విద్యుత్తు నియంత్రికలను ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో వినియోగం మరింత పెరిగే అవకాశం ఉండటంతో వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన మెరుగైన సేవలు అందించేందుకు గతేడాది అక్టోబరులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్తు అంబులెన్సును మంజూరు చేశారు. జనవరి నుంచి అందుబాటులోకి వచ్చింది.




**నాలుగు ఉప కేంద్రాల్లో..**

సంతోష్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలో మిధాని, సంతోష్‌నగర్, మాదన్నపేట, యాకుత్‌పుర 33/11 కేవీ ఉప కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో 32 ఫీడర్లు, 67,167 గృహ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వాటి పరిధిలో ఎక్కడ సమస్య వచ్చినా వెంటనే చేరుకునేందుకు సబ్ డివిజన్‌కు ఒకటి చొప్పున ప్రత్యేక వాహనాన్ని రాష్ట్ర సర్కారు కేటాయించింది. 108 వాహనం తరహాలోనే టోల్‌ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేస్తే సమస్య తక్షణమే పరిష్కారమవుతుందని సంబంధిత అధికారులు తెలిపారు.

**'1912'తో సత్వర సేవలు**

1912 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే నలుగురు సిబ్బంది సమస్యాత్మక ప్రాంతానికి చేరుకుంటారు. విద్యుత్తు తీగలు, ఫ్యూజులు, తాళ్లు, కండక్టర్లు, పవర్ రంపం, ల్యాడర్ తదితర సామగ్రి ఉంటుంది. గతంలో వీటిని ఆటోలు, వ్యాన్లలో తరలించాల్సి వచ్చేది. నియంత్రిక మరమ్మతుకు గురైతే మార్చేందుకు వాహనంలో మరో నియంత్రిక అందుబాటులో ఉంటుంది. సిబ్బంది శిరస్త్రాణం, గ్లవ్స్, సేఫ్టీబెల్ట్, మాస్క్ ఇతర భద్రత పరికరాలను ధరించి ఉంటారు.

# ఎంత సొమ్మయినా..ఎక్కడికైనా!

హైదరాబాద్ : 2023లో బంజారాహిల్స్‌లో ఖరీదైన కారులో తరలిస్తున్న రూ.3.35కోట్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులు జూబ్లీహిల్స్‌లో అందజేసేందుకు బయల్దేరి పట్టుబడ్డారు. 2024లో సుల్తాన్‌బజార్ పోలీసుల తనిఖీల్లో రూ.1.21కోట్లు దొరికింది. ముంబయిలోని బబ్లూ అనే వ్యక్తి ఆదేశాలతో రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు డబ్బుతో వెళ్తూ చిక్కారు.
నైజీరియా డ్రగ్ డాన్ ఎబుకా సూజీ ఫారెక్స్ ఏజెంట్ల ద్వారా రూ.120 కోట్లను వివిధ దేశాలకు చేరవేశాడు. ఆధారాలు లభించటంతో టీజీన్యాబ్ పోలీసులు అరెస్టు చేశారు.
నగరంలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన హవాలా నిర్వాహకులు దేశ, విదేశాల్లో ఎక్కడికైనా ఎంతనగదైనా క్షణాల్లో చేరవేస్తారు. ప్రభుత్వానికి పైసా పన్ను చెల్లించే అవకాశం లేకుండా రూ.వందలకోట్లు దేశ సరిహద్దు దాటించగలరు. సైబర్‌క్రైమ్, డ్రగ్స్ వంటి చీకటి కార్యకలాపాల ద్వారా కాజేసిన ప్రజాధనం.. బడాబాబుల నల్లధనం.. వేర్వేరు బ్యాంకు ఖాతాలు, వ్యక్తుల చేతులు మారి గమ్యానికి చేర్చటమే హవాలా ఏజెంట్ల చాకచక్యం. ఇటీవల టీజీన్యాబ్ పోలీసులు ఛేదించిన అంతర్జాతీయ హవాలా రాకెట్‌లో ఫారెక్స్ ఏజెంట్లు నగదు తరలింపులో 40శాతం కమీషన్ తీసుకునారు. రూ.కోటి నగదు మారితేకి రూ.40లకలు



వీరి చేతికి చేరింది. దీనిలో దళారులు, సహాయకులకు పంచగా 30శాతం వీరి జేబుల్లోకి చేరినట్టు తేలింది.

**ఇప్పుడేం జరుగుతుందంటే..**నగరంలోని అంబర్‌పేట్, బేగంబజార్, సుల్తాన్‌బజార్, సికింద్రాబాద్, అబిడ్స్, ఛత్రినాక, కాటేదాన్, బంజారాహిల్స్ కేంద్రంగా అధికశాతం హవాలా నిర్వాహకులు చక్రం తిప్పుతున్నారు. హవాలా ద్వారా రూ.లక్షకు రూ.1000 కమీషన్ తీసుకొని దళారులతో చేరవేస్తారు. ఆనవాళ్లు బయటపడకుండా కోడ్ భాష ఉపయోగిస్తారు. ఎన్నికలు, అత్యవసర సమయాల్లో చేసే తనిఖీల్లోనే ఏటా రూ.100-200 కోట్లు నగదు దొరుకుతుంది. రోజూ సోదాలు జరిపితే ఏటా రూ.2-3వేల కోట్ల హవాలా సొమ్ము పట్టుబడుతుందని పోలీసు ఉన్నతాధికారి పేర్కొన్నారు.

# ఆదాయం బాగు.. హోదా పెంపు

కరీంనగర్ : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆధ్యాత్మిక క్షేత్రాలను దర్శించుకొనేందుకు.. వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తుల సంఖ్య పెరుగుతుంది. ఆయా ఆలయాల వార్షికోత్సవాలు, బ్రహ్మోత్సవాల వేళలో జనం పోటెత్తుతున్నారు. వేములవాడ, కొండగట్టు అంజన్న, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి, చారిత్రక కోటిలింగాల శివాలయంతోపాటు గోదావరి పరీవాహక ప్రాంతంలో వెలిసినవాటి ఉత్సవాలకు వేల సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో ఆదాయం ఏటేటా పెరుగుతోంది. వీటి ఆధారంగానే ప్రతి మూడేళ్లకు ఆలయాల హోదాను పెంచుతూ రాష్ట్ర దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేస్తుంది. ఈ క్రమంలో కొన్నింటి హోదా పెరిగాయి.

**గోదావరిఖని రామాలయానికి 6ఏ**

గోదావరిఖనికి చెందిన కోదండ రామాలయం గత మూడేళ్లుగా చూసుకుంటే ఆదాయం రూ.30 లక్షల వరకు పెరిగింది. దీంతో 6బీ నుంచి 6ఏ హోదా జాబితాలోకి చేరింది. గతంలో ఏటా రూ.20 లక్షల నుంచి రూ.23 లక్షల వరకు ఆదాయం ఉండేదని ఈవో శంకర్ తెలిపారు. రూ.25 లక్షల నుంచి రూ.కోటి వరకు వచ్చే ఆలయాలను 6-ఏ, రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షల లోపు వచ్చేవాటికి 6బీ జాబితాలో.. రూ.2 లక్షల లోపు వచ్చేవాటిని 6సీలో చేరుస్తారు. ఈసారి ఉమ్మడి జిల్లాలో 6-ఏ హోదా ఒక్క గోదావరిఖని రామాలయానికే దక్కింది. **ఒకటి తగ్గి.. మరొకటి పెరిగి**ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 12 ఆలయాలు 6ఏ పరిధిలో ఉండగా.. ఆ జాబితాలోకి మరొకటి చేరింది. అయితే కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్రీ విజయగణపతి సాయిబాబా దేవాలయం తాజాగా 6ఏ నుంచి 6బీ హోదాకు పడిపోయింది. ఇప్పటివరకు 6బీ జాబితాలో 39 దేవాలయాలు ఉండగా.. తాజాగా అందులోకి పెద్దపల్లి జిల్లా మంథనిలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి, కమాన్‌పూర్‌లో శ్రీ ఆదివరాహస్వామి, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శ్రీ విశ్వనాథస్వామి దేవాలయం 6బీ జాబితాలో చేరాయి.

## తోడేస్తున్నారు.. తవ్వేస్తున్నారు

హైదరాబాద్: నగరంలో భూగర్భజలాలు అడుగంటుతుండటంతో వందల సంఖ్యలో బోర్లు ఎండిపోతుండగా మరోవైపు భారీ సంఖ్యలో కొత్తవి తవ్వుతున్నారు. పాత వాటిలో నీరు రాకపోవడంతో భారీ లోతుతో కొత్తవి వేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పుడే భూగర్భజలాల పరిస్థితి ఇలా ఉంటే ముమ్ముందు ఎలాంటి ఇబ్బందులు వస్తాయో అనే ఆందోళనతో 1500 అడుగులు దాటి బోర్లు వేస్తుండటం గమనార్హం. సాధారణంగా నగరంలో కొత్తగా వేస్తున్న బోర్లు వెయ్యి అడుగుల నుంచి 1200 అడుగులు ఉంటుండగా ఇప్పుడు నిర్మాణాల సంఖ్య, డిమాండ్ ఆధారంగా లోతును పెంచేస్తున్నారు. బోర్‌వెల్స్‌కు డిమాండ్ పెరిగి.. మూడు నాలుగు రోజులపాటు వేచి ఉండాల్సి వస్తోంది.



**1200 అడుగులు వేస్తేనే..**

ప్రధానంగా కూకట్‌పల్లి, మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, పుప్పాలగూడ, మణికొండ, జూబ్లీహిల్స్, ఎస్సార్‌నగర్, అమీర్‌పేట, కుత్బుల్లాపూర్, నిజాంపేట, ప్రగతినగర్ తదితర ప్రాంతాల్లో భూగర్భజలాలు తగ్గడంతో కొత్త బోర్లతో సమస్య నుంచి గట్టెక్కేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. లేదంటే రోజుకు రెండు మూడు ట్యాంకర్లను కొనాల్సిన పరిస్థితి. నగరంలో అత్యధిక ప్రాంతాల్లో 600 అడుగుల నుంచి 800 అడుగుల మేర బోరు వేస్తే సరిపోయేది. కానీ ఇప్పుడు కనీసం 1200 అడుగులు వేస్తే తప్ప నీటికి భరోసా ఉండటం లేదని ఆందోళన చెందుతున్నారు. అపార్ట్‌మెంట్లలో అయితే 1200- 1500 అడుగులు సాధారణంగా మారిందని చెబుతున్నారు.

**రూ.6 లక్షలు ఖర్చు చేస్తే.. 10 రోజులే నీళ్లు**

నగరంలోని ఓ ప్రధాన ప్రాంతంలో ఉన్న హాస్టల్లో ఇటీవల బోరు ఎండిపోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో 1500 అడుగుల మేర కొత్త బోరు వేస్తే పదిరోజులు నీళ్లు వచ్చాయి. తర్వాత చుక్కనీరు రాకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. సుమారు రూ. 6లక్షలు వ్యయం చేసినా ఫలితం లేకపోగా ట్యాంకర్ల కోసం తిప్పలు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

## చెరువులు నిండక.. పొలాలు ఎండి

చేగుంట: కాలువల నిర్మాణంలో ఏళ్లుగా తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇవి పూర్తికాకపోవటంతో కాళేశ్వరం నుంచి వచ్చే గోదావరి జలాలు చెరువుల్లోకి వెళ్లటంలేదు. దీంతో పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. కొండపొచమ్మసాగర్ నుంచి చేగుంట, నార్సింగి, చిన్నశంకరంపేట, రామాయంపేట మండలాలకు నీళ్లు వస్తే చెరువులు, కుంటలు నిండి రైతులకు ఎంతో మేలు చేకూరే అవకాశం ఉంది. కానీ కాలువల నిర్మాణం పూర్తిచేస్తేనే ఇది సాధ్యపడుతుంది.

**అసంపూర్తిగా పనులు**

మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నుంచి రామాయంపేట, చిన్నశంకరంపేట వరకు కెనాల్‌లు ఉన్నాయి. దౌల్తాబాద్ మండలం మీదుగా చేగుంట, నిజాంపేట, రామాయంపేట, చిన్నశంకరంపేట మండలాల్లోని గ్రామాల మీదుగా కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుమారు నాలుగేళ్ల క్రితం పనులు ప్రారంభించినా ఇంత వరకు పూర్తికాలేదు. కొన్నిచోట్ల పూర్తిచేసినా.. మరికొన్ని చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. కాలువల నిర్మాణం కోసం రహదారులపై వంతెనలు నిర్మాణం కూడా పూర్తి చేశారు. కొన్నిచోట్ల కాలువలు



తవ్వినా.. సిమెంట్ లైనింగ్ వేయకుండా వదిలేశారు. దీనివల్ల నీరు ప్రవహించని పరిస్థితి నెలకొంది.

**50 వేల ఎకరాలకు మేలు**

గొల్లపల్లి, కరీంనగర్, రుక్మాపూర్, చిట్టోజీపల్లి, భీంరావుపల్లి, రెడ్డిపల్లి, వల్లూరు మీదుగా చిన్నశంకరంపేట కెనాల్ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రస్తుతం రామాయంపేట కెనాల్ నుంచి మాత్రమే కొండపోచమ్మసాగర్ నీళ్లు వస్తున్నాయి. బోనాల, బి.కొండాపూర్, ఇబ్రహీంపూర్ కిష్టాపూర్, పులిమామిడి, నిజాంపేట మండలం నార్లాపూర్, రాయలాపూర్ తదితర గ్రామాలకు నీళ్లు వెళ్తున్నాయి. చిన్నశంకరంపేట కెనాల్ పనులు త్వరగా పూర్తిచేస్తే పలు మండలాల రైతులకు యాసంగిలో మేలు జరగనుంది. నాలుగు మండలాల్లో కెనాల్ నిర్మాణాలు పూర్తిచేస్తే సుమారు 50 వేల ఎకరాలకు మేలు చేకూరుతుంది. దుబ్బాక, మెదక్ ఎమ్మెల్యేలు శ్రద్ధ చూపిస్తే ఇవి పూర్తికావటానికి అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

**కుంటల్లోకి నీళ్లు రాక..**

నాలుగు మండలాల్లో కాలువల నిర్మాణం పూర్తిచేస్తే 50 వరకు చెరువులు నిండి వేల ఎకరాలకు ప్రయోజనం ఉంటుంది. చిన్నశంకరంపేట కెనాల్ చాలా చోట్ల అసంపూర్తిగానే ఉంది. రాంపూర్ చెరువులో నుంచి భూగర్భ కాలువ నిర్మాణం చేపట్టి పూర్తిచేశారు. కానీ ఆ కాలువ నీళ్లు రాంపూర్ చెరువులోకి రాని పరిస్థితి నెలకొంది. తమ చెరువు నింపకుండా కాలువ నిర్మాణం ఎలా చేపడతారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ సమస్య పరిష్కరిస్తే చాలా గ్రామాలకు నీళ్లు చేరనున్నాయి.

# ఒక్క బిడ్డా పుట్టలేదు..




హైదరాబాద్ ప్రైవేటుకు దీటుగా రూ.లక్షలు పెట్టి అందుబాటులోకి తెచ్చిన కృత్రిమ గర్భధారణ సేవలు (ఐవీఎఫ్) పడకేశాయి. నిధుల కొరత కారణంగా ఇప్పటివరకు ఒక్క జంటకు కూడా ఈ సేవలను అందించలేకపోయారు. ఐవీఎఫ్ సేవలకు కార్పొరేట్, ప్రైవేటు సెంటర్లు రూ.లక్షలు వసూలు చేస్తున్నాయి. పేదలకు ఇది ఆర్థిక భారమే. ఇలాంటి వారి కోసం పైసా ఖర్చు లేకుండా సంతాన సాఫల్యాన్ని కల్పించేందుకు ప్రభుత్వం గతంలో రూ.కోట్లతో గాంధీ ఆస్పత్రితోపాటు పేట్లబుర్జు, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రుల్లో ఇన్ విట్రో ఫెర్టిలిటీ(ఐవీఎఫ్) సెంటర్లను ఏర్పాటు చేసింది. ఇటీవల వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గాంధీ ఆసుపత్రిని సందర్శించి తక్షణమే ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. నిధుల కొరతతో ఐవీఎఫ్ సేవలు సాగడం లేదు. ఇలా 100 జంటల వరకు ఎదురు చూస్తున్నట్లు తెలుస్తోంది.

**ఆధునిక ల్యాబ్ వసతి...**

గాంధీ ఎంసీహెచ్ భవనం ఐదో అంతస్తులో ఐవీఎఫ్ సెంటర్‌ను అధునాతన పరికరాలు, అత్యంత సౌకర్యవంతమైన వసతులతో కార్పొరేట్‌కు దీటుగా రూపొందించారు. కోజికోడ్, తిరువనంతపురంతోపాటు దేశంలోని పలు ఫెర్టిలిటీ సెంటర్లను పరిశీలించి దీన్ని తీర్చిదిద్దారు. ఎంబ్రియాలజీ ల్యాబ్, ఐవీఎఫ్ ఆపరేషన్ థియేటర్, ఆండ్రాలజీ ల్యాబ్‌లతోపాటు ఫలదీకరణ చేసేందుకు అవసరమైన ఆధునిక ఎక్విప్‌మెంట్, సెమన్ ఎనాలసిస్ యంత్రాలు, రీఏజెంట్స్ (ద్రావకాలు) డయాగ్నోస్టిక్ హిస్టరీ లాప్రోస్కోపీ, అల్ట్రాసౌండ్, కంట్రోల్ వేరియంట్, హైపర్ స్టిమిలేషన్ (సీఓఏ)లను సమకూర్చారు. గాంధీలో కేవలం ఇంట్రా యుటెరిన్ ఇన్‌సెమినేషన్ (ఐయూఐ) మాత్రమే చేస్తున్నారు. వీర్యాన్ని ల్యాబ్‌లో శుద్ధి చేసి భార్య గర్భాశయం వద్ద నేరుగా ప్రవేశపెడతారు. ఐవీఎఫ్‌తో పోల్చితే ఇది తేలికైన విధానం.

**ముందుకు సాగని ప్రక్రియ..**

ఐవీఎఫ్ ప్రక్రియ చాలా క్లిష్టంగా ఉంటుంది. మహిళ నుంచి అండాలను సేకరించి వాటిని ల్యాబ్‌లో ఫలదీకరణ చేయాలి. ఇందుకోసం అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఐవీఎఫ్ కోసం కల్చర్ మీడియంలు, మందులు, డిస్పోజబుల్ కేథటార్లు ఇతర సామగ్రి సమకూర్చుకోవాలి. ఇందుకు ఒక్కో ఐవీఎఫ్‌కు కనీసం రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు అవసరం. వీటికి సంబంధించి టెండర్లు ముందుకు సాగకపోవడంతో నిరీక్షణ తప్పడం లేదు. సెమన్ ఎనాలసిస్ చేసి అండాన్ని బతికించి ఈ రెండింటిని కలిపి ఎంబ్రియాలజీ ల్యాబ్‌లో అనుకూలమైన వాతావరణ పరిస్థితుల మధ్య కనీసం 6 రోజులు ఉంచిన తర్వాత పిండాన్ని మహిళ గర్భాశయంలో ప్రవేశ పెడతారు. గాంధీలో లెవల్-2 కేసులు మాత్రమే చేసే సౌలభ్యం ఉంది. దాతల నుంచి సేకరించి చేసే ఐవీఎఫ్ లెవల్-3 సేవలు అందుబాటులో లేవు. లెవల్-2 సేవలు ప్రారంభం కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని సంతాన భాగ్యం కోసం ఎదురు చూస్తున్న జంటలు కోరుతున్నాయి.

# ఇసుకాసురులు.. కలగదా కనువిప్పు?



హుజూరాబాద్ : ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. రాత్రింబవళ్లు తేడా లేకుండా వ్యాపారులు దందా నిర్వహిస్తున్నారు. రెవెన్యూశాఖల అధికారులు సంయుక్తంగా కఠినంగా వ్యవహరిస్తే తప్ప దందా కట్టడి చేయలేని పరిస్థితి నెలకొంది.

ఇదీ పరిస్థితి మానేరు వాగులో ఇసుక విరివిగా లభిస్తోంది. దీన్ని ఆసరా చేసుకుంటున్న అక్రమార్కులు.. ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఓవైపు అధికారులు పట్టుకుంటున్నా.. మరోవైపు వ్యాపారులు మాత్రం తేలికగా తీసుకుంటూ తిరిగి దందా కొనసాగిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని వీణవంక మండలం చల్లూరు, మల్లారెడ్డిపల్లి, కోర్కల్, పోతిరెడ్డిపల్లి.. జమ్మికుంట మండలం విలాసాగర్, తనుగుల, గంగ్రపల్లి, శంభునిపల్లి, వావిలాల, నగురం, నాగారం, కొండపాక, హుజూరాబాద్ పట్టణంతోపాటు మండలంలోని కందుగుల, చెల్పూరులతోపాటు పలుగ్రామాలకు చెందిన సుమారు 800కు పైగా ట్రాక్టర్లతో మానేరు నుంచి ఇసుకను రవాణా చేస్తున్నారు. దూరం, భవన నిర్మాణ అవసరాలను బట్టి వ్యాపారులు అడ్డగోలుగా ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. చల్లూరు నుంచి వీణవంక మండల కేంద్రానికి ఒక ట్రిపు ఇసుకకు రూ.2 వేలు వసూలు చేస్తున్నారు. జమ్మికుంట, హుజూరాబాద్, శంకరపట్నం, సైదాపూర్ వంటి మండలాలకు ఒక ట్రిప్పు ఇసుకకు రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు చెబుతుండటం అక్రమార్కుల దోపిడీకి అద్దం పడుతోంది. రాత్రి పగలు తేడా లేకుండా నిర్వహిస్తున్న ఈ ఇసుక దందాతో వ్యాపారులకు కాసులు కురుస్తున్నాయి.

ఇసుక రవాణా జరుగుతుండగా పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నారు. అయినా ఇసుకాసురుల్లో ఏమాత్రం మార్పు రావటం లేదు. ఇసుక అక్రమ రవాణాను నిర్మూలించాలంటే పోలీసు శాఖ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలి. నిరంతరం మానేరు పరివాహకం వద్ద రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు పర్యవేక్షిస్తుండాలి. ఈ అక్రమ వ్యాపారం నిర్వహించే వారిపై కేసులు నమోదు చేయడం, భారీ జరిమానా విధించడంతోపాటు కౌన్సెలింగ్ ద్వారా అవగాహన కల్పించాల్సి ఉంది. మళ్లీ నిబంధనలు ఉల్లంఘిస్తే ఉక్కుపాదం మోపాలని స్థానిక ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల్లో 39 కేసులు హుజూరాబాద్ డివిజన్ పరిధిలో రెండు నెలల్లో 39 కేసులు నమోదు చేశాం. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు. నిరంతరం గస్తీ పెంచుతున్నాం. అక్రమ రవాణాను నివారిం చేందుకు ప్రత్యేక దృష్టిపెట్టాం.శ్రీనివాస్‌జీ, ఏసీపీ

# 'అధి'కార్లు ఏం చేద్దాం..?

హైదరాబాద్: ప్రజాధనంతో కొనుగోలు చేసిన వాహనాలను జీహెచ్ఎంసీ ఇష్టారాజ్యంగా వినియోగిస్తోంది. అధికారం ఉంది కదా అని.. రవాణా విభాగంలోని ఇంజినీర్లు ప్రభుత్వ వాహనాలను వ్యక్తిగత అవసరాల కోసం వాడుకుంటున్నారు. ప్రస్తుత జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలోని ఓ ఉన్నతాధికారి వద్ద మూడు కొత్త ఇన్నోవా వాహనాలు ఉండగా.. బల్దియాలోనే పని చేస్తున్న మరో విభాగాధిపతి, ఐఎఫ్ఎస్ అధికారిణికి మాత్రం ఆరు నెలలుగా వాహన కేటాయింపు జరగట్లేదు. ఆమె ట్యాక్సీ సేవలను ఉపయోగించుకుంటున్నారు.

ట్యాక్సీ బిల్లు నిలుపుదల.. ప్రధాన బాధ్యతతోపాటు మరో మూడు ఇన్‌ఛార్జి పోస్టులను నిర్వర్తిస్తుండటంతో.. పోస్టుకు ఒకటి చొప్పున కారు ఉండాల్సిందేనని, కనీసం మూడు కార్లయినా ఉండాలంటూ ఆ ఉన్నతాధికారి పట్టుబడుతున్నారు. ఆయన వాహనాలను వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించుకుంటున్నారనే విమర్శలున్నాయి. తాజాగా రవాణా విభాగం అదనపు కమిషనర్ ఐఎఫ్ఎస్ అధికారి పెట్టిన ట్యాక్సీ బిల్లును నిలిపేశారు. ఈఎన్‌సీ అదనపు వాహనాలను రవాణా విభాగానికి అప్పగించడం లేదు. తన తర్వాత ఇన్‌ఛార్జి బాధ్యతలు తీసుకునే అధికారులకు వాటిని అప్పగిస్తానని ఆయన సమాధానం చెబుతున్నట్టు ఇంజినీర్లు చెబుతున్నారు.

**వాహనం ఖరీదుకు రెండింతలు..**

ఒకప్పుడు చెత్త తరలింపునకు జీహెచ్ఎంసీ దాదాపు 400 వాహనాలను ఉపయోగించేది. నిర్వహణ ఖర్చులే వాహనం ఖరీదుకు రెండింతలు,



అంతకుమించి అవుతుండటంతో కాలం చెల్లిన వాహనాలను తుక్కుగా మార్చేసింది. కొత్తవి కొనకుండా ప్రైవేటువి ఉపయోగిస్తోంది. ప్రస్తుతం బల్దియా వద్ద 100-120 చెత్త రవాణా వాహనాలే ఉన్నాయి. వాటినీ కొందరు ఇంజినీర్లు వదలట్లేదు. కవాడిగూడ యార్డు అవినీతికి అడ్డాగా మారింది. ప్రత్యేక అనుమతులు, మరమ్మతులకు ప్రతినెలా అక్కడి అధికారులు రూ.35లక్షలు వెచ్చిస్తున్నారు. డీజిల్ కూపన్లను బంకుల్లో అమ్ముకోవడం, ఇంజిన్ ఆయిల్, గేర్ ఆయిల్, టైర్లు, ఇతర వస్తువులను బయటి వ్యక్తులకు విక్రయిస్తున్నారు.

## తగ్గుతున్న జలం.. ఉపాధిపై ప్రభావం

బోయినపల్లి : రాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు) నుంచి పంటల సాగుకు నీటి విడుదల కొనసాగుతుండటంతో జలాశయంలో రోజు రోజుకూ నీటి నిల్వలు తగ్గుతున్నాయి. జలాశయంలో మత్స్యకారులు చేపల వేటతో ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో నీటి నిల్వ తగ్గుతుండటంతో ఉపాధిపై ప్రభావం చూపుతోంది. మత్స్యకారులకు స్థానింగా ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏటా చెరువుల్లో చేప పిల్లలను, జలాశయాల్లో చేప, రొయ్య పిల్లలను వదులుతోంది. రాజరాజేశ్వర జలాశయంలో జలాశయంలో 80-100 గ్రాముల బరువు ఉన్న రాహు, బంగారు తీగ, బొచ్చె రకం నెల రోజుల వయసున్న పిల్లలను విడిచిపెడుతున్నారు. జలాశయం పరిధిలోని మత్స్యకారులు సాయంత్రం తెప్పలపై జలాశయంలోపలికి వెళ్లి వలలు అమర్చి తిరిగి ఉదయం వెళ్లి వలకు చిక్కిన చేపలను ఒడ్డుకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. కిలో నుంచి సుమారు 20 కిలోల వరకు బరువున్న చేపలు జలాశయంలో లభిస్తున్నాయి. గ్రామాల్లో చేపల విక్రయాల కోసం అనేక మంది టేలా



డబ్బాలు వేసుకొని ఉపాధి పొందుతున్నారు. వలకు చిక్కిన చేపలను కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడతోపాటు ఇతర పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారు. జలాశయంలో నీరు సమృద్ధిగా ఉన్న సమయంలో వలకు ఆశించిన స్థాయిలో చేపలు చిక్కడంతో ఉపాధి లభించిందని... ప్రస్తుతం నీటినిల్వ తగ్గడంతో చేపలు చిక్కడం లేదని మత్స్యకారులు అంటున్నారు. తమ ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జలాశయ నిర్మాణంలో కొదురుపాక, నీలోజిపల్లి, వరదవెల్లి, శాభాష్‌పల్లి, సంకెపల్లి, రుద్రవరం, కొదుముంజ, అనుపురం, చీర్లవంచ, చింతల్‌ఠాణ, గుర్రంవాణిపల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి రాజరాజేశ్వర జలాశయంలో 2017-18 ఆర్థిక సంవత్సరం నుంచి చేప, రొయ్య పిల్లలను వదులుతున్నారు జలాశయంలో ముంపునకు గురైన నిర్వాసితులు, మత్స్యకారులతోపాటు జలాశయం పరిధిలోని పది కిలోమీటర్లలోపు మత్స్యకారులు చేపల వేట కొనసాగిస్తూ ఉపాధి పొందుతున్నారు మధ్యమానేరు పరిధిలో 659 మంది మత్స్యకారులు లైసెన్స్‌లు కలిగి ఉన్నారువివిధ కారణాలతో జలాశయంలో చేప పిల్లలను ఆలస్యంగా వదిలారు. 14.24 లక్షల చేప పిల్లలను వదలగా వాతావరణ మార్పులు, జాప్యంతో రొయ్య పిల్లలను ఈ సారి వదల్లేదు.

చేపలు లభించడం లేదుజలాశయంలో నీరు తగ్గడంతో చేపలు వలకు చిక్కడం లేదు. నీరు తగ్గక ముందు రోజూ పది కిలోల వరకు చేపలు లభించేవి. ప్రస్తుతం రెండు కిలోలు లభించడమే గగనంగా మారింది. ఒక్కోరోజు వలకు చేపలు చిక్కకపోవడంతో నిరుత్సాహంగా ఒడ్డుకు తిరిగి రావాల్సి వస్తోంది. నీటి విడుదలతో చేపలు దిగువకు వెళుతున్నాయి.శ్రీనివాస్, మత్స్యకారుడు

**ఆర్థికంగా ఇబ్బందులు**

చేపలు లభించిన సమయంలో రోజుకు రూ.వెయ్యి వరకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం రూ.200 ఆదాయం లభించడమే గగనంగా మారింది. చేపలు ఆశించిన స్థాయిలో లభించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నీరు తగ్గడంతో ఉపాధిపై ప్రభావం చూపుతుంది. నీరు ఇంకా తగ్గితే ఇంకా లోపలికి వెళ్లి వలలు వేయాల్సి ఉంటుంది.అనిల్, మత్స్యకారుడు

## అనుమతులు ఇచ్చారు.. పర్యవేక్షణ మరిచారు

వేములవాడ : ప్రభుత్వ పనులకు సంబంధించి అధికారులు ఇసుక రవాణాకు అనుమతులు ఇస్తున్నారు. రవాణాపై పర్యవేక్షణ లేకపోవడంతో ఇసుక పక్కదారి పడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రవాణాదారులు ప్రభుత్వ పనులకు కాకుండా మరో చోటకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రహదారులు, మురుగు కాలువలు, భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. నిర్మాణాల్లో ఇసుక కొరత లేకుండా ఉండటానికి జిల్లా యంత్రాంగం ఇసుక రీచ్‌లను గుర్తించింది. వేములవాడ గ్రామీణ మండలంలో చేపడుతున్న ప్రభుత్వ పనులకు ఇసుక రవాణా చేసుకోవడానికి లింగంపల్లి మూలవాగు నుంచి అనుమతులు ఇస్తున్నారు. ఒక్కో ట్రాక్టరుకు రూ.480 డీడీ చెల్లించాలి. డీడీతోపాటు ట్రాక్టరు నంబరు. డ్రైవర్ పేరు పూర్తి వివరాలతో తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. రెవెన్యూ అధికారుల పరిశీలన అనంతరం ఇసుక రవాణాకు అనుమతులు మంజూరు చేస్తున్నారు. మూలవాగు వద్ద తహసీల్దారు కార్యాలయం నుంచి ఒక ఉద్యోగి ఉండి రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేసుకొని వే బిల్లులు ఇస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నప్పటికీ వాగులో నుంచి బయటకు వెళ్లిన ఇసుక ట్రాక్టరు గమ్యస్థానానికి చేరుకుంటుందో లేదో పర్యవేక్షణ ఉండటం లేదు.

పక్కదారి పడుతున్న ఇసుక

అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పనులు పూర్తి కావడానికి ఇసుక రవాణాలో ఇబ్బందులు ఉండకూడదని అధికారులు అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఇదే అదనుగా కొందరు ట్రాక్టరు రవాణాదారులు ఇసుకను పక్కదారి పట్టించి అధిక ధరకు గ్రామాల్లో విక్రయిస్తున్నారు. నిర్ణయించిన ప్రదేశంలో కాకుండా మరికొన్ని చోట్ల డంప్‌చేస్తున్నట్లు తెలుస్తోంది. అనుమతులు మంజూరు చేస్తున్న అధికారులకు ట్రాక్టర్లపై పర్యవేక్షణ ఉండటం లేదు. గ్రామాల్లో చేపడుతున్న గృహ అవసరాలకు ఇసుక కొరత ఉండటం వలన పలువురు రవాణాదారులు నిబంధనలు అతిక్రమించి ఇసుకను విక్రయిస్తున్నారు. మంగళవారం లింగంపల్లి నుంచి ఇసుక రవాణాకు అనుమతులు మంజూరు చేయగా అనుమతి పొందిన చోటకు కాకుండా ప్రైవేటు అవసరాలకు విక్రయించినట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు చేపడతాం

గ్రామాల్లో చేపడుతున్న ప్రభుత్వ పనుల కోసం ఇసుక రవాణాకు అనుమతి ఇస్తున్నాం. రవాణాకు సంబంధించి పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం. ఇసుక పక్కదారి పడుతున్నట్లు మా దృష్టికి రాలేదు. పరిశీలన చేసి చర్యలు తీసుకుంటాం. అనుమతి పొందిన రవాణాదారులు నిబంధనలు పాటించాలి. అతిక్రమిస్తే చర్యలు తప్పవు.సుజాత, తహసీల్దారు

# కుయ్యో.. రొయ్యో!

పాయకరావుపేట : ట్రంప్ ప్రతీకార సుంకాల దెబ్బకు ఆక్వా రైతు కుదేలవుతున్నారు. ఒక్కసారిగా ఎగుమతి చేస్తున్న రొయ్య ధర తగ్గడంతో లబోదిబోమంటున్నారు. ఏప్రిల్ నుంచి నాలుగు నెలల పాటు రొయ్యల ఎగుమతులు జోరుగా సాగుతాయి. మంచి ధర వస్తుందని ఆశించిన రైతుకు అమెరికా విధించిన సుంకాల భారంతో నిరాశే ఎదురైంది.రొయ్యల్లో 20 నుంచి 60 కౌంట్ వచ్చే పెద్దవి ఎక్కువగా అమెరికాకు ఎగుమతి చేస్తుంటారు. అక్కడ వీటికి డిమాండ్ ఉంది. అంతకుమించి చిన్నసైజు చైనా, వియత్నాం, థాయ్‌లాండ్ తదితర దేశాలకు పంపిస్తుంటారు. గతంలో 10 శాతంగా ఉండే సుంకాన్ని ఏకంగా 27శాతానికి డొనాల్డ్ ట్రంప్ పెంచేశారు. ఇప్పటివరకు 100 కౌంట్ రొయ్య ధర రూ. 250 ఉండగా, ఈ దెబ్బతో ఒక్కసారిగా రూ. 190 వరకు తగ్గిపోయింది. దీంతో టన్నుకు సైజును బట్టి రూ.50 వేల నుంచి రూ. 70 వేల నష్టం వస్తోంది. వాస్తవానికి పెంచిన సుంకం ఏప్రిల్ 20 నుంచి అమల్లోకి రానుంది. ఇప్పటి నుంచే దీన్ని కంపెనీలు అమలు చేస్తున్నాయి. ఎకరానికి 30 కౌంట్ రొయ్య మూడు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. కేజీ రూ.



500 ఉన్నా రమారమి రూ.16 లక్షల ఆదాయం వచ్చే అవకాశముంది. కానీ సుంకం దెబ్బకు గణనీయంగా ఆదాయం తగ్గిపోతోంది. కేజీ ధర 100 కౌంట్ రొయ్యకు రూ. 220 ఉండేలా చూడాలని ప్రభుత్వం కంపెనీలను ఆదేశించింది.

**సాగు భారం...**

జిల్లా పరిధిలో ప్రస్తుతం వనామీ రకం రొయ్యను ఎక్కువగా సాగు చేస్తున్నారు. దీనికి సంబంధించిన తల్లి రొయ్యలను అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటారు. చెరువులు తవ్వి, సాగుకు అవసరమైన ఏరియేటర్లు, ఇతర ఏర్పాట్లు చేయడానికి లక్షల్లో పెట్టుబడి పెడుతుంటారు. ఎకరానికి హీనపక్షం రూ. 10 లక్షల వరకు పెట్టుబడి అయ్యే అవకాశముంది. ధర తగ్గిన నేపథ్యంలో ఆక్వా రైతు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కొత్తగా సాగు చేపట్టేందుకు సైతం వెనుకంజ వేస్తున్నారు.

**జిల్లాలో ఆక్వా విస్తీర్ణం: సుమారు 2 వేల ఎకరాలు**

సాగు చేస్తున్న ప్రాంతాలు: పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, ఎలమంచిలి, అచ్యుతాపురం మండలాలు

రొయ్యలు ఎగుమతి అయ్యే దేశాలు: అమెరికా, చైనా తదితర దేశాలు

ప్రభుత్వం ఆదుకోవాలి: సుంకాలతో ధర పతనమైంది. పెట్టుబడి రాని దుస్థితి. సాగు చేసే రైతును ప్రభుత్వం ఆదుకోవాలి. దీనివల్ల సాగు విస్తీర్ణం పెరుగుతుంది. కనీసం ప్రభుత్వం ప్రకటించిన కేజీకి రూ. 220 ధర వచ్చేలా చూడాలి. లేకపోతే లక్షలాది రూపాయలు నష్టపోయే అవకాశముంది. క్రాప్ హాలిడే ప్రకటిస్తే ఈ పరిశ్రమ గాడిలో పడాలంటే కనీసం ఏడాది పడుతుంది.

పబ్బు రామ్మోహన్, ఆక్వా రైతు, పెంటకోట


మేత ధరలు పెంచేస్తున్నారు: ఇప్పటికే సీడ్, రొయ్యల మేత ధరలు పెరగడంతో ఇబ్బంది పడుతున్నాం. దీనివల్ల రైతులకు వచ్చే లాభం తగ్గింది. ప్రతీకార సుంకం దెబ్బకు మా పరిస్థితి మరింత దిగజారుతోంది. ఇదే పరిస్థితి ఉంటే సాగుకు స్వస్తి చెప్పడమే మంచిది. యజ్జల చంద్రశేఖర్, ఆక్వా రైతు

# కాల్వ విస్తరణ.. వంతెనల విస్మరణ

పత్తికొండ : రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్న ఉద్దేశంతో హంద్రీనీవా కాల్వ విస్తరణకు 'కూటమి' ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కాల్వలో నీటి ప్రవాహాన్ని 3,850 క్యూసెక్కులకు పెంచేలా విస్తరిస్తున్నారు. ఇందుకు రూ.660 కోట్ల వరకు వెచ్చిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. జూన్ 15 నాటికి పూర్తయ్యేలా పనులు వేగవంతం చేశారు. పూర్తయితే 80వేల ఎకరాలకు సాగునీరు అందించొచ్చని అంచనా.

**పొంచి ఉన్న ముప్పు**

వంతెనలు, ఇతర నిర్మాణాలు ఉన్న చోట విస్తరణ చేపట్టడం లేదు.



ఉదాహరణకు " మద్దికెర – యడవలి గ్రామాల రైతుల పొలాలకు రాకపోకలు సాగించడానికి, ఇతర గ్రామాలకు వెళ్లేందుకు వంతెన నిర్మించారు. రెండు మీటర్ల మేర ప్రస్తుతం ఉన్న ప్రధాన కాల్వను తొలగించి ఆ మట్టిని కుడివైపు వేస్తూ.. కట్టను బలంగా చేస్తున్నారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు.. వంతెనల వద్ద ఇరుకుగా ఉన్నచోట కాల్వపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందని, ఈ క్రమంలో నీటి ప్రవాహం పెరిగి పొలాల్లోకి వస్తాయని ఈ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. " వంతెనలున్న చోట కాల్వ కోతకు గురికాకుండా ఇరువైపులా వంద మీటర్ల మేర లైనింగ్ పనులు చేపడతామని" ఈఈ చంద్రశేఖరరెడ్డి తెలిపారు.

**134 కి.మీ. 150 వంతెనలు**

ఉమ్మడి జిల్లాలో హంద్రీనీవా కాల్వ 134 కి.మీ. మేర విస్తరించి ఉంది. 0 కి.మీ. నుంచి 88 కి.మీ. వరకు ప్యాకేజీ- 1, 89 కి.మీ. నుంచి 216 కి.మీ. వరకు రెండో ప్యాకేజీగా విభజించారు. మొదటి ప్యాకేజీలను రూ.260 కోట్లతో, రెండో ప్యాకేజీ పనులను రూ.400 కోట్లతో పూర్తి చేయనున్నారు.ప్రధాన కాల్వపై 150కి పైగా వంతెనలు ఉన్నాయి. వీటికి ఇరువైపులా అటు 100 మీటర్లు, అటు 100 మీటర్ల మేర విస్తరణ పనులు చేసే పరిస్థితి కనిపించడం లేదు. విస్తరణ చేపట్టాలంటే వీటి స్థానంలో కొత్త నిర్మాణాలు చేపట్టాల్సిందే. ఆయా పనులను ప్రస్తుతం వాయిదా వేసినట్లు తెలుస్తోంది. వంతెనల పిల్లర్ల వద్ద కాల్వ కోతకు గురికాకుండా ఇరువైపులా 100 మీటర్ల మేర లైనింగ్ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

# అభివృద్ధి 'డబుల్'



చిత్తూరు : తిరుపతి- పాకాల- కాట్పాడి రైల్వే లైనింగ్ డబ్లింగ్ ప్రతిపాదన దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైంది. ఈ కలను సాకారం చేస్తూ కేంద్ర క్యాబినెట్ సానుకూల నిర్ణయం తీసుకుంది. తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలో వీలైనంత త్వరగా భూసేకరణకు అడుగులు పడితే వేగంగా పనులు జరుగుతాయి. దీనిపై రెండు జిల్లాల కలెక్టర్లు దృష్టి పెడితే వ్యవసాయ, పారిశ్రామిక, పర్యాటక రంగాల అభివృద్ధికి కృషి చేసినవారవుతారు.

ఆంధ్రప్రదేశ్- తమిళనాడును అనుసంధానించడంలో తిరుపతి- పాకాల- కాట్పాడి లైన్ ముఖ్యమైంది. ఈ మార్గంలో రోజూ 40కిపైగా రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం ఒకే లైన్ ఉన్నందున ఏవైనా ఎక్స్‌ప్రెస్ రైళ్లు వస్తే అవి వెళ్లేంత వరకూ ప్యాసింజర్‌లో వెళ్లే ప్రయాణికులు నిరీక్షించాల్సిందే. దీంతో ఎక్కువమంది అనివార్యంగా బస్సులనే నమ్ముకుంటున్నారు. డబుల్ లైన్ అందుబాటులోకి వస్తే ఈ ఇబ్బందులు తీరుతాయి. పుణే- కన్యాకుమారి, తిరుపతి- రామేశ్వరం వంటి రైళ్లు సైతం చిత్తూరు జిల్లా కేంద్రంలో ఆగేందుకు అవకాశం ఉంటుంది. సరకు రవాణా కూడా వేగంగా జరుగుతుందని చెప్పడంలో సందేహం లేదు.

**పారిశ్రామిక రంగానికి తోడ్పాటు**

ప్రస్తుతం తిరుపతి జిల్లాలో శ్రీసిటీ, ఈఎంసీలు, గూడూరు నియోజకవర్గ కేంద్రంగా అనేక పరిశ్రమలున్నాయి. విస్తరణకు కూడా వేగంగా అడుగులు పడుతున్నాయి. చిత్తూరు జిల్లాలోనూ గంగాధరనెల్లూరు కేంద్రంగా రెండు వేల ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు. బెంగళూరు- చెన్నై, చిత్తూరు- తచ్చూరు ఎక్స్‌ప్రెస్ రహదారి వెంట భూసేకరణ చేయాలని ఎప్పటినుంచో ప్రతిపాదన ఉంది. ఇవన్నీ కార్యరూపం దాల్చితే ఆయా పరిశ్రమల్లోని ఉత్పత్తులు రైలు మార్గంలో ఏటా 40 లక్షల టన్నుల సరకు అదనంగా తరలించవచ్చని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పడమే ఇందుకు నిదర్శనం.

**రెండు, మూడు రోజులు ఉండేలా**

తిరుపతి- కాట్పాడి డబ్లింగ్ పూర్తయితే పర్యాటక రంగానికీ ఊతమిస్తుంది. తిరుపతి జిల్లాలో సముద్ర తీరం, ఆధ్యాత్మిక క్షేత్రాలున్నాయని ఈ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు పలుమార్లు ఆదేశించారు. ఇందుకు అనుగుణంగానే చంద్రగిరి, మామండూరు, మల్లెమడుగు, తూపిలిపాలెం వంటి ప్రదేశాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తిరుమల, శ్రీకాళహస్తి, కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్‌కు వచ్చే యాత్రికులు సరదాగా రెండు- మూడు రోజులు ఆయా ప్రాంతాల్లో సేద తీరేలా ఏర్పాట్లు చేస్తే స్థానికులకు ఉపాధి లభిస్తుంది.

**మామిడి, గ్రానైట్ ఎగుమతుల ఖర్చు తగ్గుదల**

చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి మామిడి గుజ్జు, గ్రానైట్ వివిధ దేశాలకు ఎగుమతి అవుతోంది. ప్రస్తుతం ఇక్కడి నుంచి చెన్నై వరకు ఎక్కువగా రోడ్డు మార్గంలోనే రవాణా జరుగుతోంది. తిరుపతి- కాట్పాడి మధ్య డబుల్ లైన్‌తో తక్కువ సమయం, తక్కువ వ్యయంతో చెన్నై నౌకాశ్రయానికి చేర్చవచ్చు. కృష్ణపట్నం పోర్టు నుంచి ఎగుమతులు పెరుగుతాయని అంచనా.

రైల్వే లైన్ డబ్లింగ్: తిరుపతి–కాట్పాడి (వయా పాకాల)

పొడవు: 104 కిలో మీటర్లు

అంచనా వ్యయం: రూ.1,332 కోట్లు

**తెరిస్తే వ్యర్థాలు.. మూస్తే చీకట్లు**

చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం కలిగిరి జడ్పీ ఉన్నత పాఠశాలను పిచ్చిమొక్కలు.. రోడ్డు పక్కన పడేసే వ్యర్థాలు కప్పేశాయి. పాఠశాల చిత్తూరు–తిరుపతి జాతీయ రహదారి పక్కనే ఉంది. గతంలో ఈ రోడ్డు, పాఠశాల సమాంతరంగా ఉండటంతో పాటు ప్రహరీ సైతం ఉండేది. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు దాదాపు నాలుగడుగుల మేర ఎత్తు పెంచడంతో ప్రహరీ పోయి ఏకంగా రోడ్డుకు ఆనుకుని తరగతి గదులు ఉన్నాయి. వీటికి ఉన్న కిటికీలు సైతం రోడ్డు విస్తరణలో మూసుకుపోయి కొంత మేర కనిపిస్తున్నాయి. వెలుతురు కోసం కిటికీలు తెరిస్తే దుమ్ము.. శబ్ద కాలుష్యం.. బస్సుల్లో నుంచి వెళ్లే వారు వేసే వ్యర్థాలు కిటికీల్లో నుంచి నేరుగా విద్యార్థులపై పడుతున్నాయి. అలాగని కిటికీలు మూసివేస్తే చీకటి, గాలి ఆడక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇలా దాదాపు మూడు గదులు రోడ్డు వెంటే మూసుకుపోయాయి. దీంతో రోడ్డు ఎత్తులో.. పాఠశాల కింద కనిపిస్తోంది.

# రూ. కోట్ల పనులు.. కట్టబెట్టే ఘనులు!




విశాఖపట్నం : విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) చేపడుతున్న కొన్ని ప్రాజెక్టులు వైకాపా నేతలకు లబ్ధి చేకూరేలా మారాయా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. అటువంటి వాటిని రద్దు చేయాలని కొందరు ప్రజాప్రతినిధులు తేల్చి చెప్పినా అధికార యంత్రాంగం ముందుకు వెళుతుండటంపై విమర్శలు వస్తున్నాయి. అలాగే గత పాలకుల ఆస్తులకు విలువ పెంచేలా రహదారుల ప్రతిపాదనలూ ఆశ్చర్యపరుస్తున్నాయి. కైలాసగిరిపై: కైలాసగిరిపై రివాల్వింగ్ రెస్టారెంటు, కాటేజీల నిర్మాణానికి గత ప్రభుత్వంలో టెండర్లు పిలిచారు. 1.99 ఎకరాల్లో రూ.18 కోట్లతో ప్రాజెక్టు చేపట్టి 33 ఏళ్లకు లీజుకు ఇచ్చేలా నిర్ణయించారు. వైకాపా నేతకు అనుకూలంగా టెండరు నిబంధనలు మార్చి కట్టబెట్టారన్న ఆరోపణలున్నాయి. ఆ నేతకు మాత్రమే ఆ ప్రాజెక్టు దక్కేలా వ్యూహాత్మకంగా వ్యవహరించారని సమాచారం. ఇన్ని జరిగినా కూటమి ప్రభుత్వం ఆ టెండరు ప్రక్రియ రద్దు చేయకుండా ముందుకు వెళ్తుందని నేతలు పేర్కొంటున్నారు. దీనిపై ఫిర్యాదులు సైతం వచ్చాయి. కైలాసగిరిపై గతంలో ఇదే ప్రాజెక్టు చేపడితే వీఎంఆర్‌డీఏకు న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి.

రద్దీ నియంత్రణకు వీఎంఆర్‌డీఏ భీమిలి మండలం నేరెళ్లవలస వద్ద ప్రతిపాదించిన రోడ్డు వైకాపా నేతల ఆస్తులకు సమీపంలో ఉంది. దీన్ని రద్దు చేయాలన్న డిమాండు ప్రజాప్రతినిధుల నుంచి ఉన్నా యంత్రాంగం ఆ దిశగా దృష్టిసారించడం లేదని తెలుస్తోంది.

**ఎన్నికల ప్రకటనకు ముందు:** బృందావన్ గ్లో గార్డెన్ పార్క్‌ను వీఎంఆర్‌డీఏ మళ్లీ తెరమీదికి తెచ్చింది. ఎటువంటి ప్రణాళిక లేకుండా గత ప్రభుత్వంలో హడావుడిగా శంకుస్థాపన చేశారు. అయినా దానికి పెద్దపీట వేస్తున్నారు. అప్పట్లో టెండర్లు సక్రమంగా పిలవకుండా నచ్చినోళ్లకు పనులు అప్పగించి ఇంజినీరింగ్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారు. ఇటీవల జరిగిన వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో ఈ ప్రాజెక్టుపై చర్చించి మళ్లీ చేపట్టాలని నిర్ణయించడం గమనార్హం. గత ప్రభుత్వంలో ఎన్నికల ప్రకటనకు రెండు గంటల ముందు ఈ ప్రాజెక్టు పనుల కోసం వీఎంఆర్‌డీఏ అధికారులు అప్పటి వైకాపా నేతలతో భూమి పూజ చేయించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వస్తుందని తెలిసి మరీ చేశారన్న విమర్శలు వచ్చాయి. అప్పట్లో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వీఎంఆర్‌డీఏ ఛైర్మన్‌తో తొలి శిలాఫలకాన్ని ఆవిష్కరించాలని అధికారులు హడావుడి చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా సెంట్రల్ పార్క్‌లోని చెట్లు, మొక్కలకు విద్యుత్తు అలంకరణ చేపడతారు. విద్యుత్తు కాంతులతో ప్రత్యేక దీపాలు ఏర్పాటు చేస్తారు. అలంకరణ పేరుతో లైటింగ్ పెట్టడం వీఎంఆర్‌డీఏ చేసే పనా అంటూ అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. పచ్చగా ఉండే సెంట్రల్ పార్క్‌లో గ్లో గార్డెన్ పేరుతో ఇష్టారాజ్య పనులేంటనే విమర్శ వాకర్ల నుంచి వస్తోంది. పార్క్ లోపలున్న సమస్యలను పరిష్కరించకపోవడం, వసతులు మెరుగుపరచక పోవడంపై పెదవి విరుస్తున్నారు. అప్పట్లో రూ.2.24 కోట్ల అంచనాతో గ్లో గార్డెన్‌కు టెండర్లు పిలిచారు. ఏకమొత్తంగా పిలిస్తే అభ్యంతరాలొస్తాయని రూ.30 లక్షలతో రెండు, రూ. కోటితో మరో టెండరు పిలిచారు. దీంతో గుత్తేదారు పనులు ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. అవసరమైన సామగ్రిని పార్క్‌లో వేశారు. ఆ తర్వాత పనులు ఆపేశారు. ఈ పనుల అప్పగింతలో అవకతవకలు చోటుచేసుకున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

# డి.పట్టా భూముల స్వాధీనానికి ఆదేశం

బుచ్చెయ్యపేట : ఆర్.భీమవరంలో ప్రభుత్వానికి అప్పగించిన డి.పట్టా భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుచ్చెయ్య పేట తహసీల్దార్‌కు ఉత్తర్వులు అందాయి. గాజువాకకు చెందిన పారిశ్రామికవేత్త కడియాల రాజేశ్వరరావు బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరంలో సుమారు 30 ఎకరాల డి.పట్టా భూములను గతంలో కొనుగోలు చేశారు. తెలియకుండా కొనుగోలు చేశామంటూ ఆయన ఆ భూములను తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేశారు. ఈ నెల 3న కలెక్టర్‌ను కలిసి సంబంధిత పత్రాలను అందజేసిన విషయం తెలిసిందే. వీటిని చట్టప్రకారం ప్రభుత్వ స్వాధీనం చేసుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ నుంచి తహసీల్దారుకు ఆదేశాలు వచ్చాయి.



సంబంధిత భూముల్లో బోర్డులను ఏర్పాటు చేసి అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా భూముల స్వాధీన ప్రక్రియను పూర్తి చేసి నివేదికను అందజేయాలని ఆదేశించారు.

# డ్వామా.. బది'లీలలు' చూడతరమా

నంద్యాల : జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో గత నెల రాష్ట్ర వ్యాప్తంగా కౌన్సెలింగ్ పద్ధతిలో బదిలీలు జరిగాయి. ఇందులో భాగంగా జిల్లాలో కూడా సాంకేతిక సహాయకులు, ఏపీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లను బదిలీ చేశారు. ఈ ప్రక్రియ ముగిసిన కొన్ని రోజులకే జిల్లా డ్వామా కార్యాలయంలో సిఫార్సు బదిలీలు, పరస్పర అంగీకార (మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్) బదిలీలు జరుగుతుండటం విస్తుగొలుపుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రజాప్రతినిధుల సిఫార్సుల పేరుతో ఈ బదిలీలు జరుగుతున్నాయి. క్రమంలో పెద్దఎత్తున నగదు చేతులు మారుతున్నట్లు సమాచారం.

**అక్రమ ఆదాయం పోతుందనే..**

కొందరు ఉద్యోగులు కొన్నేళ్లుగా ఒకేచోట పనిచేస్తూ అక్రమ ఆదాయానికి బాటలు వేసుకున్నారు. అడ్డదారుల్లో పెద్దఎత్తున సంపద కూడబెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి వారు ప్రస్తుతం ఉన్న ప్రాంతాల నుంచి ఇతర మండలాలకు వెళ్లడానికి ఇష్టపడటం లేదు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకున్నారు. ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు తీసుకురావడంతో పాటు పరస్పర అంగీకార పత్రాలు ఉన్నతాధికారుల వద్ద ఉంచి బదిలీలు చేయించుకుంటున్నారు.మరికొన్ని చోట్ల డిప్యుటేషన్ల పేరు మీద బదిలీలు జరిగిపోతున్నాయి. గత మూడు రోజులుగా పదుల సంఖ్యలో బదిలీలు పూర్తవ్వగా ఈ ప్రక్రియ మరికొన్ని రోజుల పాటు కొనసాగించేందుకు ఏర్పాట్లు జరిగిపోయాయి. ఇందులో ఓ ఉన్నతాధికారి, ఇద్దరు కార్యాలయ సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారు.కొందరు సాంకేతిక సహాయకులు (టీఏ) కొన్నేళ్లుగా ఒకే మండలంలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలోనే పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. వీరిని గత నెలలో కూటమి ప్రభుత్వం ఇతర ప్రాంతాలకు బదిలీ చేసింది. ఈ బదిలీలను జీర్ణించుకోలేని కొందరు ప్రస్తుతం పాత స్థానానికి వెళ్లేందుకు అడ్డదారులను ఆశ్రయిస్తున్నారు. పరస్పర అంగీకార బదిలీల పేరుతో నాటకాలకు తెరతీశారు.ముగ్గురు టీఏలు మిడుతూరు నుంచి గడివేములకు, గడివేముల నుంచి బేతంచెర్లకు, బేతంచెర్ల నుంచి మిడుతూరుకు తిరిగి వెళ్లేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. బేతంచెర్లకు వెళ్లనున్న టీఏపై పలు ఆరోపణలు ఉన్నాయి.

బనగానపల్లిలో విధులు నిర్వర్తిస్తూ డిప్యుటేషన్‌పై దొర్నిపాడులో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్‌ను తిరిగి బనగానపల్లిలో చేరాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. కాని సదరు ఉద్యోగి దొర్నిపాడులోనే ఉండాలని కోరుకుంటున్నారు. ఇందుకోసం ఇద్దరు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి దొర్నిపాడులో కొనసాగేందుకు మార్గం సుగమం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**అవసరం లేకున్నా డిప్యుటేషన్లు..**

అడ్డగోలు బదిలీల్లో భాగంగా.. ఉన్నతాధికారి సిఫార్సులతో ఓ సాంకేతిక సహాయకుడిని చాగలమర్రి నుంచి మహానందికి బదిలీ చేశారు.

ఓ మహిళా ఉద్యోగిని బనగానపల్లి నుంచి నంద్యాలకు డిప్యుటేషన్‌పై తీసుకొచ్చారు. ప్రస్తుతం ఇక్కడ పోస్టు ఖాళీగా లేకున్నా సరే డిప్యుటేషన్‌పై తీసుకురావడం గమనార్హం. ఇక్కడ ఆమె అవసరం లేకున్నా సరే ఇప్పటికే ఉన్న ఉద్యోగితో పాటు విధులు నిర్వర్తించనున్నారు.

ఇలా నలుగురు కంప్యూటర్ ఆపరేటర్లను డిప్యుటేషన్‌పై, ఇద్దరిని పరస్పర అంగీకారంపై బదిలీ చేశారు.

బనగానపల్లి నుంచి దొర్నిపాడుకు మహిళా ఉద్యోగిని బదిలీ చేశారు. గత నెలలో బనగానపల్లి నుంచి అవుకుకు బదిలీ అయిన ఆపరేటర్‌ను తిరిగి బనగానపల్లిలోనే పనిచేసేలా డిప్యుటేషన్ చేశారు. మరో మహిళా సిబ్బందిని ఇదేవిధంగా రుద్రవరం నుంచి గోస్పాడుకు బదిలీ చేశారు.

ఇద్దరు ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు పరస్పర అంగీకారంపై బదిలీలు కోరగా వెంటనే అంగీకరించారు. వీరిని సంజామల నుంచి కోవెలకుంట్లకు, కోవెలకుంట్ల నుంచి సంజామలకు పంపేందుకు మార్గం సుగమం చేశారు. సీనియర్లకు అవకాశం లేకుండా ఇలా పరస్పర బదిలీలకు పచ్చజెండా ఊపడం పట్ల తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


గత నెలలో రుద్రవరానికి బదిలీ అయిన జూనియర్ ఇంజినీర్ ఒకరు అక్కడ విధుల్లో చేరి ఒక్కరోజు మాత్రమే పనిచేశారు. ప్రస్తుతం సిఫార్సు లేఖ కోసం ఓ ప్రజాప్రతినిధి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మరో ఇద్దరు ఏపీవోలు కూడా ఓ నాయకుని చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

# నేతలతో బంధాలు.. రియల్ దందాలు

అనకాపల్లి : పంట చేలతో పచ్చగా ఉండే భూములు కాస్తా స్థిరాస్తి లే అవుట్లుగా మారిపోతున్నాయి. ఊరికో వెంచర్ వెలుస్తోంది. కాకపోతే వాటిలో చాలావరకు అనుమతులు లేనివే ఉంటున్నాయి. పైగా కొన్నిచోట్ల పక్కనున్న పంట కాలువలు, గెడ్డలను సైతం ఆక్రమించి దర్జాగా అమ్మకాలకు దిగుతున్నారు. నేతలతో చేతులు కలిపి.. అధికారుల చేతుల తడిపి తమ రియల్ దందాలకు అడ్డులేకుండా చేసుకుంటున్నారు. అనకాపల్లి జిల్లాలో అక్రమ లేఅవుట్లు, ఆక్రమణలకు గురైన సాగునీటి వనరులకు లెక్కేలేదు. వాటిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే కంటితుడుపు చర్యలతో సరిపెట్టేస్తున్నారు.

**లేఅవుట్ల ఆక్రమణ**

లివిగో..: పాయకరావుపేట మండలం పెదరామభద్రపురంలో పది ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ వేస్తున్నారు. దీనికి ఆనుకుని ఉన్న పల్లపు కాలువ గట్టును వంద మీటర్ల వెడల్పులో చదును చేసి వెంచర్‌లో కలిపేశారు. దీంతోపాటు వంద తాటిచెట్లను నరికేశారు. రైతుల ఫిర్యాదుతో జలవనరులశాఖ అధికారులు పరిశీలించారు. గట్టును



యథావిధిగా వేయాలని ఆదేశాలు ఇచ్చినా ఇప్పటికీ అమలు కాలేదు. పి.ఎల్.పురంలో వైకాపా నాయకుడు వేస్తున్న లేఅవుట్‌కు పక్కనే ఉన్న కొండ గెడ్డ కాలువను కప్పేసి రోడ్డు పనులు చేపట్టారు. రైల్వేట్రాక్‌కు అవతల వైపున పాయకరావుపేట, పి.ఎల్.పురం, అరట్లకోట గ్రామాలకు చెందిన వారికి జగనన్న కాలనీ లేఅవుట్‌లో స్థలాలు కేటాయించారు. వీరికి ప్రత్యేక రహదారి అవసరమంటూ వైకాపా నాయకుని లేఅవుట్‌కు లబ్ధి చేకూరేలా కాలువ కబ్జా చేశారు. కొంతమంది ఫిర్యాదు చేయడంతో పనులు తాత్కాలికంగా నిలిపివేశారు.

దేవరాపల్లి మండలం నర్సింగి పంచాయతీ పరిధిలో ఇటీవల భారీ లేఅవుట్ వేశారు. రహదారిని ఆనుకుని ఉన్న గెడ్డను చాలావరకు కప్పేశారు. ప్రభుత్వ స్థలంలోనే బోరు తవ్వి నీటిని వినియోగించుకుంటున్నారు. దీనిపై కొందరు ఫిర్యాదు చేశాక ఆక్రమణలపై వెనక్కి తగ్గి బోరును పంచాయతీకి అప్పగిస్తామంటూ ముందుకొచ్చారు.

కశింకోట మండలం బయ్యవరంలో వైకాపా ముఖ్యనేతలు 403 ఎకరాల్లో భారీ లేఅవుట్ వేశారు. దీనికోసం కొండ గెడ్డలు, వాగులు ఆక్రమించారు. కొండలను తొలిచేశారు. ఈ లేఅవుట్‌కు వీఎంఆర్‌డీఏ నుంచి అనుమతులు కూడా తీసుకోలేదు. ఇటీవల వారు కూటమి నేతలను మచ్చిక చేసుకుని తమ స్థిరాస్తి వ్యాపారానికి ఆటంకాలు లేకుండా అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది.ఈ విషయమై సంయుక్త కలెక్టర్ జాహ్నవి వద్ద ప్రస్తావించగా విస్సన్నపేట లేఅవుట్‌లో కార్యకలాపాలను ఇదివరకే నిలిపేసినట్లు చెప్పారు. ప్రభుత్వ భూములు ఆక్రమించే వారిపై కఠిన చర్యలే తీసుకుంటామన్నారు.

చురకలు



# మేమింతే..!



అనంతపురం : అనంతపురం శారదానగర్‌కు చెందిన పల్లవికి జ్వరం రావడంతో ఓ ప్రైవేటు వైద్యశాలకు వెళ్లింది. వైద్యుడు ఆమెను పరీక్షించారు. వివిధ పరీక్షల కోసం ఓ కేంద్రానికి వెళ్లాలని చీటీ రాసిచ్చారు. చీటీలో చిరునామా ప్రకారం వెళితే అక్కడ పరీక్షలకు రూ.1600వరకు అయింది. రెండు గంటల తరువాత ఇచ్చిన ఫలితాలను తీసుకెళ్లి వైద్యుడికి చూపించగా... ఇబ్బంది ఏమి లేదని మందులు రాసిచ్చారు. వాటిని అక్కడి వైద్యశాల దుకాణంలో కొనుగోలు చేయగా రూ.2 వేలకు పైగా ఖర్చయింది.

పుట్టపర్తి మండలానికి చెందిన వెంకటేశ్ తలనొప్పిగా ఉందని, అప్పుడప్పుడు పొట్టభాగంలో నొప్పిగా ఉందంటూ అనంతపురంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి టోకన్‌కు రూ.400 చెల్లించి వైద్యుడిని కలిశారు. రక్తపరీక్షలు, ఎంఆర్ఐ స్కానింగ్ చేయించి తీసుకురావాలని... అది కూడా సూచించిన కేంద్రంలోనే చేయించుకోవాలన్నారు. ఇందుకు రోగికి రూ.7వేలు ఖర్చు చేశారు. వారి ఇచ్చిన రిపోర్టులను సదరు వైద్యుడికి చూపించగా ఏమీ లేదని.. రూ.2,700 మందులు వాడి.. ఇబ్బంది అయితే నెల తరువాత రావాలని సూచించారు.

ఉమ్మడి అనంత జిల్లాలో కొందమంది వైద్యులు, ఆర్ఎంపీలు నిబంధనలకు నీళ్లొదిలేశారు. జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పి, కడుపునొప్పి తదితర చిన్నపాటి ఆరోగ్య సమస్యలతో ప్రైవేటు వైద్యశాలలకు వెళుతున్న రోగులకు అక్కడి వైద్యులు చుక్కలు చూపిస్తున్నారు. చాంతాడంత పరీక్షలు చేయించుకురావాలని.. రక్తపరీక్ష, స్కానింగ్ కేంద్రాలకు పంపుతున్నారు. వైద్యులు చెప్పారన్న కారణంతో రోగులు వారు సూచించిన కేంద్రానికి వెళ్లి... రూ.వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. వారిచ్చే ఫలితాలను సదరు వైద్యుల వద్దకు తీసుకెళ్లి చూపిస్తున్నారు. ఏమి ఇబ్బంది లేదని చెబుతూ రూ.1500 నుంచి రూ.2వేల వరకు మందులు రాసిస్తున్నారు.

కొందరు ఆర్ఎంపీలు తమ ప్రథమ చికిత్సా కేంద్రాల్లోనే రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారు. వారే సెలైన్ ఎక్కించటం, మందులు రాసివ్వటంతోపాటు అమ్ముతున్నారు. స్కానింగ్, రక్తపరీక్షా కేంద్రాలతో కమీషన్ పొందేందుకు అనవసరంగా పరీక్షలు రాస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అనంతపురంలోని పాతూరు, కళ్యాణదుర్గం రోడ్డు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స కేంద్రాలు నిర్వహిస్తూ.. వివిధ పరీక్షల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారు.

**ఇష్టారాజ్యంగా..**

పలు ప్రాంతాల్లోని రక్తపరీక్ష కేంద్రాలు నిబంధనల ప్రకారం నడవటం లేదు. ల్యాబ్ టెక్నీషియన్లు, అర్హత కలిగిన సిబ్బందితో కాకుండా ఇతరులతో పరీక్షలు చేయిస్తున్నారు. ఒక్కోచోట ఒక్కో రిపోర్టు ఇస్తున్నారని కొందరు రోగులు వాపోతున్నారు. కొన్ని పట్టణాల్లో అనధికారికంగా కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఇలాంటివి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50కి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. వాటిపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. **తనిఖీలు చేసి.. చర్యలు తీసుకుంటాం** – డాక్టర్ ఈ.బి.దేవి, డీఎంహె చ్‌వో, అనంతపురం

ప్రైవేట్ వైద్యశాలలు, ఆర్ఎంపీల ప్రాథమిక చికిత్సా కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. ఇటీవల రాయదుర్గంలో రెండు ప్రాథమిక చికిత్సా కేంద్రాలను సీజ్ చేశాం. స్కానింగ్, రక్తపరీక్ష కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేస్తాం. రోగులపై భారం మోపేలా, నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేసేవారిపై చర్యలు తీసుకుంటాం.

## జనన ధ్రువీకరణ పత్రాలకు నిరీక్షణ

గుంతకల్లు : గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలు పొందడానికి నిరీక్షణ తప్పటం లేదు. నెలల తరబడి ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నా పత్రాలు అందక జనం నానా తిప్పలు పడుతున్నారు. ఆసుపత్రిలో నెలకు వందకు పైగా ప్రసవాలు జరుగుతుంటాయని ఆసుపత్రి వైద్యులే చెబుతున్నారు. పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలు కోసం దరఖాస్తు చేసుకుంటున్నా జారీ విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుంతకల్లు వాసులే కాకుండా పామిడి, వజ్రకరూరు, తదితర



మండలాలకు చెందిన వారు ఎక్కువగా ఆసుపత్రికి వస్తుంటారు.

**ఆసుపత్రిలో సిబ్బంది కొరత**

జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే విభాగంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇక్కడ ఒక్కరే ఉండటంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి ఇబ్బందిగా మారింది. ఒక్కొక్కసారి సర్వర్ పని చేయక పోవడంతో దరఖాస్తుల నమోదు ప్రక్రియ జరగటం లేదు. ఇక్కడ పని చేసే ఉద్యోగికి మరో సెక్షన్‌లో అదనపు బాధ్యతలు అప్పగించారు.

**మూడు నెలలుగా తిరుగుతున్నా..** – అంజలి, పామిడి మండలం

గతేడాది డిసెంబరులో పాప పుట్టింది. అదే నెలలో జనన ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నా. నెలలో రెండు మూడు సార్లు ఆసుపత్రికి వచ్చి వెనక్కి వెళ్తున్నా. ఎండలు ఎక్కువగా ఉండటంతో తోడుకు కుటుంబ సభ్యులను పిలుచుకొని ఆసుపత్రికి వస్తున్నా. రవాణా ఖర్చులు భరించలేకపోతున్నాం. ఇప్పుడు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారు.

**సకాలంలో ఇవ్వడానికి చర్యలు తీసుకుంటాం..** – డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి, సూపరింటెండెంట్, గుంతకల్లు ఏరియా ఆసుపత్రి

దరఖాస్తు చేసుకున్న వారికి కొత్త జనన ధ్రువీకరణ పత్రాలను సకాలంలో ఇస్తున్నాం. గతేడాది జూన్, జులై, ఆగస్టు నెలలకు చెందిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సర్వర్ సమస్య, సిబ్బంది కొరత ఉంది. ఈనెలలో అన్ని మంజూరు చేస్తాం

## పల్లెసీమలకు రహదారుల శోభ

పుట్టపర్తి : ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామీణ ప్రాంత రహదారుల రూపురేఖలను ప్రభుత్వం మార్చేసింది. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లలో పల్లెలు, పట్టణాల రహదారుల నిర్వహణ గాలికి వదిలేయడంతో దారుణంగా తయారయ్యాయి. రహదారులపై ప్రయాణం చేయాలంటే ప్రజలు భయాందోళన చెందే పరిస్థితి ఉండేది. కనీస మరమ్మతులు చేయించిన పాపానపోలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక రహదారులను బాగు చేయాలని సంకల్పించిం



ది. దీంతో నూతనంగా నిర్మించిన బీటీ, సీసీ రహదారులతో ఆయా ప్రాంతాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమానికి గత ఏడాది ఆగస్టులో శ్రీకారం చుట్టింది. గ్రామసభలు నిర్వహించి, ప్రజల అభిప్రాయాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా 1,772 పనులను గుర్తించి రూ.126 కోట్లుతో చేపట్టారు. ఇప్పటి వరకు రూ.120.80 కోట్లుతో 1,702 పనులు పూర్తి చేశారు. వాటిలో 213 కిలోమీటర్ల సీసీ, బీటీ రోడ్లు నిర్మించారు. దీంతో ప్రగతిలో జిల్లా ఐదో స్థానం ఉందని పంచాయతీరాజ్ ఈఈ మురళీ తెలిపారు. వివిధ దశాల్లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

## మరవంక కబ్జా.. నివాసాలకు ముప్పు

కొత్తచెరువు : బుక్కపట్నం చెరువు ప్రధాన మరవ నీరు వెళ్లే మార్గంలో మరవవంక ఆక్రమణకు గురైంది. దీంతో కొత్తచెరువులోని నివాసాలకు ముప్పుగా మారింది. ఒక టీఎంసీ నిల్వ సామర్థ్యం కలిగిన చెరువు ప్రధాన మరవ ప్రవహిస్తే వరద ఉధృతిని అంచనా వేయడం కష్టమే. ఈనేపథ్యంలో గ్రామానికి ఆవలివైపు మరవవంక గట్టునున్న నీటిపారుదల శాఖ భూమిని ఒకరు కబ్జా చేసి ఇటుక బట్టి వ్యాపారం చేస్తున్నారు. కొన్నేళ్లుగా బట్టి నుంచి వెలువడే వ్యర్థాలతో మరవవంకను ఏటా కొంత మేరకు పూడుస్తూ పక్కాగా పునాది నిర్మించేశారు. దీంతో చిత్రావతి వంతెన దిగువకు సాఫీగా సాగాల్సిన ప్రవాహం వంక కబ్జాతో గ్రామంలోని గృహాల



వైపునకు వచ్చి స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. నాలుగేళ్ల క్రితం ప్రధాన మరవ ఉధృతంగా ప్రవహిస్తూ నివాసాలవైపు చొచ్చుకురావడంతో స్థానికులు... నీటిపారుదల, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. పరిశీలించిన అధికారులు భవిష్యత్తులో ప్రమాద తీవ్రతను గుర్తించారు. నీటిపారుదల శాఖ భూమిని సర్వేచేసి హద్దులను గుర్తించాలని రెవెన్యూ అధికారులను కోరారు. సర్వే అనంతరం ఆక్రమణపై చర్యలు చేపడతామని అధికారులు స్థానికులకు హామీ ఇచ్చారు. సర్వే ఏదీ?: నేటికి సర్వే ముందుకు సాగడం లేదు. ప్రమాద తీవ్రతను గుర్తించిన అధికారులు బదిలీ అవుతున్నారే గాని సర్వే ఒక్క అడుగు ముందుకు పడలేదని స్థానికులు వాపోతున్నారు. కబ్జాతో బుక్కపట్నం ప్రధాన రహదారిలో చిత్రావతిపై నిర్మించిన వంతెన ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై నీటిపారుదల శాఖ డీఈ గంగాధర్‌ను వివరణ కోరగా పరిశీలిస్తామన్నారు. హద్దులను గుర్తించి ఆక్రమణలపై చర్యలు చేపడతామని తెలిపారు.

## మద్దిలేరు వంతెన.. అంతేనా?



ముదిగుబ్బ : ముదిగుబ్బ మండలంలోని మద్దిలేరు వంతెన నిర్మాణం కోసం వేలాది మంది ఎదురుచూస్తున్నారు. వంతెన పూర్తిగా కొట్టుకుపోయి ఇప్పటికి ఐదేళ్లు గడుస్తున్నా కొత్తది నిర్మించలేదు. దీంతో వాహనదారులు నరకయాతన పడుతూ ప్రయాణిస్తున్నారు. నల్లమాడ నుంచి పులివెందుల వైపు, తలుపుల మండలానికి ఈ మార్గంలోనే వెళ్లాలి. యల్లనూరు, పుట్లూరు మండలాల నుంచి కదిరికి వెళ్లాలంటే తక్కువ దూరం కలిసొస్తుందని ఈ మార్గంలోనే వెళ్తుంటారు. లో లెవల్ వంతెన కావడంతో మద్దిలేరు వాగు ప్రవహించినప్పుడు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ముదిగుబ్బ, తలుపులలోని 25 గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరో పది కిలోమీటర్లు చుట్టేసుకుని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

**శాశ్వత పరిష్కారాలేవి..**

ముదిగుబ్బ–కదిరి సరిహద్దులో ఉన్న మద్దిలేరు వంతెన అధిక వర్షాలతో 2021లో పూర్తిగా కొట్టుకుపోయింది. తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. ఆ తర్వాత సిమెంటు పైపులు, రాళ్లు, మట్టి వేసి తాత్కాలికంగా మరమ్మతులు చేసినా మళ్లీ వర్షాలకు కొట్టుకుపోయింది. ఇప్పటికే నాలుగైదుసార్లు కొట్టుకుపోవడంతో సమీపంలోని ఏటిగట్టుతండా దగ్గర పల్లపు ప్రాంతంలో వంతెన ఉండటంతో మద్దిలేరు ప్రవహించినప్పుడు 3–4 అడుగుల ఎత్తులో వెళ్లడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. వంతెన పూర్తయితే సుమారు 30 వేల మందికి ప్రయోజనం చేకూరుతుంది.

**నిధుల్లేక.. పనులు జరగక?**

మద్దిలేరు వాగుపై హై లెవల్ వంతెన నిర్మించేందుకు పంచాయతీరాజ్ అధికారులు ఏడాదిన్నర కిందట రూ.7.50 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. మలకవేములక్రాస్‌కు వెళ్లే రెండో వంతెన దగ్గర మరో వంతెన నిర్మించేందుకు రూ.4 కోట్లతో ప్రతిపాదించారు. నేటికీ నిధులు మంజూరు కాలేదు. రానున్న వర్షాకాలంలో మద్దిలేరు వాగు ప్రవహిస్తే మళ్లీ వంతెన కొట్టుకుపోయే ప్రమాదముంది. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు వాగుపై వంతెన నిర్మిస్తామని హామీలు ఇస్తున్నా.. అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వంతెన నిర్మించాలని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

**ప్రతిపాదనలు పంపాం..– రాజేంద్ర, పీఆర్ జేఈ, కదిరి**

మద్దిలేరు వాగుపై వాహనాల రాక పోకలకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాం. హై లెవల్ వంతెన నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. నిధులు మంజూరైతే పనులు చేపడతాం.

## వంతెన నిర్మాణానికి అడ్డంకులు తొలగేనా?



కణేకల్లు : దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందనంగా తయారైంది కణేకల్లు మండలంలోని వేదవతి హగరిపై ర.భ వంతెన నిర్మాణ పరిస్థితి. కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని రూ.48 కోట్లు మంజూరు చేసినప్పటికీ పనుల ప్రారంభంలో అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. శ్రీరామిరెడ్డి తాగునీటి పైపులైనుతోపాటు అటవీశాఖ అనుమతులు ప్రధాన అడ్డంకిగా తయారయ్యాయి. దీంతో పనుల ప్రారంభంలో ఎడతెగని జాప్యం నెలకొని రాకపోకలకు ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం** 60 ఏళ్ల కిందట నిర్మించిన హెచ్చెల్సీ వంతెన శిథిలావస్థకు చేరడంతో గత ఐదేళ్లుగా వేదవతి హగరిపై రాకపోకలు నిలిచిపోయాయి. ప్రత్యామ్నా యంగా వంతెన నిర్మించాల్సి ఉన్నా గత ప్రభుత్వం నిధుల మంజూరులో నిర్లక్ష్యం ప్రదర్శించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సహకారంతో నిధుల మంజూరుకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కృషి చేశారు. గతేడాది అక్టోబరులో పనులకు శంకుస్థాపన చేశారు.

**అలైన్‌మెంటు ఖరారులో అనిశ్చితి**

ఇటీవల క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించేందుకు వచ్చిన గుత్తేదారులు వంతెన నిర్మించే ప్రదేశంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పైపులైను ఉన్నట్లు గుర్తించారు. 140 గ్రామాలకు తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందని గ్రహించి అలైన్‌మెంట్ మార్చే యత్నం చేసినప్పటికీ అస్తవ్యస్తంగా వేసిన పైపులైనుతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. దీంతో మరో అలైన్‌మెంటు ఖరారుకు ర.భ అధికారులు సిద్ధమవుతుండగా వేదవతి హగరిలో తమ భూములు ఉన్నాయని అటవీశాఖ అభ్యంతరం చెప్పడంతో పనుల ప్రారంభంలో అనిశ్చితి నెలకొంది. దీనికి తోడు 50సెంట్ల మేర పట్టా భూములు ఉండటంతో భూసేకరణ, పరిహారం చెల్లింపునకు నిధుల అవసరంపై అధికారులు అలైన్‌మెంటు మార్పు, ఖరారులో మల్లగుల్లాలు పడుతున్నారు. చివరగా ప్రతిపాదించిన అలైన్‌మెంటు ఖరారుకు సిద్ధమైతే అటవీశాఖ అనుమతుల మంజూరుకు ఎదురు చూడాల్సిన దుస్థితి తలెత్తుతోంది. అడ్డంకులు అధిగమించి సత్వరమే పనుల ప్రారంభానికి అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **ప్రభుత్వానికి ప్రతిపాదించాం – రవిశంకరరెడ్డి, ర.భ డీఈ**వంతెన నిర్మించే ప్రాంతంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పైపులైను అడ్డుగా రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో సర్వే చేసి ప్రత్యామ్నాయంగా మరో రెండు అలైన్‌మెంట్‌లు సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదించాం. అనుమతుల మంజూరు మేరకు క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతాం.

## అడవిలో ఏం జరుగుతోంది..?

కుప్పం : ఒకప్పుడు పచ్చని మొక్కల పెంపకంలో ఆదర్శంగా ఉన్న కార్తీవనాన్ని వైకాపా హయాంలో నగరవనంగా మార్చేశారు. పర్యాటక కేంద్రం పేరుతో రూ.1.40 కోట్లను ప్రభుత్వం నుంచి తెప్పించుకున్నారు. అడవిలోని చెట్లను మాయం చేసి చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకునేందుకు అరకొరగా ఆట వస్తువులు అమర్చారు. ఇలా.. కుప్పం మండలం నడుమూరు అటవీ ప్రాంతంలో చిన్నచిన్న పనులు చేసి నిధులన్నీ ఖాళీ చేశారు. ఇదంతా వైకాపా హయాంలో జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అటవీశాఖ అధికారులు తాజాగా రూ.60 లక్షలు మంజూరు చేయించుకున్నారు. ఈ నిధులను వనసంరక్షణ సమితి సభ్యుల పర్యవేక్షణలో పారదర్శకంగా చేపట్టాల్సిన యంత్రాంగం గుత్తేదారుల అవతారమెత్తి సభ్యులకు తెలియకుండానే పనులు చేస్తున్నారు. మరో అడుగు ముందుకేసి అటవీ



అధికారులు రహస్యంగా ఖాళీ చెక్కులపై నడుమూరు వనసంరక్షణ సమితి ఛైర్మన్, వైస్ ఛైర్‌పర్సన్ సంతకాలు చేయించుకున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తోపాటు నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో అటవీశాఖ ఉన్నతాధికారులు విచారణకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా చిత్తూరు డీఎఫ్‌వో భరణి నగరవనం చేరుకుని ఇనుప కంచెను పరిశీలించి కొలతలు తీయించారు. అలాగే నగరవనంలో జరుగుతున్న పనులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు.

## పైసావసూల్..!

విశాఖపట్నం : నగరంలో జనన, మరణ ధ్రువపత్రాలు పొందేందుకు జీవీఎంసీ సిబ్బంది చేతికి పైసలు ఇవ్వక తప్పడం లేదు. డబ్బు లేకుండా ప్రక్రియ ఒక్క అడుగు ముందుకెళ్లే పరిస్థితి లేదు. ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియను పొరుగు సేవల ఉద్యోగులు, సిబ్బందికి అప్పగించారు. తెర వెనుక వాటాలు పంచుకుంటున్న కొందరు అధికారులు తమ చేతికి మట్టి అంటకుండా వ్యవహరిస్తున్నారు.

**వేలల్లో బేరం:** ఇటీవల ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ప్రమాదవశాత్తు మృతి చెందగా, ఆయన కుటుంబీకులు మరణ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేశారు. రూ.50 వేలు ఇస్తేనే, ధ్రువీకరణ పత్రం జారీ చేస్తామని జోన్–5 కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు పొరుగు సేవల ఉద్యోగులు డిమాండ్ చేశారు. చివరకు రూ.40 వేలకు బేరం కుదరగా, రూ.20 వేలు తీసుకుంటూ 'అనిశా'కు చిక్కారు. అయితే డబ్బులు ఇవ్వడం ఇష్టం లేని బాధితులు 'అనిశా'ను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం బయటకు వచ్చింది. కానీ, రోజూ జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఇవ్వాల్సి వస్తోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**విచారణ పేరుతో జాప్యం:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే జనన, మరణాలకు అక్కడే ధ్రువీకరణ పత్రాలు ఇస్తుంటారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో, ఇళ్ల వద్ద జరిగే జనన, మరణాల ధ్రువీకరణలకు



జీవీఎంసీని ఆశ్రయించాల్సిందే. ఎవరైనా చనిపోయినా, జన్మించినా... సంబంధిత వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇస్తే... విచారణ చేస్తారు. అలా విచారణ పేరిట చాలాచోట్ల జాప్యం జరుగుతోంది. అలాగే పత్రాల జారీకి డబ్బులు ఇవ్వకపోయినా.. వాయిదాలు వేస్తున్నారు. నిబంధనల ప్రకారం 15 రోజుల్లో ఇవ్వాల్సిన పత్రాలను 30 నుంచి 40 రోజుల వరకు తిప్పించుకుని... ఆ తర్వాత ఇస్తున్నారు.

**వారే కీలకం..!**

ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసే డేటా ఎంట్రీ ఆపరేటర్లు, పొరుగు సేవల్లో విధులు నిర్వహించే కొందరు ఉద్యోగులే బేరగాళ్లు. దరఖాస్తు చేయడానికి వచ్చిన వారితో నేరుగా చర్చలు జరిపి, ఎంత ఇవ్వాలో నిర్ణయించి.. వసూలు చేస్తుంటారు. ఆ విభాగంలో ఒకేచోట 12 ఏళ్లకుపైగా విధులు నిర్వహిస్తున్న వారు ఉన్నారంటే...వారికి పైఅధికారుల మద్దతు ఏస్థాయిలో ఉందో తెలుస్తుంది. ఇప్పటికైనా ఆ విభాగాన్ని ప్రక్షాళన చేసి, పత్రాల జారీ త్వరితగతిన జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

**బదిలీ చేస్తాం..:** జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరులో కొందరు పొరుగు సేవల ఉద్యోగులపై ఆరోపణలు వస్తున్నాయి. వారిని బదిలీ చేయడానికి దస్త్రాన్ని సిద్ధం చేస్తున్నాం. ప్రస్తుతానికి డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఇతర విభాగాలకు బదిలీ చేస్తాం. దశల వారీగా సహాయకులకు స్థానచలనం కల్పిస్తాం.

డాక్టర్ నరేష్‌కుమార్, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి

## ఇంతులు.. రుణ కాంతులు

డోన్ : మహిళల ఆర్థిక స్వావలంబనకు ఏటా రూ.కోట్ల రుణాలు చెల్లిస్తున్నారు. సంఘంలో సభ్యులకు తెలియకుండా అధ్యక్షురాళ్లు నొక్కేస్తున్నారు. గత ఐదేళ్ల వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలు పెత్తనం చేశారు. బోగస్ సంఘాలు సృష్టించి నిధులు పక్కదారి పట్టించారు. అక్రమాలకు చెక్ పెట్టేందుకు 'కూటమి' ప్రభుత్వం యత్నిస్తోంది. నగదు రహిత సేవలకు ప్రాధాన్యం ఇస్తోంది.. ఇందులో భాగంగా స్త్రీనిధి పేమెంట్ యాప్‌ను తీసుకొస్తున్నారు. ఈనెల చివరిలోపు ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని వెలుగు సిబ్బంది చెబుతున్నారు. ప్లేస్టోర్‌లోకి వెళ్లి యాప్‌ను డౌన్‌లోడు చేసుకొని సభ్యురాలి ఫోన్ నంబరుతో పాటు సంఘం పేరు, ఇతర వివరాలను నమోదు చేసుకోవాలి. తర్వాత వన్‌టైం పాస్‌వర్డ్ ఎంటర్ చేయాలి. తీసుకున్న రుణానికి సంబంధించి నెలవారీ వాయిదాలు ఆన్‌లైన్‌లో చెల్లించొచ్చు.. దీనివల్ల అక్రమాలకు తావుండదని వెలుగు కార్యాలయాల అధికారులు చెబుతున్నారు. ఒక్కో సంఘానికి గరిష్ఠంగా రూ.5 లక్షలు

మహిళా సంఘాలకు స్త్రీనిధి క్రెడిట్ కో–ఆపరేటీవ్ ఫెడరేషన్ ద్వారా ఏటా రుణాలు ఇస్తున్నారు. ఒక్కో సంఘానికి షార్ట్‌టర్మ్ రుణం రూ.20 వేలు, మైక్రో రుణం రూ.50 వేలు, టినీరుణం రూ.లక్ష చొప్పున సభ్యులు పొందొచ్చు. ఒక్కో సంఘం గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు రుణాన్ని తీసుకోవచ్చు.సంఘానికి రుణాన్ని జమచేసిన తర్వాత వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు నగదు జమ చేస్తారు. రూ.50 వేల రుణాన్ని రెండేళ్ల లోపు, రూ.లక్ష రుణాన్ని మూడేళ్ల లోపు చెల్లించొచ్చు. 11 శాతం (90పైసలు) వడ్డీ వసూలు చేస్తారు. రానున్న రోజుల్లో దివ్యాంగులకు, ట్రాన్స్‌జెండర్లకు అతి తక్కువ వడ్డీతో వారి జీవనోపాధుల మెరుగుకు స్త్రీనిధి రుణాలు ఇవ్వనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

# బాల శాస్త్రజ్ఞుల బడి

నర్సీపట్నం : ఆ బడి బాల శాస్త్రజ్ఞులకు చిరునామాగా మారింది. నూతన ఆవిష్కరణలకు వేదికగా నిలిచి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నర్సీపట్నం మండలం చెట్టుపల్లిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఇన్‌స్పైర్ మనక్ అవార్డులు అందుకోవడంలో ముందంజలో ఉంటోంది. తాజాగా ఇందులోని ఓ విద్యార్థి క్యూఆర్ కోడ్‌తో ఇంటి అద్దె బోర్డును రూపొందించడం అందరిని ఆశ్చర్యపరిచి ంది. నిత్య జీవితంలో చుట్టూ కనిపించే వాటినే సాంకేతిక సాయంతో మరింత మెరుగ్గా వినియోగించుకునేలా విద్యార్థులు నమూనాలు రూపొందిస్తున్నారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎ.వి.రాజగోపాల్ ప్రోత్సాహంతో వీరంతా ఈ సైన్స్ ప్రయోగాల్లో రాణిస్తున్నారు. సాధారణ విషయాలనే అద్భుతం అనిపించేలా వీరి తయారు చేసిన కొన్ని నమూనాల వివరాలు ఇవి.

**సోలార్‌తో కాఫీలో నాణ్యత**

అంతర్జాతీయ ఖ్యాతిని సొంతం చేసుకున్న మన్యంలోని కాఫీ గింజల శుద్ధికి ముందుగా వాటిని యార్డుల్లో ఆరబెడుతుంటారు. సోలార్‌తో వీటిని త్వరితగతిన ఎండబెట్టవచ్చని తొమ్మిదో తరగతి విద్యార్థిని అమృతవర్షిణి తయారు చేసిన నమూనా జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. దీని ద్వారా కాఫీలో నాణ్యత పెరుగుతుందని సూచించింది. అధికారులు సైతం ఈ ప్రయోగం పట్ల ఆకర్షితులవడం విశేషం.

**స్మార్ట్ బడి గంట**

పాఠశాలల్లోని సాధారణ బడి గంటను 8వ తరగతి విద్యార్థి కె.మహేంద్ర స్మార్ట్ బెల్‌గా రూపొందించి పురస్కారాన్ని అందుకున్నాడు. బడిలోని అంతర్జాలం సాయంతో ఫోను ద్వారానే సమయానికి గంట మోగేలా దీనిని తయారు చేశాడు. ఎలక్ట్రిక్ గంట, స్మార్ట్ స్విచ్‌లను అంతర్జాలానికి




అనుసంధానించడంతో ఇది ఓ కొత్త ఆవిష్కరణగా అందరి ప్రశంసలందుకుంది.

**చింతపిక్క బటన్లు**

ప్లాస్టిక్ నిషేధానికి చిన్న చిన్న ప్రయత్నాలు ఎంతో ప్రయోజనాన్ని చేకూరుతాయని 8వ తరగతి విద్యార్థిని వెలంకాయల సాయి శివాని తన ప్రయోగంతో నిరూపించింది. చొక్కాలు, దుస్తులకు ప్లాస్టిక్ గుండీలనే వినియోగిస్తారు. ప్లాస్టిక్ వీలైనంత తక్కువగా వాడటం అందరికీ మంచిది. ఇదే ఉద్దేశంతో ఈ విద్యార్థిని చింతపిక్కను కాస్త అరగదీసి నలుపు రంగు లేకుండా చేసి బటన్లుగా వాడుకునేలా తయారు చేసిన నమూనా అందరినీ ఔరా నిపించింది.

విద్యార్థుల్లో ప్రేరణకు కృషి..: ప్రయోగాలు చేసేలా విద్యార్థుల్లో ప్రేరణ కల్పించేలా అన్నివిధాలా కృషి చేస్తున్నాం. గతంలో చీడిగుమ్మల, ఇప్పుడు చెట్టుపల్లి ఉన్నత పాఠశాలలో కలిపి మొత్తం 13 సైన్స్ ప్రాజెక్టులకు నేను గైడుగా వ్యవహరించాను. చీడిగుమ్మలలో ఎనిమిది, చెట్టుపల్లిలో 5 చొప్పున వీటిని రూపొందించిన విద్యార్థులకు పురస్కారాలు దక్కాయి. వీటిల్లో ఏడు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. పదో తరగతి విద్యార్థిని కృష్ణవేణి రూపొందించిన సోలార్ పవర్ ట్రీ ప్రాజెక్టు జాతీయ స్థాయికి అర్హత సాధించింది. విద్యార్థికి కొందరైనా శాస్త్రజ్ఞులు కాగలిగితే ఉపాధ్యాయ వృత్తికి సార్థకత లభిస్తుంది.

ఎ.వి. రాజగోపాల్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, చెట్టుపల్లి

# కిడ్నీ వ్యాధి కబళిస్తోంది

అనకాపల్లి : జిల్లాలో కిడ్నీ రోగుల సంఖ్య పెరుగుతోంది. మారుతున్న ఆహారపు అలవాట్లు, వాతావరణం, నీటి కాలుష్యం, చెడు అలవాట్లతో ఈ రోగులు పెరుగుతున్నారు. చిన్నవయస్సుల వారికీ కిడ్నీలు పాడవుతుండడం అందరిలోనూ ఆందోళనలు రేకెత్తిస్తోంది. ఈనెల 13న ప్రపంచ కిడ్నీ దినం సందర్భంగా జిల్లాలోని పరిస్థితిపై కథనం..జిల్లాలో కిడ్నీ వ్యాధి పెరుగుతుండడంతో చికిత్స అందించడాని కి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. అనకాపల్లి మండలం మామిడిపా లెంలో కిడ్నీ బాధితులు పెరుగుతున్నారని కలెక్టర్‌కు స్థానికులు వినతిపత్రం అందజేశారు. దీంతో అక్కడ తనిఖీలు చేపట్టారు. నీటి పరీక్షలు చేశారు. ప్రభుత్వ పరంగా కిడ్నీ సంబంధిత వైద్యులతో వైద్య పరీక్షలు చేశారు. ఎంపీ సీఎం రమేశ్ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా కిడ్నీ వ్యాధి రక్తపరీక్షలను చేపట్టారు. ఇక్కడ ఈ వ్యాధిగ్రస్థులు ఎక్కువగానే ఉన్నారని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. నర్సీపట్నంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుచేయగా అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో త్వరలో అందుబాటులోకి తేనున్నారు. నొప్పి నివారణ మాత్రలు ఎక్కువగా వాడిన వారికి, మద్యం, సిగరెట్ అలవాట్లు, మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం, వాతావరణం, నీటి కాలుష్యం వల్ల వ్యాధి పెరుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.అనకాపల్లి మండలం మామిడిపాలెంలో ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధులకు సంబంధించి 1200 మందికి రక్త



పరీక్షలు చేయగా వీరిలో 277 మందికి సీఆర్ క్రియాటిన్‌లో తేడా ఉన్నట్లు గుర్తించారు.అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రికి 25 ఏళ్ల వయస్సు ఉన్న యువకుడు చికిత్సకు వచ్చాడు. కాళ్లు పొంగుతున్నాయని చెప్పడంతో పరీక్ష చేయగా కిడ్నీ వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. మద్యం ఎక్కువగా తాగడం వల్ల సమస్య వచ్చినట్లు వైద్యులు గుర్తించారు.రాంబిల్లికి చెందిన వ్యక్తికి ఆయాసం ఎక్కువగా వస్తుండడంతో అనకాపల్లి ఆసుపత్రిలో చూపించగా కిడ్నీకి ఇన్‌ఫెక్షన్ సోకినట్లు గుర్తించి మందులు వాడాలని సూచించారు. అనకాపల్లి మండలం సత్యనారాయణపురానికి చెందిన యువకుడు డయాలసిస్ చేయించుకుంటూ ఇటీవలే మృతిచెందాడు.జిల్లాలోని నర్సీపట్నంలోని డయాలసిస్ యూనిట్‌లో నెలకు 170 మంది రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. గత రెండేళ్ల నుంచి రోగుల సంఖ్య పెరిగింది.

త్వరలోనే డయాలసిస్ సెంటర్

అనకాపల్లిలో డయాలసిస్ సెంటర్ త్వరలోనే అందుబాటులోకి రానుంది.కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. దీన్ని సకాలంలో గుర్తించాలి. వ్యాధి నిర్ధారణ జరిగితే మందులు అందుబాటులో ఉన్నాయి. అనుమానం ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలి. ఉచితంగా మందులతో పాటు, చికిత్సను అందిస్తాం. ఇది వరకు వృద్ధులకు ఈ వ్యాధులు వచ్చేవి. ఇప్పుడు మారుతున్న ఆహారపు అలవాట్లు, పెరుగుతున్న కాలుష్యంతో చిన్న వయసుల వారికీ వస్తుంది. సకాలంలో గుర్తించి పరీక్ష చేయించుని వైద్యం పొందితే ఫలితం ఉంటుంది.

డాక్టర్ శ్రీనివాసరావు, డీసీహెచ్ఎస్, అనకాపల్లి

# సొంతింటి కల నెరవేరేలా..



తిరుపతి : అర్హులందరూ 2029 నాటికి సొంతిల్లు కలిగి ఉండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష అనుగుణంగా పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అర్హులందరూ గృహం నిర్మించుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. వైకాపా హయాంలో మంజూరైన ఇళ్లకు కూడా అదనంగా ఆర్థికసాయం అందించాలని నిర్ణయించడంతో అర్ధాంతరంగా ఆపేసిన గృహ నిర్మాణాల్లో కదలిక రానుంది. పనులు మొదలుపెట్టని పేదలు సైతం ముందుకొచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. 2014- 19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు కట్టుకునే లబ్ధిదారుడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.2 లక్షలు- రూ.2.50 లక్షల వరకు సాయం అందింది. వైకాపా అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ ఇంటి పట్టాలు ఇస్తామని ప్రకటించారు. 2024 నాటికి రాష్ట్రంలోని పేదలందరికీ ఓ గూడు ఉండేలా చర్యలు తీసుకుంటామని నాటి ముఖ్యమంత్రి జగన్ చెప్పారు. 2020 డిసెంబరులో లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేశారుకొండల్లో పట్టాలు.. నామమాత్రపు సాయం

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అత్యధిక శాతం స్థలాలు కొండలు, గుట్టల్లో చూపారు. అప్పట్లో సామూహిక శంకుస్థాపనలు నిర్వహించిన సమయంలోనే పేదల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు పునాదులకే ఖర్చవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని కేంద్రమే అందించగా.. జగన్ సర్కార్ అదనంగా ఒక్క రూపాయీ ఇచ్చేందుకు ససేమిరా అంది. గృహ నిర్మాణ సంస్థ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల ఒత్తిడితో అప్పుడు పనులు మొదలుపెట్టారు. తర్వాత ఎక్కువ శాతం మంది స్థలాల వైపు కన్నెత్తి చూడలేదు.

**రెండు జిల్లాల్లో 38,750 మందికి లబ్ధి**

కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తగా లక్ష్యాలను నిర్దేశించుకుంది. ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తామని అధికారులు చెప్పినా నిర్మాణ వ్యయం తక్కువగా ఉందని లబ్ధిదారులు గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఈ క్రమంలోనే బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు అదనంగా రూ.75 వేలు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కలిపి 38,750 మందికి లబ్ధి కలుగుతుందని గృహ నిర్మాణ సంస్థ అధికారులు అంచనా వేస్తున్నారు. దాదాపు రూ.198.95 కోట్లు సర్కార్‌పై భారం పడుతుంది. రెండు జిల్లాల్లో ఇంకా 10,953 మంది ఇంటి నిర్మాణాలు మొదలుపెట్టలేదు. వీరు కూడా ప్రారంభిస్తే వ్యయం మరింత పెరుగుతుంది.

**నెలాఖరుకు 20,664 పూర్తి చేయాలని..**

ఈ నెలాఖరుకు 20,664 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండు జిల్లాల్లో గతనెలాఖరుకు 1,827 ఇళ్ల నిర్మాణాలే జరిగాయి. 18,837 పూర్తవ్వాలంటే కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం అదనపు సాయం ప్రకటిస్తుండటంతో మే లేదా జూన్ చివరకు లక్ష్యం చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు.

గృహ నిర్మాణాల పురోగతి ఇలా..

జిల్లాలో మంజూరైన ఇళ్లు: 77,701

పూర్తయిన ఇళ్లు: 49,976

మిగిలినవి: 27,725

# డీలర్ల దయ.. రైతు ప్రాప్తం



చిత్తూరు : హోల్‌సేల్ డీలర్లు దయ తలిస్తేనే జిల్లాలో రైతులకు యూరియా అందుతోంది. లేకుంటే అందేది అంతంత మాత్రమే. రైతన్న పడరాని పాట్లు పడాల్సిందే. అన్నదాతల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు హోల్‌సేల్ డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. తమ కష్టాన్ని దోచేస్తున్నారంటూ రైతులు ఆరోపిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన వ్యవసాయ శాఖ ప్రేక్షక పాత్ర పోషిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.జిల్లాలో గతేడాది నవంబరు, డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. దీంతో రబీ సీజన్ ఆశాజనకంగా ఉండటంతో వరి, కూరగాయలు, ఇతర పంటలు విస్తారంగా సాగయ్యాయి. యూరియా వినియోగం మరింతగా పెరిగింది.

**అంతా మా ఇష్టం**

యూరియా విక్రయాల్లో కొందరు హోల్‌సేల్ డీలర్లు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. వీరి వద్దకు వచ్చిన సరకును రిటైల్ డీలర్లు, ప్రాథమిక పరపతి సంఘాలకు అందజేయాల్సి ఉండగా.. అలా చేయడం లేదు. తమ వద్దే నిల్వ చేసుకుని కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఈ క్రమంలో చిత్తూరులోని కొందరు బహిరంగంగా యూరియా బస్తా రూ.330-330 వరకు విక్రయిస్తున్నారు. దుకాణం ఎదుట కనీసం ధరల పట్టిక, నిల్వ వివరాలు తెలిపే బోర్డే ఉండదు. అధిక ధర గురించి ప్రశ్నిస్తే.. చెప్పిన ధరకు తీసుకోవాలనీ.. అంత ఇవ్వకుంటే తమ వద్ద యూరియా లేదని చెబుతున్నారు.

జిల్లాలో సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)

రబీ సాధారణ సాగు: 23,334

సాగైన విస్తీర్ణం: 24,693

రబీ సీజన్‌కు చేరిన యూరియా: 16,100 టన్నులు

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

నిర్ణీత ధర కన్నా అధిక ధరకు యూరియా విక్రయించకూడదు. కృత్రిమ కొరత సృష్టించినట్లు మా దృష్టికి వస్తే తక్షణమే సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకుంటాం.మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

# విజయ 'వికాస' మన్యం

విజయనగరం: శరవేగంగా ప్రగతి పథంలో దూసుకెళ్లేందుకు అనువైన వనరులు ఉన్న నగరాలను 'గ్రోత్ హబ్'లుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు దేశంలో ఎంపిక చేసిన నాలుగు మహా నగరాల్లో విశాఖ ఒకటి. ఇందులో విలీనం చేసిన ఎనిమిది జిల్లాల్లో పార్వతీపురం మన్యం, విజయనగరానికి చోటు కల్పించారు.వికసిత్ భారత్ లక్ష్యంగా నగరాల విస్తరణ, అభివృద్ధి, నీటి సరఫరా, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' పేరుతో కేంద్రం తాజా బడ్జెట్‌లో రూ.లక్ష కోట్ల నిధిని ఏర్పాటు చేసింది. ఇందులో ఈ వార్షిక సంవత్సరంలో రూ.10 వేల కోట్ల కేటాయింపునకు ప్రతిపాదించింది. జిల్లాల వారీగా కలెక్టర్లు సిద్ధం చేసిన అభివృద్ధి ప్రణాళికల ముసాయిదాలపై అంశాల వారీగా నీతి ఆయోగ్ అధికారులు ఇటీవల కలెక్టర్లతో దృశ్య శ్రవణ సమావేశం నిర్వహించారు. ఏయే అంశాలపై దృష్టి సారిస్తే ప్రగతి సాధ్యమనే విషయమై మార్గనిర్దేశం చేశారు. విజయనగరం జిల్లా స్థూల దేశీయ ఉత్పత్తి రూ.33,709 కోట్లు. జిల్లా తలసరి ఆదాయం రూ.1,42,262. 'గ్రోత్ హబ్' వల్ల స్థూల జాతీయ ఉత్పత్తిలో ఏటా 15 శాతం జిల్లా ప్రగతి సాధనతో పేదరికం నిర్మూలన జరుగుతుందని.. ప్రగతి పథంలో పయనిస్తుందని భావిస్తున్నారు.

ప్రస్తుతం సర్వీసు సెక్టారులో 45 శాతం, వ్యవసాయ, దాని అనుబంధ రంగాల్లో 31 శాతం, పారిశ్రామిక రంగంలో 24 శాతం వృద్ధి నమోదవుతోంది. దీన్ని శరవేగంగా ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉందని జిల్లా అధికార యంత్రాంగం భావిస్తోంది.

వ్యవసాయ, పశు సంపద, భవన నిర్మాణ, స్థిరాస్తి, ఇతర రంగాల్లో దృష్టి సారిస్తే ప్రగతి పరుగు తీస్తుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. చిరు ధాన్యాలు సాగు, ప్రకృతి సేద్యంలో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.తయారీ, పారిశ్రామిక రంగాల వృద్ధికి అవకాశం ఉంది. ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు రూపొందించిన ప్రణాళికలు అమలైతే ప్రతి ఇంటి నుంచి కనీసం ఒకరు ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా ఎదుగుతారు.భోగాపురం విమానాశ్రయం ద్వారా రవాణా, లాజిస్టిక్స్, కార్గో సేవలతో పాటు స్థిరాస్తి రంగం, పర్యాటక రంగాలు పురోగతి దిశగా పయనిస్తాయి.విద్య, పర్యాటకం, వ్యవసాయాధారిత పరిశ్రమలు, త్వరలో పూర్తికానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా ఎగుమతులు, దిగుమతుల కార్యకలాపాలు ఆర్థిక ప్రగతికి దోహదపడతాయి. ఉద్యాన పంటల ఉత్పత్తితో మామిడి తాండ్ర, జీపప్పు, చిరుధాన్యాల శుద్ధీకరణ, పామాయిల్ ఉత్పత్తి యూనిట్లు నెలకొల్పేందుకు అడుగులు పడుతున్నాయి. రోడ్డు, రైలు మార్గాలు అందుబాటులో ఉండటంతో సేవా రంగం ప్రగతి పుంతలు తొక్కే అవకాశం ఉంది. విజయనగరం వైద్య కళాశాల భవనాల నిర్మాణం పూర్తయితే విద్యా రంగంలో అనుబంధ కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంది. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం సొంత భవనాల్లో మరో ఏడాదిలో అందుబాటులోకి వస్తుంది.

# మియవాకి.. హుష్ కాకి

గాజువాక : నగరాల్లో కాలుష్య నివారణలో భాగంగా జపనీస్ తరహా 'మియవాకి' ఉద్యానవనాలకు చాలాచోట్ల శ్రీకారం చుట్టారు. ఈ తరహా ప్రయోగం వల్ల కొన్ని కోట్ల చక్కగా చెట్లు పెరిగి ఆహ్లాదం పంచుతుండగా.. మరికొన్ని చోట్ల వాటి నిర్వహణలేక ఎండిపోయి బీడు భూములుగా మారాయి.గాజువాక కణితిరోడ్డు నుంచి వుడాకాలనీని కలుపుతూ గోపాలరెడ్డినగర్ వరకూ 1.06 కి.మీ. పొడవైన 130 అడుగుల రోడ్డును 2017లో నాటి వుడా అధికారులు అభివృద్ధి చేశారు. రెండువైపులా 50 అడుగుల చొప్పున రోడ్లను వదిలేసి మధ్యలో 30 అడుగుల స్థలం పార్కులకు కేటాయించారు. ఈ దారి పొడవునా మొత్తం 9 పార్కులు (బ్లాకలు) ఉన్నాయి. జీవీఎంసీ ఉద్యాన విభాగం గోపాల్‌రెడ్డినగర్ వద్ద 2022లో మియావాకి తరహాలో చిట్టడివిని



పెంచాలని నిర్ణయించి ఒక బ్లాకులో (మీడియం) 2వేల వేప, కానుగ, చైనాబాదం, మర్రి, రావి, వివిధ పూల జాతుల మొక్కలను నాటారు. అయితే కొన్ని మొక్కలు పెరిగి వృక్షాలుగా మారినా అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. ఓ స్థాయి మొక్కలన్నీ ఎండిపోయాయి. పెరిగిన మొక్కల్లో కూడా పచ్చదనం కరవై మోడుగా మారాయి.

**ఇప్పుడు హడావుడి:** ఇన్నాళ్లు నిర్లక్ష్యం వహించిన వీఎంఆర్‌డీఏ అధికారులు దీన్ని అభివృద్ధి చేస్తామంటూ హడావుడిగా యంత్రాల సాయంతో సెంటర్ మీడియం పార్కుల్లో మొక్కలు, పెద్దచెట్లను కూకటి వేళ్లతో పెకలిస్తున్నారు. మళ్లీ మొక్కలు నాటుతామంటూ చెప్తున్నారు. దీనిపై జోనల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రిని సంప్రదిస్తే.. పార్కుల్లో కొత్తగా మొక్కలు నాటే కార్యక్రమం ఉందన్నారు. ఉన్న మొక్కలు తొలగించవద్దని చెప్పామన్నారు. అయితే సెంటర్ మీడియం పార్కులు వి.ఎం.ఆర్.డి.ఎ. పరిధిలో ఉన్నాయన్నారు.

# పూడికతీత మాటున దందా


గూడూరు : వైకాపా హయాంలో కోట మండలం గూడలి స్వర్ణముఖి నదిలో ఇసుక రీచ్ ఏర్పాటు చేసి లక్షల టన్నుల ఇసుక పక్కదారి పట్టించారు.. కూటమి ప్రభుత్వం వచ్చాకా దందా మరో రూపంలో కొనసాగుతోంది. పూడికతీత పనుల ఒప్పందం జరగక ముందు నుంచే రెండు నెలలుగా గుత్తేదారు అధికారుల అండతో రేయింబవళ్లు భారీ యంత్రాలతో ఇసుక తవ్వి టిప్పర్లలో తరలిస్తున్నారు. దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్వర్ణముఖి నదిలో ప్రస్తుతం ఎలాంటి ఇసుక దిబ్బలు లేవు. కానీ జల వనరుల శాఖ అధికారులు ఉన్నాయంటూ అంచనాలు వేసి.. పూడికతీత చేపడితే నీటి ప్రవాహం సాఫీగా జరుగుతుందని నాలుగు నెలల కిందట టెండర్లు పిలిచారు. గుత్తేదారు ఈ నెల 5 నుంచి మూడు నెలల పాటు నదిలో కూలీల సాయంతో



పూడికతీత పనులు చేపట్టేలా ఒప్పందం చేశారు. మొత్తం 55 వేల టన్నుల ఇసుకను పూడిక తీయాలని జలవనరుల శాఖ అధికారులు నిర్ణయించారు. దీనికి రెండు నెలల ముందుగానే మూడు పెద్ద యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపట్టారు. యంత్రాలతో తవ్వుతుంటే నీటి ఊట ఏర్పడుతోంది. ఒప్పందం ప్రకారం కూలీలతో జరగాల్సిన పనిని యంత్రాలతో చేస్తున్నా.. రెవెన్యూ, జల వనరుల, గనుల శాఖ, పోలీసులు పట్టించుకోవడం లేదు. ఇలా రోజుకు తవ్వి తరలిస్తున్న ఇసుక విలువ రూ.10 లక్షల పైమాటే. ఈ విషయమై గూడూరు జల వనరుల శాఖ ఈఈ శ్రీనివాసరావును వివరణ కోరగా.. నదిలో ఏఈ, సిబ్బందితో పర్యవేక్షిస్తామని తెలిపారు.

# గజాల్లో కోత..ఇదేం కథ!!

విశాఖపట్నం: విశాఖ మహా ప్రాంత అభివృద్ధి సంస్థ మధ్య తరగతి ప్రజల (ఎంఐజీ) కోసం ఏర్పాటు చేసిన కొన్ని లేఅవుట్లలో ప్లాట్లు విస్తీర్ణం తగ్గిస్తున్నారు. విజయనగరం జిల్లా రఘుమండలో 150, 200 గజాల స్థలాలు కొన్న వారికి అయిదారు గజాలు తగ్గించి ఇస్తున్నారు. గజం రూ.6,500లకు కొన్నామని, ఆ మేరకు నష్టపోతున్నట్లు ఓ కొనుగోలుదారు పేర్కొన్నారు. జిల్లాలోని రఘుమండ, జియ్యమ్మవలస, గరివిడి, భోగాపురం వద్ద వీఎంఆర్‌డీఏ ఎంఐజీ లేఅవుట్లు వేసింది. వీటిల్లో పావుశాతమైనా అమ్ముడవ్వలేదు. అన్నింటిలో భూగర్భ కాలువలు, రోడ్లు, విద్యుత్తు సౌకర్యం, పార్కులు అభివృద్ధి చేయాలి. ఇందుకు రూ.150 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే రోడ్లు, కాలువలు నిర్మించి వదిలేశారు. రఘుమండ లేఅవుట్



దారుణంగా ఉంది. మెరక చేసే పనులు సాగలేదు. ఇటీవల వర్షాలకు నీరు చేరి చెరువును తలపిస్తున్నాయి. ఈ ఒక్క లేఅవుట్‌లోనే 80 శాతం ప్లాట్లు అమ్ముడయ్యాయి. ఇక్కడ కూడా ఎత్తుగా చేసి అందుబాటులోకి తీసుకురాకుండా వదిలేయడంతో ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉద్యోగుల నిర్లక్ష్యం** ప్రైవేటు లేఅవుట్ల నిర్వాహకులు వారి ప్లాట్ల విక్రయానికి అనేక రకాలుగా ప్రయత్నిస్తారు. వీఎంఆర్‌డీఏలో కొందరు ఉద్యోగులు ప్లాట్ల కోసం ఫోన్లు చేస్తే సరిగా స్పందించడం లేదంటున్నారు. మరొకరిని సంప్రదించాలని... వారికి చేస్తే మొదట చేసిన వారికే చేయాలని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. కనీసం దరఖాస్తు సమయంలో తలెత్తే సందేహాలూ ఎవరూ తీర్చడం లేదంటున్నారు. కార్యాలయానికి వెళ్లినా పట్టించుకోవడం లేదని, నిరీక్షింపచేస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. చాలా మంది ఉద్యోగుల వ్యవహారశైలితోనే కొనుగోలుకు విముఖత చూపుతున్నారంటున్నారు.

చురకలు



# గజాల్లో కోత.. ఇదేం కథ!!

విశాఖపట్నం : విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మధ్యతరగతి ప్రజల (ఎంఐజీ) కోసం ఏర్పాటు చేసిన కొన్ని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి చిక్కులు ఎదురవుతున్నాయి. పిల్లల చదువులకు, భవిష్యత్తు అవసరాలకు రూ.లక్షలు ఖర్చు చేసి ప్లాట్లు కొనుగోలు చేస్తే వీఎంఆర్‌డీఏ అధికారులు వాటి విస్తీర్ణం తగ్గించేస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. కొనుగోలు చేసిన ప్లాటు మొత్తంలో అయిదారు గజాలు కోతపెట్టి కేటాయిస్తున్నారు. విజయనగరం జిల్లా రఘుమండలో వీఎంఆర్‌డీఏ ఎంఐజీ లేఅవుట్ అభివృద్ధి చేసింది. ఇక్కడ పెద్ద సంఖ్యలో ప్లాట్లు విక్రయించగా.. కొద్ది రోజులుగా సర్వే చేసి కొనుగోలుదారులకు వాటిని కేటాయిస్తున్నారు. 150, 200 గజాల స్థలాలు కొనుగోలు చేసిన వారికి కొలతల సమయంలోనే అయిదారు గజాలు తగ్గించి అప్పగించడంపై విమర్శలు వస్తున్నాయి. గజం రూ.6,500లకు కొనుగోలు చేశామని, ఇప్పుడు ఆ మొత్తం నష్టపోతున్నట్లు ఓ కొనుగోలుదారు పేర్కొన్నారు. పలుమార్లు సంప్రదిస్తే తప్ప స్పందన ఉండడం లేదని మరొకరు ఆవేదన వ్యక్తం చేశారు.విజయనగరం జిల్లా రఘుమండ, జియ్యన్నవలస, గరివిడి, విశాఖ జిల్లా పాలవలస, అనకాపల్లి జిల్లా అడ్డూరు, భోగాపురం వద్ద వీఎంఆర్‌డీఏ ఎంఐజీ లేఅవుట్లు వేసింది. వీటిల్లో 1240 ప్లాట్లు



విక్రయానికి ఉంచగా పావుశాతమైనా అమ్ముడవ్వలేదు. చాలా లేఅవుట్లలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి.

అన్నింటిలో భూగర్భ కాలువలు, రోడ్లు, విద్యుత్తు సౌకర్యం, పార్కులు అభివృద్ధి చేయాలి. ఇందుకు రూ.150 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రస్తుతం అన్ని లేఅవుట్లలో రోడ్లు, కాలువలు నిర్మించి వదిలేశారు. ఆ తర్వాత చేయాల్సినవి ముందుకు సాగటం లేదు.

రఘుమండ లేఅవుట్ దారుణంగా ఉంది. మెరక చేసే పనులు సాగలేదు. ఇటీవల వర్షాలకు నీరు చేరి చెరువును తలపిస్తున్నాయి. ఈ ఒక్క లేఅవుట్‌లోనే 80 శాతం ప్లాట్లు అమ్ముడయ్యాయి. అటువంటి చోట కూడా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఎత్తుగా చేసి అందుబాటులోకి తీసుకురాకుండా వదిలేయడంతో అక్కడికి వెళ్లి చూసిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


**ఉద్యోగుల వ్యవహారశైలితో..**

ప్రైవేటు లేఅవుట్ల నిర్వాహకులు వారి ప్లాట్ల విక్రయానికి అనేక రకాలుగా ప్రయత్నిస్తారు. ఎలాగైనా అమ్ముడయ్యేలా ఉన్న వనరులను వివరించి మార్కెటింగ్ చేసుకుంటారు. విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) అలాంటి ప్రయత్నం కూడా చేయడం లేదు. ఎంఐజీ (మధ్యతరగతి ప్రజలు) కోసం వేసిన లేఅవుట్లలో ప్లాట్లు విక్రయించడంలో వీఎంఆర్‌డీఏ ఘోరంగా విఫలమవుతోంది. కొన్నింటికి అసలు స్పందనే లేదు. దీనంతటికీ కొందరు ఉద్యోగుల వ్యవహారశైలి కారణంగా కనిపిస్తోంది. ప్లాట్ల కోసం ఫోన్ చేస్తే సరిగా స్పందించడం లేదంటున్నారు. ఫోన్ చేస్తే మరొకరిని సంప్రదించాలని... వారికి చేస్తే మొదట చేసిన వారినే సంప్రదించాలని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. కనీసం దరఖాస్తు సమయంలో తలెత్తే సందేహాలూ ఎవరూ తీర్చడం లేదంటున్నారు. కార్యాలయానికి వెళ్లినా పట్టించుకోవడం లేదని, నిరీక్షింపచేస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. చాలా మంది ఉద్యోగుల వ్యవహారశైలితోనే కొనుగోలుకు విముఖత చూపుతున్నారంటున్నారు.

# ప్లాన్ పక్కా.. పనులన్నీ లెక్కే..!

విశాఖపట్నం: పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. వాటిని కచ్చితం గా అమలు చేయాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలు ఇచ్చారు. ప్లాన్ ప్రకారం నిర్మాణం చేపడితేనే నివాస యోగ్య ధ్రువీకరణ పత్రం (ఓసీ) ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. అలాగే ఓసీ ఉంటేనే వాణిజ్య భవనాలకు వ్యాపార అనుమతులు ఇవ్వాలని స్పష్టం చేశారు. **వారే సూత్రధారులు:** కొత్తగా వచ్చిన నిబంధనలన్నీ అమలు చేస్తే నగరంలో పెద్ద సంఖ్యలో భవనాలకు ఓసీలు వచ్చే అవకాశాలు ఉండవని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం విశాఖలో ఎక్కడికక్కడ వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు కొందరు జీవీఎంసీ పట్టణ ప్రణాళికాధికారులే సూత్రధారులుగా ఉంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ అక్రమ నిర్మాణాలు పూర్తయిన తర్వాత అధికారులే ఓసీ ఎలా ఇస్తారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అయితే ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిన నాటి నుంచి అమలు చేయాలనే ఆదేశాలు వస్తే, ప్రస్తుత నిర్మాణాలకు ఇబ్బంది ఉండకపోవ చ్చంటున్నారు..

**దశలోనైనా పరిశీలన:** ఆన్‌లైన్ ప్లాన్‌కు అనుమతులు వచ్చిన తర్వాత ప్రణాళికాధికారులు భవనం పూర్తయ్యేంత వరకు పరిశీలన చేయకూడదన్న నిబంధన తొలగించారు. దీంతో నగరంలో చేపడుతున్న నిర్మాణాలను ప్రణాళికాధికారులు ఎప్పటికప్పుడు పరిశీలన చేయడానికి వీలుంటుంది. తద్వారా నిర్మాణదారులు అదనపు అంతస్తులు వేసే అవకాశా లు ఉండవు.



ఒక వేళ అదనపు అంతస్తు నిర్మించినా, సంబంధిత అధికారే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రస్తుతం జీవీఎంసీలో ఉన్న సిబ్బందితో క్షేత్రస్థాయి పరిశీలన సాధ్యపడదు. కొత్తగా సిబ్బందిని నియమించుకోవడం, లేక..గతంలో ఉండే చైన్‌మెన్ వ్యవస్థను తిరిగి ప్రవేశపెట్టడం చేయాలి.

**కార్యదర్శులకు బాధ్యతలు**

నగర పరిధి నియోజకవర్గాల్లో వార్డు ప్రణాళిక కార్యదర్శులు ఉన్నారు. వారికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించే అవకాశాలపై అధికారులు చర్చిస్తున్నారు. నిర్మాణదారుడు ప్లాన్ కోసం దరఖాస్తు చేసినప్పుడు, ప్లాన్ ప్రకారమే పనులు చేపడతామని అంగీకారపత్రం తీసుకోవాల్సి ఉంటుంది. ప్లాన్ ప్రకారం నిర్మిస్తేనే నివాస ధ్రువీకరణ పత్రం మంజూరవుతుందన్న విషయంపై అధికారులే అవగాహన కల్పించాల్సి ఉంటుంది.నిబంధనలు ఉల్లంఘిస్తే విద్యుత్తు మీటర్ ఇవ్వొదంటూ ఏపీఈపీడీసీఎల్ అధికారులకు ఫిర్యాదు చేయాల్సి బాధ్యత ప్రణాళికాధికారులపైనే ఉంటుంది. ఇలా నూతన విధానంతో అన్ని నిర్మాణాలు ప్లాన్ ప్రకారమే ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

# వడివడిగా హంద్రీనీవా..



అనంతపురం: రాయలసీమ జీవనాడి హంద్రీనీవా పథకాన్ని పూర్తి చేసేందుకు కూటమి సర్కారు వేగంగా అడుగులు వేస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే పనులకు టెండర్లు ఖరారు చేసి గుత్తేదారు సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది. ఇటీవల బడ్జెట్‌లో రూ.3243 కోట్లు కేటాయించారు. ఫేజ్-1లో విస్తరణ, ఫేజ్-2లో లైనింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. మల్యాల నుంచి జీడిపల్లి వరకు విస్తరణలో భాగంగా కంపచెట్లు తొలగిచారు. రాప్తాడు, పుట్టపర్తి నియోజకవర్గాల పరిధిలో లైనింగ్ పనులు మొదలుపెట్టారు.

**తక్కువ రోజుల్లో ఎక్కువ నీరు**

శ్రీశైలంలో 810 అడుగుల వరకు 40 టీఎంసీల నీటిని తీసుకునే వెసులుబాటు ఉంది. ప్రధాన కాలువ విస్తరణకు నోచుకోకపోవడంతో పూర్తివాటాను తీసుకోవడానికి ఎక్కువ సమయం పడుతోంది.

విస్తరణ పూర్తయితే 120 రోజుల్లోనే 40 టీఎంసీలు తీసుకోవచ్చు. చిత్తూరుకు నీటిని ఇవ్వడంతో పాటు ఉమ్మడి అనంత జిల్లాకు సాగు, తాగునీటి అవసరాలను తీర్చుకునే వీలుంటుంది.

మడకశిర బ్రాంచి కాలువ, భవిష్యత్తులో చేపట్టబోయే జీడిపల్లి-పేరూరు, జీడిపల్లి-భైరవానితిప్ప ప్రాజెక్టులకు జలాలను మళ్లించవచ్చు. హంద్రీనీవా నుంచి పీఏబీఆర్‌కు నీటిని మళ్లించి ఉరవకొండ, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లోని 42 చెరువులను నింపవచ్చు. పీఏబీఆర్ నుంచి ఎంపీఆర్‌కు నీటిని తరలించి శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల అవసరాలను తీర్చడానికి మార్గం సుగమం కానుంది.

**లైనింగ్ కోసం..**

ఎక్కడి నుంచి ఎక్కడి వరకు: జీడిపలి నుంచి పుంగనూరు బ్రాంచి కెనాల్ ఆఫ్‌టేక్ దాకా

వ్యయం: రూ.936 కోట్లు

ప్యాకేజీలు: 5

ప్రస్తుతం: అవసరమైన యంత్రాలు, సామగ్రి సమకూర్చుకున్నారు. 64 పొక్లెయిన్లు పనిచేస్తున్నాయి.

కాలువ తీరు, పనులు ఇలా..

నంద్యాల జిల్లా మల్యాల నుంచి జీడిపల్లి వరకు ప్రధాన కాలువ: 216 కి.మీ.

విస్తరణకు వ్యయం చేయనుంది: రూ.696 కోట్లు

రెండు ప్యాకేజీలు : 0 నుంచి 88 కి.మీ వరకు ఒకటి.. మరొకటి 88-216 కి.మీ వరకు

ప్రస్తుతం పనులు: 37 పొక్లెయిన్‌లు పనిచేస్తున్నాయి. ప్రధాన కాలువలో అక్కడక్కడ నిలిచిపోయిన నీటిని తోడేస్తున్నారు. దారుల్ని వెడల్పు చేస్తున్నారు.జూన్‌లో పూర్తి చేయిస్తాం: రాజా స్వరూప్, ఎస్‌ఈ, హంద్రీనీవావచ్చే జూన్ 10 నాటికి పనుల్ని పూర్తిచేసి నీటి సరఫరా చేసేలా ప్రణాళిక రూపొందించాం. నిధుల సమస్య లేకపోవడంతో లక్ష్యాన్ని చేరుకుంటామనే ధీమాతో ఉన్నాం.

# వనితలు.. ఆరోగ్యమణులు!



పుట్టపర్తి : మనం తినే కాయగూరల్లో రసాయనిక ఎరువులు, పురుగు మందుల అవశేషాలు పుష్కలంగా ఉండటంతో ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నాయి. మరోపక్క మార్కెట్‌లో వాటి ధరలు కూడా మండిపోతున్నాయి. డబ్బులు పోసి అనారోగ్యం కొంటున్నామా..? అన్న ప్రశ్న కొందరు మహిళల మెదడులో మొలిచింది. అంతే పెరటి తోటల సాగుపై ఆసక్తి పెంచుకున్నారు. ఉన్న కాస్త స్థలంలో తమ ఇంటికి నిత్యం అవసరమయ్యే కాయగూరలను పండిస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో పండించిన వాటితో ఆరోగ్యం.. ఆదాయం పొందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పెరటి తోటలు సాగు చేస్తూ సత్ఫలితాలు పొందుతున్న మహిళలపై కథనం.

**పని ఒత్తిడి దూరం**

పుట్టపర్తిలోని చిన్నంపల్లి పాఠశాల వద్ద నివాసం ఉండే లలిత స్టాఫ్ నర్స్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నిత్యం పని ఒత్తిడితో ఉండే ఆమె పెరటి తోటకు అరగంట కేటాయిస్తే ఒత్తిడి మాయమవుతుందని భావించి తన ఇంటి ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో టమాటా, మిరప, వంకాయ, చిక్కుడు, గుమ్మడి, కొత్తిమీర, మెంతి, తోటకూర, అరటి, జామ, సీతాఫలం, బొప్పాయి చెట్లు పెంచారు. వాటిని ఇంటి అవసరాలకు ఉపయోగించడమేకాకుండా పొరుగింటి వారికి కూడా అందిస్తున్నారామె. 'పెరట్లో మనం పండించే కూరగాయలు, ఆకుకూరలు ఎప్పటికప్పుడు తాజాగా తెంచుకుని వడుకుని తింటే ఆరోగ్యానికి ఆరోగ్యం.. రుచికి రుచి ఉంటుంది. కాయగూరల ఖర్చు తగ్గుతుంది. పొరుగు వారికి కూడా వాటిని ఇస్తుంటే ఆ ఆనందమే వేరు.' అని లలిత పేర్కొంటున్నారు.

**ఆదాయం గడిస్తూ..**

కళ్యాణదుర్గం మండలం మల్లాపురం చెందిన ఎర్రమ్మ కూలీ పనులకు వెళ్తూనే తన ఇంటి ఆవరణలో ఖాళీగా ఉన్న సెంటు స్థలంలో బొప్పాయి, కొబ్బరి, నిమ్మ, మునగ, గులాబీ, కనకాంబరాలు, మల్లె, ఆకుకూరలు, కూరగాయలు మొక్కలు పెచుతున్నారు. రోజు విడిచి రోజు కాయగూరలను కోసి.. కుటుంబ అవసరాలకు వినియోగిస్తున్నారు. మిగిలినవి ఇరుగుపొరుగు వారికి విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. పెరటి తోటతో ఆదాయం వస్తోందని ఎర్రమ్మ పేర్కొంటున్నారు.

**ఇంటి పరిసరాల్లో ఆహ్లాదానికి..**తాడిపత్రిలోని సంజీవనగర్‌కు చెందిన శివశంకర్‌రెడ్డి, ఆదిలక్ష్మీదేవి దంపతులు. ఆయన విద్యుత్తు శాఖ ఉద్యోగి. ఆమె చీరల వ్యాపారం చేస్తున్నారు. ఆమె తీరిక చూసుకుని పెరటి తోట సాగు చేపట్టారు. మామిడి, అరటి బొప్పాయి, దానిమ్మ, సపోట చెట్లు.. మిరప, టమాట, వంకాయ, కాకర, బీర, ఆకు కూరలు, పూల మొక్కలు పెంచుతున్నారు. ఇంట్లో ఉన్న స్థలంతోపాటు.. ప్లాస్టిక్ డబ్బాలు, నీళ్ల సీసాలు, బకెట్లు వంటివి కుండీలుగా మార్చి అందులో వాటిని పెంచుతుండటం అందరినీ ఆకట్టుకుంటోంది. పరిసరాలు ఆహ్లాదంగా ఉండటంతోపాటు ఇంటి అవసరాలు తీరుతాయని వాటిని పెంచుతున్నట్లు ఆదిలక్ష్మీదేవి చెబుతున్నారు. పండ్లు, కాయగూరల కొనుగోల ఖర్చు తగ్గిందని పేర్కొంటున్నారు.

# ఒకటికి.. రెంటికీ ఇబ్బందే..!




పుట్టపర్తి : సత్యసాయి మహాసమాధి దర్శనార్థం వచ్చే భక్తులు, పర్యాటకులు, పట్టణ ప్రజలు.. జిల్లా కార్యాలయాలకు వచ్చే సందర్శకులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి పుట్టపర్తిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు ప్రజా మరుగుదొడ్ల నిర్వహణను గాలికొదిలేశారు. ఫిబ్రవరి 15న మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి.. ఐదు రోజుల్లో పట్టణ పరిధిలోని సామూహిక మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. నేటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారులు వాటికి తాళం తీయలేదు.. శుభ్రం చేయలేదు. నీటి సౌకర్యం కల్పించలేదు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న, జిల్లా అధికారులు, పాలకులు మూతపడిన వాటిని వినియోగంలోకి తీసుకురావడంపై చొరవ చూపడంలేదు. చిత్రావతినదిలో స్నానమాచరించేందుకు భక్తులు, పర్యాటకులు, ప్రజల సౌకర్యార్థం నది ఒడ్డున మరుగుదొడ్లు నిర్మించారు. దాని నిర్వహణను గాలికి వదిలేసి, తాళం వేశారు. భక్తులు, ప్రజలు నది ఒడ్డున కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

పట్టణంలోని గోకులం వద్ద నిర్మించి మరుగుదొడ్లు.. ప్రభుత్వ కార్యాలయాల సందర్శకులకు, ఆర్టీసీ సిబ్బందికి ఎంతో ఉపయోగకరంగా ఉండేది. దానికి తాళం వేయడంతో వారు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు, ఎనుములపల్లి చెరువు తదితర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లకు రెండేళ్లుగా తాళం తీయలేదు. ః సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వచ్చే రోగులు, ప్రజల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లకు ఏడేళ్లుగా తాళం తీసిన దాఖలాలు లేవు. ఆసుపత్రి వచ్చే రోగులు, వారి సహాయకులు ఆరుబయట కాలకృత్యాలు తీర్చుకునే దుస్థితి ఏర్పడుతోంది.

వినియోగంలోకి తీసుకొస్తాం : ప్రహ్లోద, కమిషనర్, పుట్టపర్తి

మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు సామూహిక మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నీరు, విద్యుత్తు సరఫరా ఏర్పాటు చేస్తాం. ప్రజలకు ఇబ్బందులు తొలగిస్తాం.

# అక్రమాల లోతెంత?

విశాఖపట్నం: భీమిలి వద్ద తీరంలో వైకాపా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి సాగించిన అక్రమాల లోతులను అధికారులు పరిశీలిస్తున్నారు. సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన కట్టడాలను పూర్తిగా తొలగించి పూర్వస్థితి తీసుకురావాలని హైకోర్టు ఇటీవల ఆదేశించింది. ఈ నేపథ్యంలో పునాది ఎంత లోతు ఉంది? ఎంత ఖర్చు అవుతుంది? అని అంచనా వేయడానికి నిర్ణయించుకున్నారు. రెండు రోజుల కిందట మనుషులతో పునాదుల వద్ద సమాంతరంగా తవ్వి లోతును గుర్తించేందుకు ప్రయత్నించగా సాధ్యపడలేదు. దీంతో బుధవారం జేసీబీతో పునాది పక్కన ఇసుక తవ్వి లోతు పరిశీలించారు. పునాదిని నిర్మించిన తీరు చూసి ప్లానింగ్ అధికారులు ఖంగుతిన్నారు. 588 మీటర్ల పొడవున్న పునాది సుమారు 6-8 అడుగుల్లోతు వరకు ఉంది. అడుగు భాగాన పునాది వెడల్పు 10 అడుగుల మేర ఉంది. కోర్టు ఆదేశాల ప్రకారం ఇదంతా పూర్తిగా తొలగించడానికి రూ.50 లక్షలపైగా ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే



స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీ, ఇతర నిర్మాణాలు కూల్చడానికి రూ.4లక్షలు ఖర్చు అయినట్లు జీవీఎంసీ అధికారులు తెలిపారు. కట్టడాలు కూల్చడానికి పెట్టిన ఖర్చు నేహారెడ్డికి చెందిన అవ్యాన్ సంస్థ నుంచి వసూలు చేయాలని కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

**నక్షత్రాల హోటల్‌కేనా?:** విజయసాయిరెడ్డి కుమార్తె భీమిలి తీరాన్ని ఆనుకుని అవ్యాన్ ఎల్‌ఎల్‌పీ సంస్థ పేరిట ఉన్న స్థలంలో భారీ నిర్మాణం చేపట్టడానికి ప్రణాళికలు చేశారు. సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘన అంశం తెరపైకి వచ్చిన సమయంలో ఐదు నక్షత్రాల హోటల్ నిర్మాణం కోసమే శాశ్వత కట్టడాలు చేపడుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం సముద్రానికి దగ్గరిగా నిర్మించిన ప్రహరీ పునాదులు పరిశీలించగా.. అడుగున పది అడుగుల మేర వెడల్పుతో కాంక్రీట్ పర్చడం హోటల్ కోసమేనని స్పష్టమవుతోందని పలువురు భావిస్తున్నారు.

17న పరిశీలన: తీరంలో శాశ్వత కట్టడాలను కూల్చడానికి అయ్యే ఖర్చుతోపాటు, నిర్మాణాల వల్ల పర్యావరణానికి జరిగిన నష్టాన్ని అధ్యయనం చేసేందుకు కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ అధికారులతో నిపుణుల కమిటీతో అంచనా వేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నిపుణులు కమిటీలో అధికారి ఈనెల 17వ తేదీన పరిశీలించే అవకాశం ఉంది. పర్యావరణానికి జరిగిన నష్టం అంచనా వేసి కోర్టుకు చెప్పాల్సి ఉండటంతో కేసు వాయిదాకు ముందే ఈ తనిఖీ పూర్తి చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులకు కోర్టు నిర్దేశం చేసింది. అయితే ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.

# సొంతింటి కలకు కొండంత అండ

నక్కపల్లి : సొంత గూడు ఉండాలని ప్రతి కుటుంబం కోరుకుంటుంది. గడిచిన వైకాపా పాలనలో జగనన్న ఇళ్ల పేరిట ఆర్భాటంగా మొదలు పెట్టిన గృహ నిర్మాణాలకు సరైన సహకారం అందించక పోవడంతో అవన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తి నిర్మాణాలను కొనసాగించేలా తీపికబురు చెప్పింది. లబ్ధిదారుల్లో వెనుకబడిన వర్గాలకు అదనపు ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించింది. దీని ద్వారా అనకాపల్లి జిల్లాలో వేలాదిమందికి మేలు జరగనుంది.అయిదేళ్ల పాలనలో జిల్లాలో 61 వేలకు పైగా ఇళ్లను మంజూరు చేశారు. దీనికి కేవలం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం రూ. 1.8 లక్షలు అమలు చేస్తూ, జగన్ పేరును ప్రచారం చేసుకున్నారు. కాగా ధరాభారం, ప్రోత్సాహం లేకపోవడంతో చాలామంది ఇళ్లను నిర్మించుకోలేక పోయారు. జగన్ అధికారం కోల్పోయేనాటికి అసలు ప్రారంభం కానివి, వివిధ స్థాయిల్లో ఆపేసినవి సుమారు 40 వేలకు వరకు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ఆసక్తి ఉన్న లబ్ధిదారులను గుర్తించి గడిచిన రెండు నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ పెట్టి చాలా ఇళ్లను పూర్తిచేయించగా, జిల్లాలో సుమారు 5500 వరకు ఉన్నాయి. ప్రస్తుతం మరో ఏడువేల ఇళ్లను పూర్తి చేయించే పనిలో ఉన్నారు. ఇవన్నీ పోనూ మిగిలిన వాటిలో దాదాపు బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల వారు ఎక్కువగా ఉండటంతో వీరందరికీ అండగా నిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. ఈ క్రమంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, చేనేత వర్గాలకు అదనపు ఆర్థిక సాయం చేయనుంది. ఆ మేరకు జిల్లా పరిధిలో దాదాపు 26,800 ఇళ్లను నిర్మించాల్సి ఉంది. ఇందులో ఓసీలు సుమారు 5800 మంది ఉన్నారు. ఇవి మినహాయిస్తే, దాదాపు 21 వేల మందికి మేలు జరగనుంది. ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం ఇలాంటి వివరాలను సేకరించే పనిలో పడింది.

**సాయం ఇలా..**

ఎస్సీ, బీసీ, చేనేతలకు: రూ. 50 వేలుఎస్టీలు: రూ. 75 వేలు

ఎస్టీల్లో బాగా వెనుకబడిన వారికి: రూ. లక్షజిల్లాలో ఇళ్ల పరిస్థితి ఇది

మొత్తం ఇళ్లు: 61,505పూర్తయినవి: 26,699ప్రారంభం కానివి: 17,559వివిధ దశల్లో నిలిచినవి: 17,247

**సద్వినియోగం చేసుకోండి**


అదనపు ఆర్థిక సహాయం వినియోగించుకుని ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. ప్రస్తుత యూనిట్ విలువ రూ.1.80 లక్షలు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పీవీటీజీలకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం అందిస్తుందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 17,749 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. వీటిలో ఎస్సీ, ఎస్టీ బీసీలకు చెందిన 13,548 మంది లబ్ధిదారులకు రూ.70.04 కోట్ల అదనపు ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. జిల్లాలో మే చివరినాటికి 13,687 గృహాలు పూర్తి చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించుకున్నామన్నారు.

చురకలు



## భర్తను మిస్ అయినప్పుడు రకుల్ ఏం చేస్తుందో చూడండి..!

హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ గత ఏడాది ఫిబ్రవరి 21న ప్రియుడు జాకీ భగ్నానితో వివాహ బంధంలో అడుగు పెట్టింది. ఇటీవలే రకుల్ ప్రీత్‌సింగ్, జాకీ భగ్నాని మొదటి వివాహ వార్షికోత్సవం జరుపుకున్నారు. గతంలో మాదిరిగా రకుల్ ప్రీత్ సింగ్ వరుస సినిమాలతో బిజీగా లేదు. టాలీవుడ్‌లో ఈ అమ్మడు సినిమాలు చేయడం లేదు. కానీ బాలీవుడ్‌లో మాత్రం ఈ అమ్మడికి ఆఫర్లు దక్కాయి. ఇటీవలే ఈ అమ్మడు మేరే హస్బెండ్ కీ బివి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా ఇంకా థియేటర్‌లోనే ఉంది. అప్పుడే మరో సినిమా షూటింగ్‌లో రకుల ప్రీత్ సింగ్ పాల్గొంటుంది. హిందీ సినిమా దే దే ప్యార్ దే 2 సినిమా షూటింగ్ నిర్మాణ దశలో ఉంది. ఇటీవల రకుల్ ప్రీత్ సింగ్ ఆసక్తికర పోస్ట్ షేర్ చేసింది. గత కొన్ని రోజులుగా మేరే హస్బెండ్ కీ బివి సినిమాకు సంబంధించిన విషయాలను షేర్ చేస్తూ ప్రమోట్ చేస్తూ వచ్చిన రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా భర్తను మిస్ అవుతున్నట్లు పోస్ట్ షేర్ చేసింది. ఎప్పుడైనా భర్తను మిస్ అయితే అతడి జాకెట్‌ను ధరించాలంటూ సూచించింది. షూటింగ్ కారణంగా జాకీ భగ్నానిని మిస్ అవుతున్నట్లు పేర్కొన్న రకుల్ ప్రీత్ సింగ్ అతడి జాకెట్ ధరించింది. ఆ జాకెట్‌పై జేబీ అని రాసి ఉంది. జాకీ భగ్నానిని సుదీర్ఘ కాలం పాటు ప్రేమించిన రకుల్ ప్రీత్ సింగ్ గత ఏడాది అతడితో మూడు ముడులు వేయించుకుని, ఏడు అడుగులు నడిచిన విషయం తెల్సిందే. 2021లో నటుడు,




నిర్మాత అయిన జాకీ భగ్నానితో తాను రిలేషన్‌లో ఉన్నట్లు రకుల్ ప్రీత్ సింగ్ అధికారికంగా ప్రకటించింది. అంతకు ముందు నుంచే వీరిద్దరి మధ్య రిలేషన్ కొనసాగుతుంది అనే వార్తలు వచ్చాయి. ప్రేమ విషయం అధికారికంగా ప్రకటించిన మూడు సంవత్సరాల తర్వాత పెళ్లి పీటలు ఎక్కింది. ఆ మధ్య రకుల్ ప్రీత్ సింగ్ కెరీర్ ఖతం అని అంతా అనుకున్నారు. కానీ అనూహ్యంగా బాలీవుడ్‌లో వరుస సినిమాల్లో ఆఫర్లు లభిస్తున్నాయి. దాంతో ఈ అమ్మడు మరికొన్నాళ్ల పాటు హీరోయిన్‌గా బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. తాజాగా మేరే హస్బెండ్ కీ బివి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రకుల్‌కి నిరాశ మిగిలింది. ప్రస్తుతం చేస్తున్న దే దే ప్యార్ దే 2 సినిమాతో అయినార కుల్ ప్రీత్ సింగ్‌కి హిట్ దక్కేనా చూడాలి. బాలీవుడ్‌లో ఒక్క హిట్ పడితేనే ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్ బాలీవుడ్‌లో మరికొన్ని సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంటుంది. తద్వారా ఈ అమ్మడికి టాలీవుడ్, కోలీవుడ్‌లోనూ ముందు ముందు ఆఫర్లు దక్కే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రకుల్ ప్రీత్ సింగ్ టాలీవుడ్‌లో ఒకానొక సమయంలో స్టార్ హీరోలకు సైతం డేట్లు ఇవ్వలేనంత బిజీగా సినిమాలు చేసింది. కానీ కొన్నాళ్లకే కనిపించకుండా పోయింది. బాలీవుడ్‌లో అయినా ఈ అమ్మడికి లక్ కలిసి వస్తుందా అనేది చూడాలి.

## కొత్త ఇన్నింగ్స్‌కి సిద్దమవుతున్న పీసీ

గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా ప్రస్తుతం హాలీవుడ్ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉంది. ఇటీవలే ఈ అమ్మడు తెలుగులో రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న సినిమాకు ఓకే చెప్పిన విషయం తెల్సిందే. ఆ సినిమా కాకుండా మరే ఇండియన్ మూవీస్‌లోనూ ఈ అమ్మడు నటించడం లేదు. హాలీవుడ్‌లో ఈమె సినిమాలతో పాటు, వెబ్ సిరీస్‌ల్లోనూ నటిస్తుంది. ముఖ్యంగా ప్రియాంక చోప్రా నటించిన హాలీవుడ్ వెబ్ సిరీస్ సిటాడెల్‌కి మంచి స్పందన వచ్చింది. దాంతో ప్రియాంక చోప్రా మరిన్ని వెబ్ సిరీస్‌లను చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రియాంక చోప్రా దారిలోనే ఆమె కజిన్ పరిణీతి చోప్రా (పీసీ) సైతం వెబ్ కంటెంట్‌లో అరంగేట్రంకి సిద్ధం అవుతుంది. ఇటీవల 'చంకీలా' సినిమాతో ఓటీటీ ప్రేక్షకుల ముందుకు పరిణీతి చోప్రా వచ్చింది. థియేట్రికల్ రిలీజ్‌ను స్కిప్ చేసిన మేకర్స్ నేరుగా ఓటీటీ ద్వారా చంకీలా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చారు. ఇంతియాజ్ అలీ దర్శకత్వంలో వచ్చిన అమర్ సింగ్ చంకీలా సినిమా నెట్ ఫ్లిక్స్‌లో సెన్సేషల్ విజయాన్ని సొంతం చేసుకున్న



నేపథ్యంలో ముందు ముందు మరిన్ని వెబ్ కంటెంట్‌లో నటించాలనే ఉద్దేశంతో పరిణీతి చోప్రా ఉందని తెలుస్తోంది. అందుకే ఇటీవల సోను రజ్జాన్, జెన్నిఫర్ వింగెట్‌లతో ఒక మిస్టరీ థ్రిల్లర్ వెబ్ సిరీస్‌లో నటించేందుకు సిద్ధం అయింది. పరిణీతి చోప్రా బాలీవుడ్‌లో అడుగు పెట్టి చాలా సంవత్సరాలు అయింది. ఈమెతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మలు టాప్ స్టార్ హీరోయిన్స్‌గా పేరు దక్కించుకున్నారు. కానీ ఈమెకు మాత్రం ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కలేదు. స్టార్ హీరోయిన్‌లతో పోటీలో ఈమె వెనుక పడింది. పెద్ద సినిమాల్లో ఈమెకు ఆఫర్లు దక్కలేదు. చేసిన సినిమాలు కొన్ని బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సొంతం చేసుకోలేదు. దాంతో అమర్ సింగ్ చంకీలా ప్రాజెక్ట్‌తో ఓటీటీలో అడుగు పెట్టింది. తక్కువ సమయంలోనే ఈ అమ్మడు ఓటీటీలో మంచి పాపులారిటీని సొంతం చేసుకుంది. అందుకే వెండి తెరపై దక్కని గుర్తింపును ఓటీటీ ద్వారా ఈ అమ్మడు దక్కించుకునే ప్రయత్నాలు చేస్తుంది. అమర్ సింగ్ చంకీలా సినిమాతో వచ్చిన ఓటీటీ గుర్తింపును సద్వినియోగం చేసుకోవడం కోసం వెంటనే వెబ్ సిరీస్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మిస్టరీ థ్రిల్లర్ వెబ్ సిరీస్‌లో పరిణీతి చోప్రాతో పాటు హర్లీన్ సేథి, తాహిర్ రాజ్ భాసిన్, అనుప్ సోని, సుమీత్ వ్యాస్, చైతన్య చౌదరి వంటి ప్రముఖ నటీనటులు నటిస్తున్నారు. ఈ వెబ్ సిరీస్‌పై పరిణీతి చాలా ఆశలు పెట్టుకుంది. వెబ్ సిరీస్‌లు, వెబ్ మూవీస్‌తో ఆకట్టుకుని ఆ తర్వాత తిరిగి సినిమాల్లో నటించి వెండి తెరపై స్టార్‌డం దక్కించుకోవాలని ఈ అమ్మడు ఆశ పడుతోంది. మరి పరిణీతి చోప్రా కొత్త ఇన్నింగ్స్ ఎంత వరకు సక్సెస్ అవుతుందో చూడాలి.




## వావ్.. ఇడియట్ సౌండ్ తో మాస్ జాతర సాంగ్




మాస్ మహారాజా రవితేజ అభిమానులకు ఓ మ్యూజికల్ ట్రీట్ రెడీగా ఉంది. రవితేజ, శ్రీలీల జంటగా వస్తున్న కొత్త చిత్రం మాస్ జాతర నుంచి 'తూ మేరా లవర్' అనే ఫస్ట్ సింగిల్ ప్రోమో విడుదలయ్యింది. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా జూలైలో థియేటర్లకు రాబోతున్నట్టు సమాచారం. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ పాట ప్రమోకి ఓ ప్రత్యేక హైప్ ఏర్పడింది. ఎందుకంటే, ఇది 'ఇడియట్' సినిమా నుంచి 'చుపులతో' అనే సాంగ్ ట్యూన్‌ను రీ యూజ్ చేసినట్టు అనిపిస్తోంది. ఇది మ్యూజికల్ రీక్రియేషన్ మాత్రమేనా? లేక అసలు పాటనే తీసుకువచ్చారా? అన్నదానిపై క్లారిటీ రాలేదు కానీ ఈ బజ్ మాత్రం భారీగా నడుస్తోంది. ప్రోమోలో శ్రీలీల తన గ్లామర్ తో స్క్రీన్‌ని బంగారు వెలుగులా మెరిపించింది. రవితేజ ఎప్పటిలాగే ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఈ పాటను భీమ్స్ సెసిరోలియో కంపోజ్ చేయగా, మొత్తం పాట ఏప్రిల్ 14న విడుదల కానుంది. ప్రస్తుతం ఇదే టాక్ ట్రాక్‌గా మారి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సామజవరగమన సినిమాకు రైటర్‌గా గా వర్క్ చేసిన భాను భోగవరపు ఈ సినిమాతో డైరెక్షన్‌లోకి అడుగుపెడుతున్నాడు. రవితేజ పోలీస్ అవతారంలో మరోసారి మాస్ రోల్ లో కనిపించబోతున్నాడని తెలుస్తోంది. మాస్ జాతర షూటింగ్ దాదాపుగా చివరి దశలో ఉందని టీమ్ వెల్లడించింది. త్వరలోనే ఆఫీషియల్ రిలీజ్ డేట్ ప్రకటించనున్నారు. ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీకర స్టూడియోస్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవితేజ కెరీర్‌లో మళ్లీ ఓ మాస్ ఫెస్టివల్‌ని తెచ్చే ప్రయత్నంగా ఈ చిత్రాన్ని చూస్తున్నారు. పాట బజ్, ప్రోమో వీడియో, మాస్ ఆడియెన్స్‌కు బాగా కనెక్ట్ అవుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక సినిమాను జూన్ లోనే విడుదల చేసే అవకాశం ఉంది. మొదట సంక్రాంతికి విడుదల చేయాలని అనుకున్నారు. కానీ మధ్యలో రవితేజ గాయపడడంతో బ్రేక్ తీసుకు రావాల్సి వచ్చింది. అనంతరం జెట్ స్పీడ్ లో ఫినిష్ చేసి సమ్మర్ మిడ్ లోనే విడుదల చేయాలాని చూసినప్పటికీ వర్కౌట్ కాలేదు. ఇక జూన్ మధ్యలో గ్రాండ్ గా విడుదల చేయాలని ఫిక్స్ అయ్యారు. ఇక న్యూ డేట్ పై ఎప్పుడు క్లారిటీ ఇస్తారో చూడాలి.

## అఖండ 3కి పర్ఫెక్ట్ లీడ్..?



నందమూరి బాలకృష్ణ ఈమధ్య వరుస సినిమాలతో సూపర్ ఫామ్ లో ఉన్నాడు. రీసెంట్ గానే సంక్రాంతికి డాకు మహారాజ్ తో వచ్చి సక్సెస్ అందుకున్న బాలయ్య నెక్స్ట్ అఖండ 2 తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. బాలకృష్ణ బోయపాటి శ్రీను కాంబినేషన్ అంటే నెక్స్ట్ లెవెల్ అన్నట్టే లెక్క. బాలయ్య ని ఎలా చూపిస్తే ఫ్యాన్స్ ఊగిపోతారో బోయపాటికి బాగా తెలుసు అందుకే ఆయన సినిమాల్లో బాలకృష్ణ ఉగ్ర రూపం చూపిస్తారు. ఇక వీరి కాంబినేషన్ లో వచ్చిన అఖండ అయితే అప్పటివరకు ఉన్న బాలయ్య సినిమా రికార్డులను బ్రేక్ చేసి సరికొత్త సంచలనాలు సృష్టించింది. ఐతే ప్రస్తుతం ఆ సినిమా సీక్వెల్ గా అఖండ 2 సినిమా చేస్తున్నారు. అఖండ ఎంత హిట్ అయ్యిందో ఆ సీక్వెల్ ని అదే రేంజ్ లో ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. అందుకే ఈమధ్య జరిగిన మహా కుంభమేళాలో ఈ సినిమా షూటింగ్ చేశారు. ఇక ఇప్పుడు హిమాలయాల్లో కూడా షూట్ చేయబోతున్నారని తెలుస్తుంది. అఖండ 2 తో బాలకృష్ణ ఫస్ట్ టైం పాన్ ఇండియా అటెంప్ట్ చేస్తున్నారు. అఖండ సినిమా నార్త్ ఆడియన్స్ కూడా ఇష్టపడ్డారు. అఖండ హిందీ డబ్బింగ్ కి మంచి వ్యూస్ వచ్చాయి. అందుకే అఖండ 2 ని డైరెక్ట్ గా రిలీజ్ చేసేలా చూస్తున్నారు. ఐతే అఖండ 2 తో బోయపాటి ప్లానింగ్ ఎవరు ఊహించని విధంగా ఉంటుందని అంటున్నారు. ముఖ్యంగా సినిమా లో బాలయ్య ఎలివేషన్స్, యాక్షన్ వేరే లెవెల్ అని తెలుస్తుంది. అంతేకాదు అఖండ 2 లో పార్ట్ 3 కి సంబందించిన అదిరిపోయే ట్విస్ట్ రివీల్ చేస్తారని తెలుస్తుంది. అఖండ 2 చివర్లో అఖండ 3 కి లీడ్ ఇస్తారట.

అఖండ 2 లో కథ వేరే మలుపు తీసుకోగా పార్ట్ 2 పూర్తి స్థాయిలో ఆధ్యాత్మికతతో ఉంటుందని అంటున్నారు. అంతేకాదు ఈ సినిమాలో బాలయ్య అఘోరా రోల్ మరింత పవర్ ఫుల్ గా ఉండబోతుందని తెలుస్తుంది. మొత్తానికి బోయపాటి అఖండ ని చాలా ప్రెస్టీజియస్ గా తీసుకున్నారని అనిపిస్తుంది. అఖండ 2 మాత్రమే కాదు అఖండ 3 కూడా ఉంటుందని పార్ట్ 2 లో మూడో భాగానికి సంబందించిన ట్విస్ట్ ఉంటుందని అది ఆడియన్స్ కి ఫ్యూజులు ఎగిరిపోయేలా చేస్తుందని చెప్పుకుంటున్నారు. మరి బాలయ్య, బోయపాటి ఏం చేస్తున్నారో కానీ అఖండ తరహాలో అఖండ 2 థియేటర్ లు కూడా ఫ్యాన్స్ పూనకాలతో ఊగిపోయేలా ఉన్నారని మాత్రం అర్థమవుతుంది.

## డెకాయిట్ షూటింగ్ అప్డేట్ ఇచ్చిన మృణాల్

సీతారామం సినిమాతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిరస్థానాన్ని సంపాదించుకున్న మృణాల్ ఠాకూర్ మొదటి సినిమాతోనే మంచి సక్సెస్ అందుకుంది. అయితే మృణాల్ చివరగా విజయ్ దేవరకొండతో కలిసి ఫ్యామిలీ స్టార్ సినిమాతో ఆడియన్స్ ను పలకరించింది. ప్రస్తుతం మృణాల్ అడివి శేష్ తో కలిసి డెకాయిట్ సినిమాలో నటిస్తోంది. ఈ సినిమాలో మృణాల్ ఫస్ట్ లుక్ ను చూసి అందరూ ఆశ్చర్యపోయారు. మృణాల్ ఫస్ట్ లుక్ తర్వాత డెకాయిట్ నుంచి ఎలాంటి అప్డేట్ వచ్చింది లేదు. దీంతో ఈ సినిమా అప్డేట్స్ తెలుసుకోవాలని ఆడియన్స్ ఎంతో ఆసక్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే మృణాల్ డెకాయిట్ గురించి అప్డేట్ ఇచ్చింది. పేపర్ వెయిట్‌ను చేత్తో గుండ్రంగా తిప్పుతూ తాను డెకాయిట్ షూట్ లో ఉన్న విషయాన్ని వెల్లడించింది మృణాల్. ఇప్పటివరకు రొమాంటిక్, ఫ్యామిలీ డ్రామా సినిమాల్లో నటించిన మృణాల్ కు ఈ సినిమా పూర్తి భిన్నంగా ఉండనుంది. మృణాల్ నటిస్తున్న మొదటి థ్రిల్లర్ సినిమా డెకాయిట్.



ఫస్ట్ లుక్ లో మృణాల్ ను చూసి షాకైన అభిమానులు ఈ యాక్షన్ థ్రిల్లర్ లో అమ్మడిని ఎప్పుడెప్పుడు చూస్తామా అని ఎదురుచూస్తున్నారు. పోస్టర్ లో మృణాల్ లుక్ చాలా భీకరంగా కనిపించడంతో డెకాయిట్ పై ఉన్న అంచనాలు మరింత పెరిగాయి. ఇదిలా ఉంటే డెకాయిట్ మూవీతో షానీల్ డియో దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నాడు. సుప్రియ యార్లగడ్డ, సునీల్ నారంగ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతుంది. తనకు ద్రోహం చేసిన తన ఎక్స్ లవర్ పై ప్రతీకారం తీర్చుకునే కోపంతో ఉన్న దోషి కథగా డెకాయిట్ ఉండబోతుంది. ఈ సినిమాపై అడివి శేష్, మృణాల్ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వాస్తవానికి ఈ సినిమా ముందుగా శృతి హాసన్ దగ్గరకు వెళ్లింది. టీజర్ కూడా రిలీజ్ చేసిన తర్వాత కొన్ని కారణాల వల్ల శృతి తప్పుకోవడంతో ఆ ప్లేస్‌లోకి మృణాల్ వచ్చింది.

## ది ఐ ట్రైలర్ టాక్..!

సౌత్ స్టార్ హీరోయిన్ శృతి హాసన్ తన మొదటి హాలీవుడ్ సినిమాగా ది ఐ చేస్తుంది. కొన్నాళ్లుగా సైలెంట్ గా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి లేటెస్ట్ గా ట్రైలర్ రిలీజైంది. ది ఐ ట్రైలర్ చూస్తే ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్ గా అనిపిస్తుంది. ది ఐ ట్యాగ్ లైనే చావు అన్నదే ఎండ్ కాకపోతే ఏం జరుగుతుంది అన్నది పెట్టారు. హ్యాపీగా బోయ్ ఫ్రెండ్ తో ఎంజాయ్ చేస్తున్న శృతి హాసన్ లైఫ్ ఒక్కసారిగా తలకిందులు అవుతుంది. అంతేకాదు ఎవరో తనని చూస్తున్నట్టు ఆమెకు అనిపిస్తుంది. ఇంతకీ అసలు ఏం జరుగుతుంది.. దీని వెనుక ఉన్నది ఎవరు.. వాటికి కారణాలు ఏంటి తెలియాలంటే ది ఐ చూడాల్సిందే. ది ఐ సినిమాలో మార్క్ రౌలే శృతికి జోడీగా నటిస్తున్నాడు. ఈ సైకలాజికల్ థ్రిల్లర్ ట్రైలర్ మాత్రం ఇంప్రెసివ్ గా ఉంది. ముందుగా శృతి హాసన్ లుక్ అప్పియరెన్స్ అంతా పర్ఫెక్ట్ గా అనిపించింది. శృతి హాసన్ ఈమధ్య సౌత్ సినిమాలు తగ్గించింది. ఐతే హాలీవుడ్ సినిమాకు అమ్మడికి మంచి పేరు వచ్చేలా ఉంది. ది




ఐ సినిమాను డాఫ్నె షోమాన్ డైరెక్ట్ చేయగా ఎమిలీ కార్ల్ టన్ ఈ సినిమా కథ అందించారు. ఇలాంటి సైకలాజికల్ థ్రిల్లర్ సినిమాలు ముఖ్యంగా హాలీవుడ్ లో ఎన్నొచ్చినా వేటికవే ప్రత్యేకంగా ఉంటాయి. ఐతే శృతి హాసన్ ఈ సినిమాలో నటించడం ప్రత్యేకంగా ఉంది. మరి శృతి హాసన్ హాలీవుడ్ ఎంట్రీ ఎలాంటి రిజల్ట్ అందిస్తుంది అన్నది చూడాలి. ప్రతి హీరోయిన్ ఫైనల్ గా హాలీవుడ్ సినిమాలో నటించాలన్న డ్రీం ఉంటుంది. బహుశా శృతి హాసన్ కి ది ఐ తో ఆ కల నెరవేరిందని చెప్పొచ్చు. సినిమా సైకలాజికల్ థ్రిల్లరే అయినా శృతి హాసన్ ఫ్యాన్స్ కోరుకునే బోల్డ్ అంశాలు కూడా ఉన్నట్టు తెలుస్తుంది. త్వరలో రిలీజ్ కాబోతున్న ది ఐ సినిమా శృతి హాసన్ కి హాలీవుడ్ లో సూపర్ హిట్ తో వెల్కం చెబుతుందా లేదా అన్నది చూడాలి. ఐతే శృతి మాత్రం ఈ సినిమాకు ది బెస్ట్ ఎఫర్ట్ పెట్టినట్టు అనిపిస్తుంది. మరి రిజల్ట్ ఆమెకు సంతృప్తికరంగా ఉంటుందా లేదా అన్నది చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536